పెన్ పవర్
తెలంగాణ రౌండప్



# ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొందాం

## సదస్సులో మంత్రులు తుమ్మల, సీతక్క, శ్రీహరి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని రాష్ట్ర వ్యవసాయ, పంచాయతీరాజ్, పశుసంవర్ధకశాఖల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, వాకిటి శ్రీహరి తెలిపారు. రైతులకు, రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామానికి సమగ్రాభివృద్ధి ప్రణాళిక రూపొందించి, స్వల్పకాలిక అవసరాలతో పాటు వచ్చే ఐదు, పదేళ్లకు ఉపయుక్తమయ్యే పనులను ఎంపిక చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంపై హైదరాబాద్‌లోని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో మంత్రులు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ సంజయ్‌జాజు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ దివ్యాదేవరాజన్, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల కార్యదర్శులు సురేంద్రమోహన్, ఇలంబర్తి, ఇతర ఉన్నతాధికారులు, జిల్లాల అదనపు కలెక్టర్లు, సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీఓలు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్యశాఖల అధికారులు పాల్గొన్నారు. జీరాంజీ పథకంలో చేపట్టిన పనుల ప్రణాళికను మంత్రులు విడుదల చేశారు. సదస్సులో తుమ్మల మాట్లాడుతూ.. భూగర్భ జలాలను అంచనా వేసి, ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించాలని, ఆటో స్టార్టర్లతో రేయింబవళ్లు మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా చూడాలని సూచించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు గ్రామాలను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని, శాఖల మధ్య సమన్వయంతో ఒక పనితో అనేక ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మంత్రి శ్రీహరి మాట్లాడుతూ.. 'కరవు పరిస్థితుల్లో పశువుల పెంపకం, సంరక్షణ వంటి వాటిపై అన్నదాతలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు గ్రామపంచాయతీల వెబ్‌సైట్‌లను ప్రారంభించారు. ప్రతి గ్రామ జనాభా,

-4 లో

## రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో

# ఆకస్మిక తనిఖీలు చేస్తా



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, అవినీతి, విధుల్లో అలసత్వాన్ని ప్రదర్శిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇకపై రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, హౌసింగ్ శాఖల అధికారులతో మంత్రి పొంగులేటి సుదీర్ఘంగా సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సమస్యలు, భూముల రీసర్వే, 22-ఎ కేసులు, భూభారతి దరఖాస్తులు, ఎసైన్డ్ భూముల సమస్యలపై మాట్లాడారు. ఇందులో తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన ఆదేశాలను శుక్రవారం నుంచే కార్యాలయాల్లో అమలు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసేందుకు రూ.లక్ష డిమాండ్ చేసినట్లు ఓ మహిళ ఫిర్యాదు చేసిన ఘటనపై సంబంధిత తహసీల్దార్‌కు ఛార్జి మెమో జారీ చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'అధికారులు పద్ధతి మార్చుకోవాలి. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తే సహించబోం. సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగే పరిస్థితి రావద్దు. అవినీతి ఆరోపణలను విచారించి సస్పెన్షన్ సహా కఠిన చర్యలు తీసుకుంటాం. రీసర్వే, ఇందిరమ్మ ఇళ్లపై వేగం, భూ రీసర్వే పనులను పెండింగ్‌లో పెట్టే అధికారులపై

-4 లో

# కబ్జాకోరులకు మల్కాజ్‌గిరి మహిళా సీపీ షాక్..
# వృద్ధురాలికి దక్కిన రూ.40 కోట్ల భూమి!



- హైదరాబాద్‌లో 80 ఏళ్ల వృద్ధురాలి భూమికి రక్షణ
- రూ.40 కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నం
- మల్కాజ్‌గిరి సీపీ సుమతిని ఆశ్రయించిన వృద్ధురాలు
- రాజకీయ ఒత్తిళ్లను కాదని వృద్ధురాలికి న్యాయం చేసిన సీపీ
- భూ కబ్జాకు యత్నించిన వారిపై చర్యలకు పోలీసుల హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 80 ఏళ్ల ఓ వృద్ధురాలు భూకబ్జాదారుల చెర నుంచి తన రూ. 40 కోట్ల విలువైన ఆస్తిని దక్కించుకున్నారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ (సీపీ) సుమతి చొరవతో ఆమెకు సకాలంలో న్యాయం చేకూరింది. రాజకీయ ఒత్తిళ్లను సైతం లెక్కచేయకుండా నిందితులపై కఠినంగా వ్యవహరించి, వృద్ధురాలికి బాసటగా నిలిచిన సీపీపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన సదరు మహిళకు సుమారు రూ. 40 కోట్ల విలువైన ఖాళీ స్థలం ఉంది. దశాబ్దాలుగా ఆ భూమి ఆమె స్వాధీనంలోనే ఉన్నప్పటికీ, ఇటీవల కొందరు భూకబ్జాదారులు ఆ ఆస్తిపై కన్నేశారు. అక్రమంగా స్థలంలోకి చొరబడి, అది తమదేనంటూ సదరు వృద్ధురాలిని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ క్రమంలో బాధిత మహిళ ధైర్యంతో మల్కాజ్‌గిరి సీపీ సుమతిని ఆశ్రయించారు. తన భూమికి సంబంధించిన అన్ని దస్తావేజులను సమర్పించి,

-4 లో

## ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్ ను

# విజయవంతం చేయండి

- ఈ నెల 24న ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్
- తన క్యాంప్ కార్యాలయంలో బంద్ పోస్టర్ ను ఆవిష్కరించిన జగదీశ్ రెడ్డి
- ఆటో కార్మికుల రక్షణకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్




**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 24న చేపట్టబోయే ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్ పోస్టర్‌ను బీఆర్‌టీయూ నాయకులు, ఆటో డ్రైవర్లతో కలిసి సూర్యాపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఆర్టీసీ యాజమాన్యానికి ఈ-ఆటోలను కేటాయించే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని, ఆటో కార్మికుల రక్షణకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఇంధన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ ఛార్జీలను పెంచడంతో పాటు ఓలా, ఉబర్, రాపిడోలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే సొంతంగా యాప్‌ను ప్రారంభించాలని సూచించారు. బైక్ టాక్సీల అక్రమ రవాణాను అరికట్టాలని, ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు వారిని ఈ-చలాన్ల నుంచి మినహాయించాలని కోరారు. హైదరాబాద్‌లో ఇతర జిల్లాల ఆటోల అక్రమ రవాణాను అరికట్టాలని, వాహన సారథి లైసెన్స్ విధానాన్ని కొనసాగిస్తూ జీవో 60 ప్రకారం రేడియం స్టిక్కరింగ్ నుంచి ఆటోలకు మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆటో కార్మికులకు ప్రమాద బీమాతో పాటు సాధారణ మరణాలకు కూడా బీమా వర్తింపజేయాలని, 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 24న నిర్వహించే బంద్‌కు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.




## ఆఫీసులో అపరిశుభ్రత.. టాయిలెట్లు
# శుభ్రం చేసిన మంత్రి జూపల్లి



- నాగర్‌కర్నూల్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మిక తనిఖీ
- అధికారుల పనితీరు, ఫైళ్ల జాప్యంపై తీవ్ర ఆగ్రహం
- కార్యాలయంలో అపరిశుభ్రతపై మండిపడిన మంత్రి
- నిరసనగా స్వయంగా టాయిలెట్లు శుభ్రం చేసిన వైనం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారుల నిర్లక్ష్యంపై వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయంలోని టాయిలెట్లను ఆయనే స్వయంగా శుభ్రం చేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మంత్రి జూపల్లి శుక్రవారం పెంట్లవెల్లి రెవెన్యూ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

-4 లో

## రాయదుర్గం భూముల వేలం నిలుపుదలకు

# సుప్రీంకోర్టు నిరాకరణ

### హైకోర్టుకే వెళ్లాలని పిటిషనర్‌కు సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:** శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్ పాన్‌మక్తా(రాయదుర్గం) గ్రామ పరిధిలోని సర్వే నంబరు 83/1లో ఉన్న 5.25 ఎకరాలు, 5.38 ఎకరాల భూముల వేలాన్ని నిలువరించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. టీజీఐఐసీ ఈ నెల 1న ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ జువ్వాడి ప్రణయ్‌సింహారావు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణకు విముఖత వ్యక్తంచేసింది. ఈ అంశంపై ఏవైనా అభ్యంతరాలుంటే హైకోర్టులోనే

-4 లో

# రాయదుర్గం భూముల వేలం నిలుపుదలకు సుప్రీంకోర్టు నిరాకరణ

-3 పేజి తరువాయి

తేల్చుకోవాలని చెబుతూ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదనలు ప్రారంభించడానికి సిద్ధమైన వెంటనే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ 'మీరు దీనిపై హైకోర్టుకు ఎందుకు వెళ్లకూడదు?' అని ప్రశ్నించారు. అందుకు న్యాయవాది బదులిస్తూ 'హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (కంచె గచ్చిబౌలి) భూములకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. అందులో ఉన్న జీవోల్లోని భూములనే ఇప్పుడు వేలం వేస్తున్నారు. ఆ భూముల రక్షణ కోసం ఇదివరకు సుప్రీంకోర్టు నిపుణుల కమిటీని ఏర్పాటుచేసింది.

అందుకే మేం నేరుగా ఇక్కడికొచ్చాం. రాష్ట్ర ప్రభుత్వం 2003 జనవరి 2న జారీచేసిన జీవోలో పేర్కొన్న సర్వే నంబర్లలోని భూములన్నీ వారసత్వ ప్రాధాన్యమున్న ప్రాంతాలు కాబట్టి వాటిని పూర్తిగా రక్షించాలని నిపుణుల కమిటీ చెప్పింది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం అవే భూములకు వేరే నంబరు కేటాయించి వేలం వేయడానికి సిద్ధమైంది. తద్వారా పర్యావరణ సున్నితమైన ప్రాంతాన్ని ధ్వంసంచేయడానికి ప్రయత్నిస్తోంది. దుర్గంచెరువు చుట్టుపక్కల ఉన్న కొండరాళ్లను సంరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం 2003లో ఇచ్చిన జీవోలో స్పష్టంగా ఉంది. ఇదే అంశంపై గత ఏడాది ఏప్రిల్ 3న విచారించిన సుప్రీంకోర్టు

ఈ ప్రాంతాన్ని కేంద్ర సాధికార సంస్థ పరిశీలించి నివేదిక ఇవ్వాలని చెప్పింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీచేసేంత వరకూ ఆ ప్రాంతంలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టడానికి వీల్లేదని ఆదేశించింది" అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అప్పుడు సీజేఐ జోక్యం చేసుకుంటూ సుప్రీంకోర్టు ఇదివరకు ఉత్తర్వులు ఇచ్చిన భూమి, ఈ భూమీ ఒక్కటేనా? అని పిటిషనర్ తరుపు న్యాయవాదిని ప్రశ్నించారు. అందుకు ఆయన స్పందిస్తూ భూములు వేరైనా, అక్కడున్న కొండరాళ్లను సంరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో దీనికీ వర్తిస్తుందని పేర్కొన్నారు. అయితే, ఆ వాదనలను రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, నిరంజన్‌రెడ్డిలు తోసిపుచ్చారు.

సెంట్రల్ యూనివర్సిటీ భూముల కేసు, ఈ కేసు వేరన్నారు. సెంట్రల్ వర్సిటీకి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న భూముల గురించి పిటిషనర్ ఇప్పుడు అభ్యంతరం చెబుతూ కోర్టును తప్పుదోవపట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఆ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్.. ఈ పిటిషన్‌పై విచారణ కొనసాగించడానికి విముఖత వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలపై అభ్యంతరాలుంటే హైకోర్టుకే వెళ్లాలని పిటిషనర్‌కు సూచించారు. అప్పుడు తెలంగాణ అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి జోక్యంచేసుకుంటూ ఈ భూముల వేలం శుక్రవారమే ముగిసినట్లు ధర్మాసనానికి తెలిపారు. దానిపట్ల పిటిషనర్ తరఫు న్యాయవాది నీరజ్ కిషన్‌కౌల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ సున్నితత్వాన్ని పట్టించుకోకుండా అభివృద్ధి పనులు చేపట్టడాన్ని అడ్డుకోవాలని కోరారు. అందుకు సీజేఐ స్పందిస్తూ.. 'మేం ఇప్పుడు ఏం చేయలేం. ముందు మీరు హైకోర్టుకు వెళ్లండి' అని సూచించారు.

అందుకు పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. 'మేం సోమవారం హైకోర్టు ముందుకు వెళ్లేలోపు వేలం ప్రక్రియ పూర్తయిపోతుంది' అని పేర్కొన్నారు. అప్పుడు జస్టిస్ బాగ్చి జోక్యం చేసుకుంటూ..

'ఈ వేలంలో లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేసినా వెంటనే కొండరాళ్లకు వచ్చిన ముప్పేమీ ఉండదు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా న్యాయసమీక్ష జరగాల్సి ఉంది. అయితే 2026 జనవరి 27 నాటి నిపుణుల కమిటీ నివేదికలో ఈ భూములపై పూర్తి నిషేధం లేదు. కేవలం బఫర్‌జోన్ పైనే బ్యాన్ ఉంది. ఆ విషయాలన్నీ హైకోర్టు పరిశీలిస్తుంది. నిపుణుల కమిటీ అక్కడికెళ్లి పరిశీలించి వాస్తవాలను హైకోర్టుకు నివేదించనివ్వండి" అని సూచిస్తూ విచారణను ముగించారు.

# ఫ్లయింగ్ బోర్డర్స్ జాబ్ స్కామ్..

## సూత్రధారి సౌజన్యను పట్టుకున్న విశాఖ పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఐరోపా దేశాల్లో ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను వంచిస్తున్న 'ఫ్లయింగ్ బోర్డర్స్' కన్సల్టెన్సీ నిర్వాహకురాలు సౌజన్యను విశాఖపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వందలాది మంది నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసిన ఈ కేసులో కృష్ణా జిల్లాలో ఆమెను అరెస్ట్ చేశారు.విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల యువతే లక్ష్యంగా ఈ మోసాలకు పాల్పడినట్లు వెల్లడైంది. సుమారు 15 మంది బాధితులు తమ నుంచి రూ.70 లక్షలు వసూలు చేశారని విశాఖలోని గురుద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సెర్చ్ వారెంట్‌తో కృష్ణా జిల్లా పెనమలూరు మండలం తాడిగడపలోని సౌజన్య నివాసానికి చేరుకున్న పోలీసులు, ఆమె తలుపులు తీయకపోవడంతో అతికష్టం మీద లోపలికి ప్రవేశించి అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి నివాసంలో కీలక పత్రాలు, బంగారం, వెండి ఆభరణాలు, ఆస్తి డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఆమెను విశాఖకు తరలిస్తున్నారు.సౌజన్య, ఆమె భర్త శ్రీనివాస్ కలిసి ఈ ఘరానా మోసాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. విదేశీయుల పేర్లతో నకిలీ ఈ-మెయిల్ ఐడీలు సృష్టించి, సోషల్ మీడియా ద్వారా కృత్రిమ ఇంటర్వ్యూలు నిర్వహించేవారు. తమ గ్యాంగ్ సభ్యులతోనే 'మాకు ఉద్యోగాలు వచ్చాయి' అని సోషల్ మీడియాలో సానుకూల కామెంట్లు పెట్టించి, నిరుద్యోగులను నమ్మించేవారు. ఇప్పటికే ఈ దంపతులపై కృష్ణా జిల్లాలో పలు కేసులు నమోదు కాగా, సుమారు 750 మంది బాధితుల నుంచి రూ.11.46 కోట్లు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో హైదరాబాద్‌లో అరెస్టయి బెయిల్‌పై విడుదలైన సౌజన్యను, తాజా ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు మరోసారి అరెస్ట్ చేశారు

## ఆహార భద్రతా ప్రమాణాలు గాలికి...

## మణుగూరులో కనిపించని ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు

**భద్రాద్రి: పెన్ పవర్:**మణుగూరు ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరు పట్టణ ప్రధాన రహదారిపై బిర్యానీ, చికెన్ మంచూరియా, వెజ్ మంచూరియా, చికెన్ ఫ్రైడ్ రైస్ తదితర ఆహార పదార్థాల స్టాల్స్, చిన్న హోటళ్లు, రెస్టారెంట్లు ఇష్టానుసారంగా వెలుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఆయా దుకాణాల్లో ఆహార భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? పరిశుభ్రతను ఎలాంటి స్థాయిలో నిర్వహిస్తున్నారు? నాణ్యమైన ముడి పదార్థాలనే వినియోగిస్తున్నారా? అనే అంశాలపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారా అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

బిర్యానీ, చికెన్ మంచూరియా, చికెన్ ఫ్రైడ్ రైస్ వంటి పదార్థాలను చిన్నారులు, యువత అధికంగా తీసుకుంటున్న నేపథ్యంలో ఆహార నాణ్యతపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. నాసిరకం ముడి పదార్థాలు లేదా అపరిశుభ్రమైన వాతావరణంలో తయారైన ఆహారం విక్రయిస్తే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మణుగూరు ప్రధాన రహదారిపై ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ స్టాళ్లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఆహార నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానం, అనుమతులు తదితర అంశాలను పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బోనాల పాట విడుదల

## కల్కి సినీమా డైరెక్టర్ నాగ్ అశ్విన్ చేతుల మీదుగా విడుదల

**హైదరాబాద్ పెన్ పవర్:**
బోనం మీద బోనం ఉమ్మడి పాలమూరు జిల్లా నాగర్ కర్నూల్ కి చెందిన యువకులు నూతన ఉత్తేజంతో మన సాంప్రదాయ బోనాల పండుగ లో భాగంగా బోనం మీద బోనం అనే గొప్ప బోనాల పాటను ఈ రోజు శుక్రవారం హైదరాబాద్ ఫిలింనగర్ లోని వైజయంతి మూవీస్ కార్యాలయంలో ప్రముఖ డైరెక్టర్ ( కల్కి సినీమా డైరెక్టర్) నాగ్ అశ్విన్ గారి చేతుల మీదుగా ఈ పాట ను విడుదల చేయడమైనది.ఈ సందర్భంగా నాగ్ అశ్విన్ మాట్లాడుతూ మన జిల్లా యువకులు ఇంత పెద్ద ఎత్తున వారి యొక్క నైపుణ్యతను కలను నమ్ముకుని వారు చేసిన ఈ బోనం మీద బోనం సాంగ్ చాలా అద్భుతంగా ఉంది, ఇలాంటి యువకులకు కళామతల్లి దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయని వీరందరూ కూడా రానున్న రోజుల్లో మరింత ముందుకు సాగాలని కోరుకుంటున్నా.ఈ పాట చాలా అద్భుతంగా తెలంగాణ ప్రాంతంలో బోనాలకు ఉన్న ప్రాముఖ్యత గురించి మనందరికీ తెలిసిందే, బోనాల పండుగా గొప్పతనం గురించి ఈ పాట చిత్రికరణ చేయడం చాలా మంచి శుభ పరిణామమని వారు అనడం జరిగింది. ఈ పాటను మనమందరం ఆదరించి మన ప్రాంతానికి చెందిన యువకులను ప్రోత్సహించాలని యువకులకు మద్దతుగా నిలవాలని నాగ్ అశ్విన్ కోరడం జరిగింది.

# మాపై కాంగ్రెస్ అనవసర రాజకీయం మానుకోవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు విదేశాంగ మంత్రిత్వ శాఖ పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వకపోవడం వెనుక ఎటువంటి రాజకీయ కోణం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు స్పష్టంచేశారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "సీఎంతో పాటు వెళ్లే అధికారుల ప్రతినిధి బృందానికి ఇప్పటికే కేంద్రం అనుమతులు ఇచ్చింది.ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలపై క్షుణ్నంగా పరిశీలించిన తర్వాతే విదేశాంగ శాఖ నిర్ణయం తీసుకుంటుంది. తాజా పర్యటనలో నిబంధనలు, విధివిధానాల లోపాల ప్రకారమే నిర్ణయం జరిగింది" అని వివరించారు. నీట్ ద్వారా ప్రవేశాలు పొందిన ఎంబీబీఎస్ విద్యార్థుల నుంచి ప్రైవేటు మెడికల్ కాలేజీలు అక్రమంగా అదనపు ఫీజులు వసూలు చేస్తున్నాయని రామచందర్‌రావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ఈ నెల 24, 25 తేదీల్లో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దీక్ష చేపడుతున్నట్టు తెలిపారు.



# ఉత్తర్‌ప్రదేశ్ సీఎంతో బండి సంజయ్ భేటీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర పర్యటనలో భాగంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కలిశారు. ఈ విషయాన్ని బండి సంజయ్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. లఖ్‌నవూలోని సీఎం అధికార నివాసానికి వెళ్లిన బండి సంజయ్.. యోగి ఆదిత్యనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి దాదాపు అరగంటకుపైగా చర్చించారు. తెలంగాణలో పార్టీ పరిస్థితి, యూపీ ఎన్నికలపై చర్చ జరిగింది. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే తెలంగాణకు మరింత మేలు జరుగుతుందని, ఉత్తర్‌ప్రదేశ్ ఇందుకు నిదర్శనమని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు.

## ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొందాం

-3 పేజి తరువాయి

అవసరాలు, వనరులు, గ్రామ అభివృద్ధి ప్రణాళిక, శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులు వంటి సమగ్ర వివరాలు ఇందులో చేర్చామని దానకిశోర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కొందరు సర్పంచులూ హాజరయ్యారు.

## రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తా

-3 పేజి తరువాయి

చర్యలు తప్పవు. ప్రతి 15 రోజులకోసారి లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఎకరాకు రూ.60 చొప్పున చెల్లించాలి. ఇందిరమ్మ ఇళ్ల మొదటి దశలోని ఎల్-3 సమస్యలను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలి. రెండో దశ ఇళ్ల మంజూరుకు ముందు లబ్ధిదారుల అర్హతను రెండుసార్లు పరిశీలించాలి. 22-ఎ, ఎసైన్డ్ భూముల కేసులను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలి" అని మంత్రి పొంగులేటి ఆదేశించారు. సమీక్ష అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు.. 'భూ భారతిని తీసుకువచ్చి చిన్న పొరపాట్లు లేకుండా పాలన అందిస్తున్నాం. ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల చొప్పున ఇచ్చాం.హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇచ్చాం.వివాద రహిత భూములను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం' అని అన్నారు. సమీక్షలో హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్, సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్‌కుమార్, స్టాంపుల రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆఫీసులో అపరిశుభ్రత.. టాయిలెట్లు శుభ్రం చేసిన మంత్రి జూపల్లి

-3 పేజి తరువాయి

అక్కడ దరఖాస్తులు, ఫైళ్ల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై ఆయన ఆరా తీశారు. అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన మంత్రి, ఆర్డీఓతో పాటు ఇతర సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.అదే సమయంలో కార్యాలయంలోని మరుగుదొడ్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన మంత్రి తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. సిబ్బంది నిర్లక్ష్యానికి నిరసనగా ఆయనే స్వయంగా నీళ్లు పోసి మరుగుదొడ్లను శుభ్రం చేశారు. ఉన్నత హోదాలో ఉన్న మంత్రి స్వయంగా ఈ పని చేయడంతో అక్కడి సిబ్బంది విస్తుపోయారు.

## కబ్జాకోరులకు మల్కాజ్‌గిరి మహిళా సీపీ షాక్.. వృద్ధురాలికి దక్కిన రూ.40 కోట్ల భూమి!

-3 పేజి తరువాయి

న్యాయం చేయాలని ఆమెను అభ్యర్థించారు.వృద్ధురాలి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన సీపీ సుమతి, సమగ్ర విచారణకు ఆదేశించారు. రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, ఆ భూమి బాధితురాలిదేనని ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల ద్వారా కబ్జాదారులు ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అయినప్పటికీ సీపీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, ఆ స్థలం తమదేనని వాదిస్తున్న వారిని పిలిపించి ఆధారాలు సమర్పించాలని ఆదేశించారు. వారు సరైన పత్రాలను చూపలేకపోవడంతో, ఆ భూమి వృద్ధురాలిదేనని అధికారులు తుది నిర్ధారణకు వచ్చారు.కోట్లాది రూపాయల విలువైన తన ఆస్తి తిరిగి దక్కడంతో ఆ వృద్ధురాలు హర్షం వ్యక్తం చేశారు. సీపీ సుమతి ప్రదర్శించిన చొరవను, వృత్తిపరమైన నిబద్ధతను స్థానికులు కొనియాడుతున్నారు. భూకబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## ఆ అమ్మాయిని నేనే ఆస్పత్రికి తీసుకువెళ్లా ఎంపీ లింగమనేని రమేశ్ కుమారుడిపై నిర్లక్ష్యపు డ్రైవింగ్ కేసు నమోదు

**హైదరాబాద్, ఆగస్టు 21 పెన్ పవర్:**హైదరాబాద్ నగరంలోని ఇనార్బిట్ మాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై జనసేన రాజ్యసభ ఎంపీ లింగమనేని రమేశ్ కుమారుడు సంజూష్ స్పందించాడు. ఈ ఘటన తన నిర్లక్ష్యం వల్ల జరగలేదని, ఇది కేవలం దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాదమని పేర్కొన్నాడు. ప్రమాదం జరిగిన వెంటనే బాధ్యతగా వ్యవహరించి, గాయపడిన యువతి భారతిని తానే స్వయంగా ఆసుపత్రికి తరలించానని తెలిపాడు. ఆ తర్వాత నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ప్రమాద వివరాలను పోలీసులకు తెలియజేశానని వివరించాడు.ఆగస్టు 16న మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇనార్బిట్ మాల్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతున్న భారతి (26) అనే యువతిని సంజూష్ నడుపుతున్న ఆస్టన్ మార్టిన్ కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించింది. భారతి ఇనార్బిట్ మాల్‌లోని లైఫ్‌స్టైల్ స్టోర్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తోంది. సంజూష్ కారును వేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తమ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు సంజూష్‌పై కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 106(1) కింద నిర్లక్ష్యంగా వాహనం నడిపి మరణానికి కారణమైనందుకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ నేరం బెయిలబుల్ కావడంతో పోలీసులు అతడికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ సెక్షన్ కింద నేరం రుజువైతే ఐదేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది.పోలీసుల దర్యాప్తునకు తాను పూర్తిగా సహకరిస్తానని సంజూష్ స్పష్టం చేశాడు. ప్రమాదం తర్వాత పోలీసులు తనకు బ్రీత్ అనలైజర్, యూరిన్, బ్లడ్ టెస్టులు నిర్వహించారని, ఈ మూడింటిలోనూ నెగెటివ్ రిపోర్ట్ వచ్చిందని వెల్లడించాడు. బాధిత యువతి భారతి కుటుంబానికి తన వంతు సహాయం అందిస్తానని సంజూష్ పేర్కొన్నాడు. సంజూష్ తండ్రి లింగమనేని రమేశ్ ఇటీవలే ఆంధ్రప్రదేశ్ నుంచి జనసేన పార్టీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన విషయం తెలిసిందే.

## ఖిల్లా రామాలయ ఆవరణలో భూమి పూజ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్....

**హైదరాబాద్ పెన్ పవర్:** చారిత్రాత్మకమైన ఖిల్లా రామాలయంలో ఎత్తయిన ధర్మ ధ్వజాన్ని ప్రతిష్టించడం చారిత్రాత్మకమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని హిందూ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర కూట రాజులు నిర్మించి, ఛత్రపతి శివాజీ మహారాజ్ గురువు సమర్థ రామదాసు అభివృద్ధి చేసిన ఖిల్లా రామాలయంలో 101 అడుగుల ధర్మ ధ్వజాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. ధర్మ కార్యానికి హిందువులంతా ఏకమవ్వాలన్నారు. నగరవాసులందరికీ కనపడేలా ఎత్తైన ధ్వజాన్ని ప్రతిష్టించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గురుప్రసాద్, కార్యదర్శి మారయ్య గౌడ్, మాజీ చైర్మన్ ముక్కా దేవేందర్ గుప్తా, కోశాధికారి వాసు, గంట లింగం, హిందూ సంస్థల ప్రతినిధులు నరేష్, ప్రవీణ్, సూరి, సంతోష్, సాయిరాం, సాయి, సందీప్, బీజేపీ కార్పొరేటర్లు, వీహెచ్ పీ, భజరంగ్ దళ్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

# అమెరికా సమావేశాలకు కేంద్రం అనుమతి నిరాకరణ

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన చివరి నిమిషంలో రద్దయింది. అమెరికాలో నిర్వహించాల్సిన 'తెలంగాణ రైజింగ్' సమావేశాలకు కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో బ్రిటన్ పర్యటన ముగించుకొని సీఎం ఈ నెల 23న లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు.తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి లండన్, అమెరికాలో 'తెలంగాణ రైజింగ్' పేరుతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా అమెరికాలోని బోస్టన్, న్యూయార్క్‌లో సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి కార్యాలయం షెడ్యూల్ కూడా సిద్ధం చేసింది.అయితే చివరి నిమిషంలో కేంద్ర విదేశాంగ శాఖ నుంచి అనూహ్య పరిణామం ఎదురైంది. యూకేలో జరిగే సమావేశాలకు మాత్రమే అనుమతి లభించింది. అమెరికాలో నిర్వహించాల్సిన సమావేశాలకు గ్రీన్‌సిగ్నల్ రాలేదు. దీంతో సీఎం తన పర్యటనను కుదించుకుని హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, కేంద్రం నిర్ణయం వెనక కారణం ఏంటనేది మాత్రం ఇంకా అధికారికంగా తెలయరాలేదు.ప్రస్తుతం రద్దయిన అమెరికా పర్యటనను వచ్చే నెలలో చేపట్టాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ఈసారి అమెరికాలో జరగాల్సిన భేటీలకు సీఎం స్వయంగా వెళ్లకుండా అధికారుల బృందాన్ని పంపే యోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది.తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ యువత భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా 'తెలంగాణ రైజింగ్' ప్రయాణం ఆగదని ధీమా వ్యక్తం చేశారు.

**జాతివ్యతిరేక శక్తులతో మీకేం పని**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనల లక్ష్యంగా నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ పెట్టుబడుల సేకరణ పేరుతో రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న విదేశీ పర్యటనలన్నీ భారత్‌పై విద్వేషం చిమ్మే వర్గాలతోనే సాగుతోందని ఆయన ఆరోపించారు. జార్జ్ సోరోస్ వంటి భారత్ వ్యతిరేక భావజాలం కలిగిన వ్యక్తులు, సంస్థల నిధులతో నడిచే వేదికల వద్దకే సీఎం వెళుతున్నారని విమర్శించారు. దేశవ్యతిరేక ఐడియాలజీ ఉన్న సంస్థలను కలవడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు.అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను హెచ్చరిస్తూ... గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రాజకీయ నాయకుల మాటలు విని పలువురు అధికారులు చివరకు జైలుపాలు కావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి వల్ల అధికారులకు ఎటువంటి రక్షణ ఉండదని, భవిష్యత్తులో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వచ్చే 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ భారీ మెజారిటీతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పీఐబీ పాత్ర కీలకం :

### రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

- పోషణ మాసం కార్యక్రమంకు గవర్నర్ ను ఆహ్వానించిన పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్

**హైదరాబాద్, ఆగస్టు 21, పెన్ పవర్:** కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పీఐబీ పాత్ర కీలకమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం చేపడుతూ ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని గవర్నర్ పిఐబి అధికారులకు సూచించారు. శుక్రవారం లోక్ భవన్ లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ ఆధ్వర్యంలో పీఐబీ జాయింట్ డైరెక్టర్ డా. మానస్ కృష్ణకాంత్ ,సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ కె శ్రీనివాస రావు లు కలిశారు. తెలంగాణలో పీఐబీ, సీబీసీ కార్యకలాపాలను ఈ సందర్భంగా అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ గవర్నర్‌కు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, విధానాలను మీడియా, ప్రజా అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల కోసం నిర్వహిస్తున్న 'వార్తాలాప్స్', ప్రెస్ టూర్స్, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఐసీఓపీ కార్యక్రమాల గురించి వివరించారు. సెప్టెంబర్‌లో నిర్వహించే 'పోషణ్ మాహ్' సందర్భంగా పోషణ్ అభియాన్‌పై నిర్వహించనున్న ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ అవుట్ రీచ్ ప్రోగ్రాం ( ఐసీఓపీ) కార్యక్రమానికి గవర్నర్‌ను ఆహ్వానించారు.
ఈ సందర్భంగా మహాత్మా గాంధీపై ప్రచురించిన పుస్తకంతో పాటు కేంద్ర ప్రభుత్వ 12 ఏళ్ల ప్రగతి, విజయాలపై ప్రచురించిన పుస్తకాలను గవర్నర్‌కు అందజేశారు. అంతకుముందు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి లలిత్ వర్మ రాష్ట్ర గవర్నర్ ను కలిశారు.

### కోదండ రామస్వామి ఆలయానికి శంకుస్థాపన

**ఆధ్యాత్మిక కేంద్రంగా కేతవీరునిపాడు**

**కోదండ రామస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి**

**"ఎమ్మెల్యే సౌమ్య"**

**హైదరాబాద్ పెన్ పవర్:** కేతవీరునిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న కోదండ రామస్వామి దేవస్థానానికి శుక్రవారం శంకుస్థాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి హాజరై ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా "ఎమ్మెల్యే సౌమ్య" మాట్లాడుతూ : కోదండ రామస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటి పర్మిషన్ కోసం రూ.15 వేల లంచం,

### రూ.13 వేలకు బేరం

**ఏసీబీకి దొరికిన మహిళా పంచాయతీ కార్యదర్శి**

**మంచిర్యాల పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం లింగాయపల్లెలో పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి అవినీతి నిరోధక శాఖ అధికారులకు (ఏసీబీ) కి పట్టుబడింది. ఇంటి నిర్మాణ అనుమతులకోసం వచ్చిన వారిని పదిహేను వేల రూపాయలు లంచం డిమాండ్ చేసింది. చివరకు 13 వేలకు బేరం కుదిరింది. సదరు నగదు నేరుగా తీసుకోకుండా తన స్నేహితురాలికి ఫోన్ పే చేయమని చెప్పింది. లంచం తీసుకున్న పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు వివరాలు వెల్లడిస్తామన్నారు. ఏసీబీ దాడులు మండలంలో కలకలం రేపాయి.

## షావుకారు జానకి మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మరణించారని తెలిసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కెరీర్ను ప్రారంభించిన షావుకారు జానకి దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారని అన్నారు. 'షావుకారు' సినిమాలో అసమాన ప్రతిభ కనబరిచి షావుకారు జానకిగా స్థిరపడ్డారని గుర్తుచేస్తూ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లోనే కాకుండా హిందీ, మలయాళ చిత్రాల్లో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించారని అన్నారు.
పలు మేటి చిత్రాల్లో షావుకారు జానకి పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. చలనచిత్ర రంగంలో ఆమె లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. భగవంతుడు ఆమెకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, అమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### 53 ఎంపీ అవినాష్ రెడ్డి ఇంటిపై ఈడీ రైడ్స్...

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ దుమారం రేగింది. శుక్రవారం ఉదయం నుంచి వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డి సహా వైసీపీకి చెందిన పది మంది నివాసాల్లో ఈడీ మెరుపుదాడులు చేసింది. ఆఫీసులు ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది.మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాక్ ఇచ్చింది. వివేకా హత్య కేసు విచారణలో భాగంగా అధికారులు ఆయన నివాసాలు, కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు.
ఈ కేసులో మనీలాండరింగ్ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగింది. ఈ రోజు తెల్లవారుజాము నుంచే హైదరాబాద్, పులివెందులలోని అవినాశ్ రెడ్డి నివాసాలు, కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు 10 ప్రాంతాల్లో వేర్వేరు బృందాలు ఏకకాలంలో ఈ సోదాలు నిర్వహిస్తున్నాయి. అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు, కీలక పత్రాలు, ఆస్తుల వివరాల కోసం అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.ఈ కేసుతో సంబంధం ఉన్న ఇతర నిందితుల నివాసాల్లోనూ ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. పులివెందులలోని దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్ ఇళ్లతో పాటు, తొండూరు మండలం టి.తుమ్మలపల్లిలోని ఎర్ర గంగిరెడ్డి నివాసంలోనూ తనిఖీలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సోదాలు జరుగుతున్న వారంతా గతంలో వెలుగులోకి వచ్చిన మద్యం కుంభకోణంలో నిందితులుగా ఉన్నారు. ఆ కేసులోనే ఈ సోదాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగతోంది. ఎంపీ అవినాష్ రెడ్డి, శంకర్ రెడ్డి, సునీల్ రెడ్డి నివాసాలు, ఆఫీసుల్లో ఈడీ బృందాలు తనిఖీలు చేపడుతున్నాయి. హైదరాబాద్, పులివెందులలో ఈ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కాంగ్రెస్‌లో కష్టమే.. వేరే పార్టీలు చేర్చుకోవు!

**వరంగల్, ఆగస్టు 21 పెన్ పవర్:**
వరంగల్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో మొదటినుంచీ దూకుడు వైఖరి ప్రదర్శించే మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి కుటుంబం.. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపైనే నేరుగాబహిరంగ తిరుగుబాటు బావుటా ఎగురవేయడం తెలంగాణ కాంగ్రెస్‌లో పెను ముసలానికి దారితీసింది. పరకాల పర్యటనలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని సీఎం పిలుపునిచ్చినవెంటనే.. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ సీఎం రేవంత్‌పై తీవ్రమైన పదజాలంతో విరుచుకుపడ్డారు. తల్లిదండ్రుల ప్రత్యక్ష ఆశీస్సులు, సంపూర్ణ రాజకీయ మద్దతు లేకుండా కేవలం ఒక కుమార్తెగా ఆమె రాష్ట్ర ముఖ్యమంత్రిపై ఇంతటి తీవ్రస్థాయి వ్యాఖ్యలు చేయడం అసాధ్యమని, ఇది పూర్తిగా కొండా దంపతుల వ్యూహాత్మక రాజకీయమే.ఈ దూకుడు వెనుక ఉన్న ప్రధాన కారణం పరకాల నియోజకవర్గంలో తమ పట్టును, వచ్చే తరం రాజకీయ వారసత్వాన్ని కాపాడుకునే తాపత్రయమే. గతంలో కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపిస్తూనే, తమ కుమార్తె సుస్మితను పరకాల నుంచి బరిలోకి దించాలన్న పట్టుదలతో కొండా కుటుంబం ఉంది. అయితే రేవంత్ రెడ్డి మాత్రం రేవూరి ప్రకాష్ రెడ్డికి పరోక్షంగా మద్దతు ప్రకటించడంతో కొండా వర్గంలో అభద్రతాభావం తారాస్థాయికి చేరింది. అధిష్ఠానాన్ని, సీఎంను తీవ్రస్థాయిలో బెదిరించి, ఒత్తిడి తీసుకురావడం ద్వారానే తమ రాజకీయ డిమాండ్లను సాధించుకోవచ్చనే పాత పంథానే వారు మళ్లీ నమ్ముకున్నట్లు కనిపిస్తోంది.
అయితే ఈ తరహా దూకుడు రాజకీయాలు కొండా కుటుంబ రాజకీయ భవిష్యత్‌కు చేటు తెచ్చే ప్రమాదం ఉంది. గతంలో వైఎస్సార్ మరణానంతరం వైఎస్సార్‌సీపీలోకి వెళ్లడం, ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి మంత్రి పదవి అనుభవించి అక్కడా కేసీఆర్‌పై తిరుగుబాటు చేసి కాంగ్రెస్‌కు రావడం వంటి వరుస పార్టీ మార్పిడుల చరిత్ర వారికి ఉంది. క్రమశిక్షణారాహిత్యంతో సొంత ప్రభుత్వాలపైనే రచ్చకెక్కే నైజం ఉన్న నేతలను చేర్చుకోవడానికి విపక్ష బీఆర్ఎస్ లేదా బీజేపీ వంటి ఇతర పార్టీలు కూడా సుముఖంగా ఉండే అవకాశం లేదు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటే లేదా కేబినెట్ నుంచి తప్పిస్తే.. రాజకీయంగా ఒంటరిపాటు కావడం ఖాయమనే వాదన బలంగా వినిపిస్తోంది.ఈ మొత్తం వ్యవహారంలో కొండా కుటుంబం తీసుకుంటున్నది అత్యంత ప్రమాదకరమైన జూదమని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో ఉంటూనే సీఎం స్థాయి వ్యక్తిపై బరితెగించి ఆరోపణలు చేయడం వల్ల తాత్కాలికంగా మీడియా మైలేజ్ లభించినప్పటికీ, దీర్ఘకాలికంగా అది వారి రాజకీయ పునాదులకే గొడ్డలిపెట్టుగా మారే అవకాశం ఉంది.

**కొండా సురేఖ భవిష్యత్తు తేల్చేది ఆ లేఖేనా**

సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ సమయంలో మంత్రి కొండా సురేఖ స్వయంగా కల్పించుకుని, కూతురి వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సీఎంకు క్షమాపణలు చెప్పి వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. అయితే, ఒకసారి పొరపాటు జరిగిందని సరిదిద్దుకున్న తర్వాత కూడా మళ్లీ అదే తరహాలో ముఖ్యమంత్రిపై బహిరంగ విమర్శలు చేయడం వెనుక గల ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో మాదిరిగా కేవలం ఒక క్షమాపణ లేఖతో ఈ వివాదం సద్దుమణుగుతుందా? లేక అధిష్ఠానం కఠిన నిర్ణయాల దిశగా అడుగులు వేస్తుందా? అన్నది పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది.క్రమశిక్షణ కమిటీకి సమర్పించే లేఖలో కొండా సురేఖ ఏ వైఖరి తీసుకుంటారనే అంశంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆమె ముందు ప్రధానంగా మూడు అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకటి కూతురి వ్యాఖ్యలకు మద్దతు తెలపడం. కూతురు లేవనెత్తిన అంశాలను సమర్థిస్తే అది నేరుగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నాయకత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు
చేసినట్లే అవుతుంది. ఇది మంత్రి పదవికి ముప్పు తెచ్చే ప్రమాదం ఉంది. రెండోది కూతురి వ్యాఖ్యలను ఖండించి క్షమాపణ కోరడం. కూతురి వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ,పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానని తేల్చిచెప్పడం. తద్వారా అధిష్ఠానం ఆగ్రహం నుంచి తప్పించుకోవడం. మూడోది పరకాల రాజకీయాన్ని తెరపైకి తేవడం. కూతురి వ్యాఖ్యలపై పెద్దగా స్పందించకుండా,స్థానిక రాజకీయం, పరకాల నియోజకవర్గంలో తమ వర్గానికి జరుగుతున్న అన్యాయం, గ్రూపు రాజకీయాల వల్లే అసహనంతో ఈ వ్యాఖ్యలు వచ్చాయనే విషయాన్ని లేఖలో ప్రస్తావించడం.కొండా కుటుంబానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘ రాజకీయ నేపథ్యం, బలమైన క్యాడర్ ఉన్నాయి. అయితే, ప్రస్తుత అధికార కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రితో నేరుగా తలపడటం కొండా దంపతుల రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. క్రమశిక్షణ కమిటీకి ఇచ్చే వివరణ అసంతృప్తికరంగా ఉంటే అధిష్ఠానం ఎలాంటి కఠిన నిర్ణయానికైనా వెనుకాడకపోవచ్చనే సంకేతాలువెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో కొండా సురేఖ పంపే లేఖ ఈ వివాదానికి ముగింపు పలుకుతుందా, లేక కాంగ్రెస్ పార్టీలో సరికొత్త రాజకీయ సంక్షోభానికి నాంది పలుకుతుందా అనేది కొద్ది గంటల్లో తేలనుంది.

## కొండా సురేఖకు వ్యతిరేకంగా ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, ఆగస్టు 21: పెన్ పవర్:** కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువని నేతలు తరచూ గొప్పగా చెప్పుకుంటారు. ఇప్పుడు అదే తెలంగాణ కాంగ్రెస్‌లో చిక్కులు తెచ్చి పెడుతోంది. రెండు రోజుల క్రితం మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన కామెంట్స్‌తో రాజుకున్న రాజకీయ సెగ ఆమె తల్లి పదవికి అంటుకునేలా కనిపిస్తోంది. తన కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ లేఖ రాసినా కాంగ్రెస్ నేతలు శాంతించడం లేదు. ఆమె రాజీనామా చేసినా ఓకే లేదా అధిష్ఠానమే ఆమె తప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్‌కు చెందిన 15 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు సీఎల్పీలో సమావేశమయ్యారు. కొండ సురేఖ కుమార్తె వ్యాఖ్యలను ఖండించారు. దీనికి పూర్తి బాధ్యత కొండా సురేఖ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అందుకే ఆమె పదవి నుంచి తప్పుకుంటే మర్యాదగా ఉంటుందని, లేకుంటే అధిష్ఠానం బర్తరఫ్ చేయాలని నినాదిస్తున్నారు. ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాత్రి పగలు కష్టపడుతుంటే పార్టీ నేతలే ఆయన్ని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. విపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి తప్పుడు కూతలు కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క సుస్మిత మాత్రమే కాదని, ఇకపై ఎవరు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని అధిష్ఠానానికి, సీఎంకు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ పోరు...బీఆర్ ఎస్ కు బలం**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు తీవ్రమవుతున్నాయని, నాయకుల మధ్య సవతుల పోరు నడుస్తోందని సీపీఐ సీనియర్ నేత నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతల అంతర్గత విభేదాల కారణం వల్ల రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ పుంజుకుంటోందని ఆయన ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడా తప్పులు చేయకుండా నిక్కచ్చిగా వ్యవహరించినప్పుడే మంత్రులు, కిందిస్థాయి అధికారులలో భయం ఉంటుందని నారాయణ పేర్కొన్నారు. సీఎం ఇప్పటికైనా రాజకీయాలను పక్కనపెట్టి పూర్తిస్థాయిలో పాలనపైనే దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో నిషేధిత 22ఏ భూముల నిబంధనలను కొందరు అధికారులు, నాయకులు దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఒకవైపు పాలిటెక్నిక్ విద్యార్థులు నిరసనలు, ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం శోచనీయమన్నారు.
ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంలో తమ సీపీఐ పార్టీ భాగస్వామి కాదని, గడిచిన శాసనసభ ఎన్నికల్లో కేవలం సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నామని గుర్తుచేశారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా తాము ఇస్తున్న సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుతో ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతోందని హెచ్చరించారు.

**సురేఖకు వ్యతిరేకంగా కేసు**

తెలంగాణ మంత్రి కొండా సురేఖకు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలతో ఇప్పటికే టీపీసీసీ ముందు వివరణ ఇచ్చుకున్న ఆమెకు, తాజాగా మరో రెండు అంశాలు రాజకీయంగా తీవ్ర ఇబ్బందికరంగా మారాయి.కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌తో పాటు మరో ఐదుగురిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో 'అటెంప్ట్ టు మర్డర్' (హత్యాయత్నం) కేసు నమోదైంది. మేడిపల్లికి చెందిన గొంగడి హరికృష్ణ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. తనపై సుమంత్ బృందం ఇనుప రాడ్లతో దాడికి పాల్పడిందని బాధితుడు ఫిర్యాదు చేయగా, మొదట మేడిపల్లిలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆపై కేసును జూబ్లీహిల్స్‌కు బదిలీ చేశారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 109 కింద ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మరోవైపు, పార్టీ అంతర్గత రాజకీయాల్లో కొండా సురేఖకు వ్యతిరేకంగా అసమ్మతి గళం తీవ్రమైంది. సీఎల్పీ వేదికగా దాదాపు 20 నుంచి 30 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశమై ఆమె వైఖరిపై చర్చించడం సంచలనం రేపింది. కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ వివరణ ఇచ్చినా, ఆ వ్యాఖ్యలను ఆమె ఎందుకు ఖండించలేదని సదరు ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తున్నారు. అయితే, కొందరు సీనియర్ మంత్రులు, సీనియర్ నాయకులు సురేఖకు మద్దతుగా నిలుస్తుండటంతో కాంగ్రెస్ వర్గపోరు పీక్స్‌కు చేరింది.

**చర్యలు తప్పవు**

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. పార్టీలో క్రమశిక్షణారాహిత్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ పర్యటన నుంచే ముఖ్య నేతలకు ఆయన గట్టి హెచ్చరికలు పంపినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.మూడు రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పరకాలలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తద్వారా రేవూరి అభ్యర్థిత్వాన్ని దాదాపు ఖరారు చేస్తూ స్పష్టమైన సంకేతాలిచ్చారు. అయితే, ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేసేలా.. ఆ మరుసటి రోజే మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ పరకాల నియోజకవర్గంలో సభ నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా, వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తానే పోటీ చేస్తానని ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది.సీఎం పర్యటనకు స్థానిక మంత్రిగా ఉన్న కొండా సురేఖ గైర్హాజరు కావడం, ఆ వెంటనే ఆమె కుమార్తె ఈ వ్యాఖ్యలు చేయడం ఒక ప్రణాళిక ప్రకారమే జరిగిందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఈ పరిణామాలపై బుధవారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్.. అక్కడే కొందరు ముఖ్య నేతల వద్ద తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మరికొందరు సీనియర్ మంత్రులతో ఫోన్‌లో మాట్లాడి, ఈ వ్యవహారంపై సీరియస్‌గా ఉన్నట్లు చెప్పారని సమాచారం.సీఎం ఆదేశాల మేరకు పీసీసీ క్రమశిక్షణా కమిటీ వెంటనే రంగంలోకి దిగింది. మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని కోరింది. అయితే, "కుమార్తె చేసిన వ్యాఖ్యలకు నేనెలా బాధ్యురాలిని అవుతాను?" అని మంత్రి సురేఖ గురువారం సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.ఈ విషయంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. "సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఎవరికి వారు పోటీ చేస్తామని ప్రకటించుకోవడం సరికాదు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు. మంత్రి సురేఖ వివరణను పరిశీలించాక తదుపరి చర్యలపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది" అని స్పష్టం చేశారు.

**నా టార్గెట్ రేవంత్ రెడ్డే**

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కుమార్తె వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సురేఖ పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో కొండా సుస్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కేవలం సీఎం రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఆ వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు."సీఎం రేవంత్ రెడ్డి పరకాల వచ్చి రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఎమ్మెల్యే సీటు ఇస్తున్నట్లు ప్రకటించారు. నేను రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేశాను. పార్టీని కాదు. నాకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీనాక్షి నటరాజన్‌పై చాలా గౌరవం ఉంది. కానీ, రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోంది. అందుకే వారిని టార్గెట్ చేసుకున్నాను.


# కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చింతలకుంట డివిజన్ నూతన అధ్యక్షులుగా ముక్కపల్లి బాలకృష్ణ

**మధుయాష్కి గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపిన బాలకృష్ణ**

**బాలకృష్ణను సన్మానించిన మధుయాష్కి**



బాలకృష్ణ



బాలకృష్ణను సన్మానిస్తున్న మధుయాష్కి గౌడ్

**ఎల్బీనగర్, పెన్ పవర్, ఆగస్టు 21:** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చింతలకుంట డివిజన్ నూతన అధ్యక్షులుగా ముక్కపల్లి బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ సెల్ చైర్మన్, మానాకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కె.సత్యనారాయణ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ ముక్కపల్లి బాలకృష్ణ పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ను ఆయన నివాసంలో కలిసి శాలువతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా చైర్మన్ గా నియమితులైన ముక్కపల్లి బాలకృష్ణను మధుయాష్కి గౌడ్ శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం ముక్కపల్లి బాలకృష్ణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలను, నాయకులను కలుపుకుపోయి పార్టీని మరింత బలోపేతం చేస్తామని

పేర్కొన్నారు. తనను ఎస్సీ సెల్ చైర్మన్ గా నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, వనస్థలిపురం డివిజన్ మాజీ అధ్యక్షులు కుట్ల నర్సింగ్ యాదవ్, చింతలకుంట డివిజన్ అధ్యక్షురాలు కల్వ కవిత తదితరులకు ముక్కపల్లి బాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు

# కాంగ్రెస్ లో పాత రోజులు



**హైదరాబాద్, ఆగస్టు 21 పెన్ పవర్:** కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అని చెప్పుకుంటూ ఉంటారు. అసంతృప్తి ప్రకటనలు చేసే వారికి ఈ పేరు పెట్టుకున్నారు. ఇప్పుడీ కాంగ్రెస్ మార్క్ అంతర్గత ప్రజాస్వామ్యం హద్దులు దాటి పోతోంది. రాజగోపాల్ రెడ్డి నిరంతరం వివాదాస్పద ప్రకటనలు చేస్తున్నారు. అనిరుధ్ రెడ్డితో పాటు ఇటీవల చిన్నారెడ్డి కూడా అదే చేశారు. తాజాగా సుస్మితా పటేల్ సంచలనం సృష్టించారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో తీవ్ర రాజకీయ కలకలాన్ని రేపాయి. సీఎం రేవంత్‌కు పార్టీ సిద్ధాంతాలు ఇంకా వంటబట్టలేదని, కాంగ్రెస్ క్రమంగా టీడీపీ కాంగ్రెస్ గా మారుతోందని ఆరోపిస్తూ ఆమె నేరుగా తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం కాంగ్రెస్ కేడర్‌ను షాక్‌కు గురిచేసింది. వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన ఒక

కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో పరకాల అసెంబ్లీ టికెట్ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం ప్రకటించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. మాకు టికెట్ నిరాకరించడానికి అసలు రేవంత్ రెడ్డి ఎవరు? టికెట్ల కేటాయింపు అధిష్ఠానం పరిధిలోని అంశం అని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో పరకాల నుంచి తాను స్వతంత్రంగానైనా పోటీ చేసి గెలిచి తీరుతానని సవాల్ విసిరారు. ఆనాడు రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడు కావాలని మొదట కోరింది కొండా దంపతులేనని గుర్తుచేస్తూ, కొడంగల్ లో ఓడిపోయిన విషయాన్ని సీఎం మరిచి పోవద్దంటూ అత్యంత ఘాటైన స్వరంతో విమర్శలు గుప్పించారు. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి ఏ స్థాయికి చేరిందో స్పష్టంచేస్తున్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, చిన్నారెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి వంటి కీలక నేతలు ఇదివరకే వేర్వేరు సందర్భాల్లో తమ అసంతృప్తిని వెళ్లగక్కగా, ఇప్పుడు కొండా సురేఖ కుటుంబం నేరుగా సీఎంపైనే విమర్శల బాణాలు విసరడం శాసనసభా పక్షంలో సంచలనంగా మారింది. పార్టీలోని పాత కాంగ్రెస్ నేతలు, బీసీ నాయకులను పక్కనబెట్టి, వలస నేతలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే భావన ఈ వరుస తిరుగుబాట్లకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు పీసీసీ క్రమశిక్షణా కమిటీ , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిస్సహాయంగా మారిపోయారు. బహిరంగంగా పార్టీ సిద్ధాంతాలను, ముఖ్యమంత్రి నిర్ణయాలను ప్రశ్నిస్తున్న నేతలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేకపోవడం పార్టీలో క్రమశిక్షణా రాహిత్యాన్ని ప్రతిబింబిస్తోంది. రాబోయే రోజుల్లో క్రమశిక్షణ తప్పితే చర్యలు ఉంటాయని ఎంపీ మల్లు రవి వంటి నేతలు ప్రకటనలు ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసమ్మతి నేతలను అదుపు చేయడంలో గాంధీ భవన్ నాయకత్వం పూర్తిగా వెనుకబడి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనాపరమైన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నప్పటికీ, సొంత కేబినెట్ సహచరుల కుటుంబాల నుంచే వస్తున్న ఈ రకమైన తీవ్రమైన విమర్శలు ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం పేరిట సాగుతున్న ఈ ఘర్షణ వాతావరణం, ప్రతిపక్షాలైన బిఆర్ఎస్,

బిజెపిలకు రాజకీయ ఆయుధంగా మారుతోంది. అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని పార్టీలోని అంతర్గత పోరుకు చెక్ పెట్టకపోతే, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వానికి మరియు క్రెడిబిలిటీకి పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉంది.రేవంత్ ఫెయిలవ్వుతున్నారా తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇప్పుడు పరిపాలన కంటే పార్టీలోని అంతర్గత కుమ్ములాటలే పెను సవాలుగా మారుతు న్నాయి. అధికారం చేపట్టిన తొలినాళ్లలో దూకుడు ప్రదర్శిం చిన నాయకత్వం.. సొంత పార్టీలోని సీనియర్లు, వలస నేతల అసంతృప్తిని దారికి తేవడంలో మాత్రం తడబడుతోందనే వాదన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధిష్టానాన్ని నేరుగా టార్గెట్ చేయకుండా, కేవలం సీఎం రేవంత్‌ను మాత్రమే కేంద్రబిందువుగా చేసుకుని నేతలు సాగిస్తున్న స్వరం రోజురోజుకూ శృతిమించుతోంది.ఎన్నికల సమయంలో తన

అనుకూల వర్గానికి టికెట్లు ఇప్పించుకుని, వారిని గెలిపించుకున్నారనే ఆరోపణలు మొదటి నుంచీ రేవంత్‌పై ఉన్నాయి. ఆ సమయంలో అధికారమే లక్ష్యంగా అంతా సర్దుకుపోయినా, ప్రభుత్వం ఏర్పడ్డాక సీనియర్లను విస్మరిస్తున్నారనే భావన పాత కాంగ్రెస్ నేతల్లో అసహనాన్ని పెంచింది. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడం, నామినేటెడ్ పదవుల జాప్యం, పార్టీలో ప్రాధాన్యం తగ్గడం వంటి అంశాలు అంతర్గత అసంతృప్తిని రాజేస్తున్నాయి.కేబినెట్ పదవి ఆశించి భంగపడ్డ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మొదటి ఏడాది నుంచే సీఎంను లక్ష్యంగా చేసుకుని గళమెత్తుతున్నారు. సీఎం మార్పు ప్రస్తావన తెస్తూ,

ప్రత్యామ్నాయ పార్టీల వైపు చూస్తున్నామనే సంకేతాలు ఇవ్వడం ప్రభుత్వ స్థిరత్వంపై చర్చకు దారితీస్తోంది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి సీనియర్లు నిధుల కొరత, నిర్లక్ష్యంపైబహిరంగంగానే పెదవి విరుస్తున్నారు. దానం నాగేందర్ లాంటి నేతలు గత పాలనను ప్రస్తావిస్తూ ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ నేత చిన్నారెడ్డి టికెట్ల కేటాయింపు వ్యవహారాలపై విమర్శలు

గుప్పించగా, పార్టీ వీడిన జీవన్ రెడ్డి తరచూ సీఎం శైలిపై విమర్శనాస్త్రాలు సంధిస్తూనే ఉన్నారు. విజయశాంతి ప్రభుత్వ విధానాలపై పెదవి విప్పగా, తాజాగా మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మితఏకంగా పరకాల టికెట్ కేటాయింపు, కుటుంబానికి ఎమ్మెల్సీ నిరాకరణ వంటి అంశాలపై సీఎం కుటుంబ సభ్యులను సైతం టార్గెట్ చేస్తూ స్వతంత్ర పోరుకు సిద్ధమవడం ప్రకంపనలు సృష్టిస్తోంది.అసమ్మతి

స్వరాలు పెల్లుబుకుతున్నప్పుడు వాటిని బుజ్జగించడం లేదా సమన్వయ కమిటీల ద్వారా పరిష్కరించడంలో అధిష్టానం, సీఎం స్థాయి సంప్రదింపులు కొరవడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఒకవైపుప్రతిపక్షమైన బీఆర్ఎస్, బీజేపీలను రాజకీయంగా ఎదుర్కొంటున్న రేవంత్‌కు.. సొంత పార్టీ నేతల అసంతృప్తి వ్యాఖ్యలే ప్రతిపక్షాలకు ప్రధాన ఆయుధాలుగా మారుతున్నాయి. కేటీఆర్, హరీశ్ రావు వంటివిపక్ష నాయకులు కాంగ్రెస్ అసమ్మతి నేతల వ్యాఖ్యలనే కోట్ చేస్తూ ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నారు. దఓ ముఖ్యమంత్రిగా పరిపాలనపై పట్టు సాధిస్తున్నప్పటికీ, సొంత గూటిలోని అసమ్మతిని ఒకే తాటిపైకితీసుకురావడంలో రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహం ఆశించిన స్థాయిలో ప్రభావం చూపడం లేదన్నది స్పష్టమవుతోంది. తక్షణమే సమన్వయ యంత్రాంగాన్ని బలోపేతం చేసి, అంతర్గత కుమ్ములాటలకుతెరదించకపోతే.. ఈ అంతర్గత అసంతృప్తే ప్రభుత్వ ఉనికికి రాజకీయంగా గొడ్డలిపెట్టుగా మారే ప్రమాదం ఉంది.

## వైయస్ జగన్ హైదరాబాద్ పర్యటన

**హైదరాబాద్: పెన్ పవర్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ శుక్రవారం హైదరాబాద్లో పర్యటించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుమారుడి వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు స్నిగ్ధ, అనంత పినాక్ శర్మలను వైయస్ జగన్ ఆశీర్వదించి, వారికి హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎంపి ఈటల పర్యటన

**హైదరాబాద్, ఆగస్టు 21 పెన్ పవర్:** కొల్తూరు గ్రామంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పర్యటించారు. పారిశ్రామిక కంపెనీల వ్యర్థాలతో కలుషితమైన నీటితో కుంటలు మరియు చెరువులు కాలుష్య కూపంగా మారి అందులో ఉన్న చేపలు మరియు నీటి తాగనీకి వచ్చే పశు సంపద ఇతర వన్యప్రాణులు మృతి చెందుతున్నాయని తెలియడంతో చెరువు దగ్గరికి వెళ్ళి స్వయంగా పరిశీలించిస్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.అధికారులతో మాట్లాడి పారిశ్రామిక వ్యర్థాలు చెరువుల్లోకి రాకుండా కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు.పరిశ్రమలు కూడా ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు చేసుకొని కలుషిత నీళ్ళు బయటికి రాకుండా చూసుకోవలసిన బాధ్యత వారి మీద ఉందని లేదంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**ఈటల రాజేందర్ మాట్లాడుతూ**

జీడిమెట్ల కెమికల్ ఇండస్ట్రీ ఏరియా, జీనోమ్ వాలీ, తుర్కపల్లి, జవహర్ నగర్ డంప్ యార్డు నుంచి వచ్చిన మురుగునీరు, వాసన వల్ల ఈ ప్రాంత ప్రజల జీవనం దుర్భరంగా మారింది.వీచే గాలి విషం అయ్యింది.చర్మం దద్దుర్లు, ఊపిరితిత్తుల వ్యాధులు, అబార్షన్లు, క్యాన్సర్, పశువులు ప్రెగ్నెంట్ అవ్వడం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే వీరు నరకంలో బ్రతుకుతున్నారు.ఇవి మురికి కూపాలు కావు, ప్రాణాలు తీస్తున్న నరక కూపాలుగా మారాయి.ఇంత టెక్నాలజీ వచ్చినా, నిబంధనలు వచ్చినా రసాయన వ్యర్థాలను అరికట్టలేక పోతున్నారు.ప్రతి పరిశ్రమలో ట్రీట్మెంట్ ప్లాంట్ పెట్టాలి కానీ కొద్దిమంది ఫార్మా కంపెనీల యాజమాన్యాలు బోర్లు వేసి ఆ రసాయన వ్యర్థాలను భూమిలోకి పంపిస్తున్నారు. డ్రైనేజీ లలో వదిలి పెడుతున్నారు.

దీనివల్ల చెరువుల్లో ఉన్న చేపలు, వాటిని తిన్న కొంగలు, పక్షులు చనిపోతున్నాయి. నీళ్లు తాగి పశువులు చనిపోతున్నాయి.కొల్తూరు గ్రామంలో జీనోమ్ వ్యాలీ నుండి వచ్చిన రసాయన వ్యర్థాల వల్ల దాదాపు 15 లక్షల రూపాయల విలువైన చేపపిల్లలు చనిపోయాయి. ఈ చేపలు పెరిగితే కోటి రూపాయల సంపద. 250 కుటుంబాలు ఈ చేపల మీద ఆధారపడి ఉన్నాయి. కళ్ళముందే చనిపోతుంటే వీరు విలవిలలాడుతున్నారు. ఫార్మాకంపెనీల వల్ల మాకు ఉపాధి దొరుకుతుంది అనుకున్నాం, కానీ వీటివల్ల మా ప్రాణాలే పోతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.కిడ్నీ డయాలసిస్, అబార్షన్ వల్ల ఈ ఊరు వాళ్ళు ఇబ్బంది పడుతున్నారు.

సంపాదన అంతా ఆసుపత్రులకే అవుతుంది.పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వాళ్లు పెద్ద కంపెనీ వారు ఇచ్చే డబ్బులకు మరిగి పేదలు చచ్చిపోతున్న పట్టించుకోవడం లేదు.ఈ ప్రాంత ఎంపీ గా అవసరం అయితే డిల్లీ వరకు కంప్లైంట్ చేస్తాం..దీనికి శాశ్వత పరిష్కారం అందించేవిధంగా చర్యలు తీసుకుంటాము.

## కరీంనగర్ శిశుమందిర్ లో వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

**కరీంనగర్: పెన్ పవర్:** శ్రావణ శుక్రవారం సందర్భంగా కరీంనగర్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ హై స్కూల్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. పాఠశాల ఆచార్యులు, మాతృమూర్తులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు మరియు భక్తి వాతావరణం నడుమ వరలక్ష్మీ అమ్మవారికి వేద బ్రాహ్మణులు అభిషేక్ ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబాల సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం, పిల్లల విద్యాభివృద్ధి మరియు సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ... భారతీయ సంస్కృతిలో స్త్రీని కేవలం కుటుంబ సభ్యురాలిగా కాకుండా మాతృశక్తిగా, ఆదిశక్తిగా, దైవస్వరూపంగా గౌరవించే ఉన్నతమైన సంప్రదాయం ఉందని తెలిపారు. ఈ విలువలను బాల్యంలోనే పిల్లలలో పెంపొందించడం ద్వారా మహిళల పట్ల గౌరవం, కుటుంబ విలువలు మరియు సామాజిక బాధ్యతను పెంపొందించవచ్చని పేర్కొన్నారు. =ూా జన్మ శతాబ్ది స్ఫూర్తితో నిర్వహిస్తున్న "సప్తశక్తి సంగమం" కార్యక్రమాల ద్వారా నారీశక్తి చైతన్యం, మాతృశక్తి గౌరవం మరియు భారతీయ సంస్కృతి విలువలను సమాజంలో మరింత బలంగా చాటే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. స్త్రీలోని వివిధ శక్తి స్వరూపాలను గుర్తించి, మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రేరణ కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ, కరీనగర్ జిల్లా అధ్యక్షులు బొడ్ల శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమం భక్తి, సంస్కృతి, మాతృశక్తి మరియు విద్యా విలువల సమన్వయానికి ప్రతీకగా నిలిచింది. కార్యక్రమంలో అడ్వకేట్ బొడ్ల గీతారాణి, కమిటీ సభ్యురాలు అప్పిడి వకుళా దేవి, ఊత్కురు రజనీ శ్రీనివాస్, కార్యదర్శులు ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, గీకురు కృష్ణవేణి, ఆచార్య, మాతాజీ బృందం, విద్యార్థులు మరియు పేరెంట్స్ పాల్గొన్నారు.

## 22 ఏ శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు చిక్కుముడులు పరిష్కారం అయ్యేనా

**హైదరాబాద్, ఆగస్టు 21 పెన్ పవర్:** తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్న 22ఏ నిషేధిత భూముల వివాదానికి శాశ్వత ముగింపు పలికేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. నిషేధిత భూముల వివాదం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారానికి దారి తీసింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శల దాడి తీవ్రం చేశాయి. బీఆర్ఎస్ సీనియ్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకున్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద నుంచి భారీ సెటిల్మెంట్‌లు, 30 శాతం కమీషన్లు, వసూలు చేయడానికే ఉద్దేశపూర్వకంగా ఈ ప్రైవేటు భూములను 22ఏ జాబితాలోకి నెట్టేసి కృత్రిమ సమస్యలనుసృష్టించారని ఆరోపించారు. దీనికి బాధ్యత వహించి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో జోక్యం చేసుకున్న పెద్దలు ఎవరో తేల్చాలని అన్నారు. మరోవైపు బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి కూడా ఈ అంశంపై ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జరిగిన భూలావాదేవీలు, నిషేధిత భూముల జాబితా మార్పులవెనుక పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, దీనిపై తక్షణమే సమగ్ర శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తన వద్ద ఉన్న పక్కా ఆధారాలతో తాము చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. ఎటు చూసినా లక్షలాది మంది సామాన్యుల జీవితాలతో ముడిపడి ఉన్న ఈ భూవివాదాన్ని పరిష్కరించడం ద్వారా అటు ప్రజలకు భరోసా ఇవ్వడంతోపాటు, ఇటు విపక్షాల విమర్శల దాడికి కూడా అడ్డుకట్ట వేయాలని రేవంత్ రెడ్డి సర్కారు యోచిస్తోంది. 2025 డిసెంబర్‌లో రూపొందించిన నూతన నిషేధిత జాబితాపై సర్వత్రా అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్న నేథ్యంలో, ఆ వివాదాస్పద కొత్త జాబితాను పూర్తిగా పక్కన పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ తలనొప్పుల నుంచి బయటపడటానికి 2023 డిసెంబర్ కంటే ముందు అమలులో ఉన్న పాత నిషేధిత జాబితాకే పరిమితం కావడం అత్యుత్తమ మార్గమని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల ఉన్నతాధికారులు గట్టిగా యోచిస్తున్నారు. ప్రభుత్వం నిబంధనలు, క్రమబద్దీకరణ జీవోలను సైతం బేఖాతరు చేస్తూ రెవెన్యూ యంత్రాంగం తయారు చేసిన కొత్త జాబితా వల్ల లక్షలాది మంది సామాన్య కొనుగోలుదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులపాలవుతన్నారని తేలడంతో సర్కారు ఈ దిశగా కసరత్తు వేగవంతం చేసింది. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నతాధికారులతో నిర్వహించిన అత్యవసర టెలికాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పక్కా ఆధారాలు ఉన్న భూములకు వెంటనే రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఆయన

స్పష్టం చేశారు. నిషేధిత జాబితా అనేది దేవాదాయ, వక్ఫ్ ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న సీలింగ్ భూములు, కోర్టు అటాచ్మెం ట్లు, పన్ను ఎగవేతల కింద ఉన్న స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు ఉద్దేశించిన రక్షణ కవచం. 2007వ సంవత్సరం వరకు ఈ నిషేధిత భూములు అనే అంశంపై పెద్దగా చర్చలు జరిగేవి కావు. అప్పట్లో కేవలం 13. 82 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు, 7.21లక్షల ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలాలు, 41. 74 లక్షల ఎకరాల అటవీ భూములు, దేవాదాయ శాఖ పరిధిలోని 74, 128 ఎకరాలు, వక్ఫ్ బోర్డుకు చెందిన 45, 564 ఎకరాలు మాత్రమే ఈ జాబితాలో ఉండేవి. కానీ కాలక్రమేణా పరిధి అడ్డూఅదుపూ లేకుండా విస్తరిస్తూ పోయింది. 2007 నుంచి 2017 మధ్య కాలంలో రాష్ట్రంలో ఉన్న మొత్తం భూముల్లో సుమారు 10 శాతంమాత్రమే 22 ఏ కింద ఉండగా, నేడు అది ఏకంగా 30 నుంచి 40 శాతానికి చేరిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా 2025 డిసెంబరులో అనాలోచితంగా రూపొందిం చిన కొత్త జాబితాలో దశాబ్దాలుగా రైతుల సాగులో ఉన్న వ్యవసాయ భూములు, ఔటర్ రింగ్ రోడ్డు లోపల నిర్మించిన బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, సామాన్యులు కొనుగోలు చేసిన ఓపెన్ ప్లాట్లను కూడా నిషేధిత జాబితాలోకి నెట్టేయడం పెను దుమారానికి దారి తీసింది. కొత్తగా చేర్చిన ప్రైవేటు ఆస్తుల వల్ల రిజిస్ట్రేషన్ లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయి రియల్ ఎస్టేట్ రంగానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న అభ్యంతరాల వల్ల ఈ వారంలోనే వివాదాస్పద కొత్త జాబితాను రద్దు చేసి, 2023 డిసెంబర్ నాటి పాత జాబితా ప్రాతిపదికన మాత్రమే లావాదేవీలు జరపాలని ప్రభుత్వం ఒక నిర్దిష్టమైనతుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది. పాత రికార్డుల ప్రకారమే ముందుకు వెళ్లడం వల్ల ప్రస్తుతం తలెత్తిన అనేక వివాదాలు తక్షణమే సమసిపోతాయని అధికారులు గట్టిగా నమ్ముతున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జారీ చేసిన తాజా ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో సబ్‌రిజిస్ట్రార్‌లు స్వయంగా చొరవ తీసుకుని బాధితులకు ఫోన్‌ల ద్వారా సమాచారం అందిస్తూ రిజిస్ట్రేషన్లు వేగవంతం చేస్తున్నారు.

# నాసిక్, సూరత్ తర్వాత రంగారెడ్డి..

**హైదరాబాద్, ఆగస్టు 21 పెన్ పవర్:** ఆర్థికంగా వేగంగా ఎదుగుతున్న ప్రాంతాల్లో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చోటు దక్కింది. జైపుర్, నాసిక్, సూరత్, ముర్షిదాబాద్‌తో పాటు రంగారెడ్డి తన ఆర్థిక ప్రాధాన్యాన్ని పెంచుకుంటున్నట్లు 'డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్' తాజా నివేదిక వెల్లడించింది. దేశ ఆర్థిక వృద్ధి ఇక సంప్రదాయ మెట్రో నగరాలకే పరిమితం కాకుండా కొత్త ప్రాంతాలకు విస్తరిస్తోందని తెలిపింది.'డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ సిటీ వైటాలిటీ ఇండెక్స్' ప్రకారం దేశంలో అత్యంత ఆర్థికంగా కీలకమైన మెట్రో నగరంగా పుణె నిలిచింది. ఐటీ సేవలు, అధునాతన తయారీ, ఆటోమొబైల్, విద్య, ఆవిష్కరణ ఆధారిత కార్యకలాపాలు పుణెకు కలిసొచ్చాయి. అహ్మదాబాద్ రెండో స్థానంలో నిలిచింది. మెట్రో నగరాల్లో ఆర్థిక వృద్ధి వేగం విషయంలో కోల్‌కతా ముందుంది.ఏప్రిల్–జూన్ 2026 కాలానికి రూపొందించిన సూచీలో దేశవ్యాప్తంగా 800కుపైగా జిల్లాలను పరిశీలించారు. ఉపగ్రహ ఆధారిత భౌగోళిక పరిశీలన డేటాతో పాటు ఆర్థిక సూచీలను ఇందుకు ఉపయోగించారు. అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో సౌత్ 24 పరగణాస్ అగ్రస్థానంలో నిలిచింది. నార్త్ 24 పరగణాస్, థానే తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జైపుర్, నాసిక్, సూరత్, ముర్షిదాబాద్, రంగారెడ్డి ప్రాంతాలు కూడా తమ ఆర్థిక ప్రాధాన్యాన్ని పెంచుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. గత దశాబ్దంలో దిమాపూర్, పంచమహల్స్, ఆనంద్, అయోధ్య, రాంపుర్, బస్తీ, షామ్లీ, బౌధ్, ఔరంగాబాద్, కోడెర్మా వంటి జిల్లాలు స్థిరమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేశాయి.దేశంలో పట్టణీకరణ మరింత విస్తృతంగా జరుగుతోందని నివేదిక పేర్కొంది. పెట్టుబడులు, వ్యాపారాలు, ప్రతిభావంతులైన మానవ వనరులు, మౌలిక వసతులు కొత్త నగరాల వైపు వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపింది. భవిష్యత్ పెట్టుబడులకు ఈ కొత్త వృద్ధి మార్గాలు కీలకంగా మారనున్నాయని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ అభిప్రాయపడింది.

# తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతోంది



**హైదరాబాద్, ఆగస్టు 21 పెన్ పవర్:** తెలంగాణలో 2023 ఎన్నికల్లో ఎనిమిది శాసనసభ స్థానాలను గెలుచుకుని, ఆ తర్వాత జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఏకంగా ఎనిమిది లోక్ సభ స్తానాలను గెలుచుకుని సత్తాచాటిన భారతీయ జనతా పార్టీఇటీవలి కాలంలో చతికిల పడినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నాలుగు ఎంపీ స్థానాల నుండి గత లోక్ సభ ఎన్నికల్లో ఎనిమిది లోక్ సభ స్థానాలు అంటే 56 శాసనసభ స్థానాలలో ప్రభావంచూపించి గెలిచిన పార్టీ ఆ తర్వాత ఆ స్థాయిలో పుంజుకోక పోవడానికి కారణం ఏంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గ్రూప్–1పై మాజీ సీఎం జగన్ సంచలన నిర్ణయం గతంలో బీజేపీ నేతలు, ప్రస్తుత బీజేపీఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావులు తీవ్ర విమర్శలతో ప్రభుత్వం మీద విరుచుకుపడేవారు. కానీ ఇటీవల కాలంలో వారు పూర్తిగా సైలెంట్ అయిపోయారు. అంతర్గత

కలహాలతో పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి దూరంగా ఉంటున్నాడు. ఇక పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఉంటున్నారు. బండి సంజయ్ కుమారుడి మీద ఆరోపణలతో పాటు రఘునందన్ రావు అసైన్డ్ భూముల కొనుగోలు వ్యవహారం కూడా చర్చానీయాంశం అయింది.ఇది ఇలా ఉంటే కిషన్ రెడ్డి కేంద్ర మంత్రులతో అపాయింట్ మెంట్ ఇప్పించాలని, మహారాష్ట్ర సీఎంతో అపాయింట్ మెంట్ ఇప్పించి, ఆ ప్రభుత్వాన్ని తుమ్మిడిహెట్టి వద్ద 152 అడుగుల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించాలని రేవంత్ రెడ్డి పలుమార్లు డిమాండ్ చేయడం జరిగింది. కానీ ఆయన డిమాండ్లను సరైన రీతిలో తిప్పికొట్టకపోగా, దగ్గరుండి కేంద్ర మంత్రులను కల్పించి, హైదరాబాద్ మెట్రోకు నిధులు సమకూర్చే విషయమై మంతనాలు జరిపారు. కానీ ఇప్పటి వరకు నిధులు రాకపోగా, రోజుకు రెండు కోట్లు అదనంగా

తెలంగాణ ఖజానా మీద భారం పడుతున్నది. మెట్రో రైలు స్వాధీనం విషయంలో రేవంత్ రెడ్డి వైఖరిని ఎండగట్టకుండా వదిలేయడం మూలంగానే మెట్రో విషయంలో తను చేసిన తప్పును కేంద్ర ప్రభుత్వం మీదకు నెట్టే ప్రయత్నం జరుగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.షహజాద్ భట్టీ సంచలన వ్యాఖ్యలు ఈ పరిణామాలు ఇలా ఉంటే ఉత్తర తెలంగాణలోని ఒక ఎంపీ బీజేపీ నుండి కాంగ్రెస్ వైపు వెళ్లేందుకుపావులు కదుపుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తెలంగాణ బీజేపీ పనితీరు మీద అసహనంతో ఉన్న ఆ ఎంపీ ఇటీవల ఒక ఏఐసీసీ నేతతో టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తుంది. రెండో సారి ఎంపీఅయినప్పటి నుండి కేంద్ర మంత్రి పదవి మీద కన్నేసిన సదరు ఎంపీ అది దక్కక పోవడంతో కనీసం రాష్ట్ర అధ్యక్ష్య పదవి అయినా వస్తుందని ఆశించారు. కానీ ఆ రెండూ దక్కక పోవడంతో కాంగ్రెస్ వైపుకన్నేసినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలోనే ఆయన ఏఐసీసీ నేతకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలు, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలు, వాటి పర్యావసనాలు, మంత్రులు, ఎమ్మెల్యేల తీరు మీదనివేదికలు పంపుతున్నట్లు సమాచారం. ప్రతి సారీ ఈ సారి బీజేపీ అధికారంలోకి రావడం గ్యారంటీ అని భావిస్తుంటే, ఏదో ఒక కారణంతో పార్టీ గ్రాఫ్ పడిపోతుందని బీజేపీ కార్యకర్తలు వాపోతున్నారు.త్వరలోనే తెలంగాణలో అధికారం లక్ష్యంగా బీజేపీ అధిష్టానం చర్యలు చేపట్టబోతుంది అని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరి ఈ చిక్కుముళ్లను దాటుకుని ఎలా ముందుకు సాగుతారో వేచిచూడా

# హన్మకొండ జిల్లాలో కారులో డెడ్ బాడీ కలకలం

**హన్మకొండ ఆగస్టు 21 పెన్ పవర్:** ఎల్కతుర్తి మండల కేంద్రంలో కారు (TS 03 FF 8094) డిక్కీలో గుర్తుతెలియని యువతి మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు గత రెండు రోజులుగా అక్కడే

కారును వదిలేసి వెళ్లారు. కారు నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించి విచారణ చేపట్టారు. కారు ఓనర్ సురేందర్

దగ్గర కొద్ది రోజుల క్రితం వినోద్ అనే సాఫ్ట్వేర్ ఉద్యోగి కారు అద్దెకు తీసుకున్నట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# రెడ్మీ నోట్ 17 5జీ' ఫోన్ లాంచ్ చేసిన సినీనటి హెబ్బా పటేల్

**హైదరాబాద్, ఆగస్టు 21 పెన్ పవర్:** అమీర్ పేట వ్యాల్యూ జోన్ లోని సత్య మొబైల్స్లో నటి హెబ్బా పటేల్ సందడి చేశారు. సత్య మొబైల్స్ లో షావోమీ సబ్ బ్రాండ్ రెడ్మీ నోట్ 17 5జీ స్మార్ట్ మొబైల్ పే హెబ్బా పటేల్ సత్య ఏజెన్సీస్ ప్రతినిధి యూసుఫ్ తో కలిసి లాంచ్ చేశారు. ఈ సరి కొత్త మొబైల్లో కొంగొత్త ఫీచర్స్ తో వినియోగ దారులను ఆకట్టుకుంటుదన్నారు. ఈ సిరీస్లో దేశీయ మార్కెట్లోకి ప్రవేశించిన తొలి ఫోన్ ఇదే కావడం విశేషం. 8,000 ఎంఏహెచ్ భారీ బ్యాటరీ, 120హెర్ట్జ్ అమోలెడ్ డిస్ప్లే, స్నాప్డ్రాగన్ 4 జెన్ 4 ప్రాసెసర్ వంటి బలమైన ఫీచర్లతో తీసుకొచ్చిన ఈ స్మార్ట్ఫోన్ ప్రారంభ ధరను కంపెనీ రూ.27,999గా నిర్ణయించింది.

# కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో 18 వా కరాటే కాంపిటేషన్

**హైదరాబాద్, ఆగస్టు 21 పెన్ పవర్:** యూసఫ్ గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన 18 వా కాంపిటేషన్ నిర్వహించారు. దాదాపు 500 మంది కరాటే జపాన్ కరెక్టే కి సంబంధించిన మాస్టర్లతో పాటు యువకులు యువతులు పాల్గొన్నారు. జపాన్ నుంచి వచ్చిన ముఖ్యఅతిథి తనయమ షిశాన్ హాకీ జూమ్ రాసిన షిశాన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ప్రతి ఒక్క యువకుడికి ఆత్మ రక్షణ కోసం కరటే నేర్చుకోవాల్సిందే అని జపాన్ కి సంబంధించిన మాస్టర్లు తెలిపారు. ముఖ్యంగా మహిళలకి యువతులకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకుని ఎక్కడ ఎలాంటి సంఘటన తన పైకి వచ్చినప్పుడు ఆత్మరక్షణ ఎలా చేసుకోవాలని జపాన్ కరాటే అసోసియేషన్ వారు గత 18 సంవత్సరాల నుండి తెలంగాణ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కార్యక్రమాలని నిర్వహిస్తున్నారు. యువకులని ప్రోత్సహించడానికి కాంపిటేషన్లు కూడా నిర్వహిస్తున్నారా అన్నారు.ఈ కార్యక్రమం మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు ప్రాక్టీస్ నిర్వహించిన తర్వాత రెండో రోజు నుంచి టోర్నమెంట్ ప్రారంభం కానున్నది ఈ టోర్నమెంట్లో దేశవ్యాప్తంగా కరాటే కాంపిటీషన్లో యువకులు యువకులు పాల్గొన్నారు.

# కొండా సురేఖ పై మండపడ్డ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత వ్యాఖ్యాలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మండిపడుతున్నారు. బహిష్కరించకముందే ముందే పార్టీ నుంచి వెళ్లిపోండి అని కొండా సురేఖ ను ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేసారు. మా పార్టీలోనే కొన్ని గుంట నక్కలు కొండా సురేఖ వెనకాల ఉన్నాయి. అమ్మా సురేఖ.. రేవంత్ రెడ్డి రక్తం తాగింది చాలు పార్టీ నుండి వెళ్ళిపొండి. కొండా సురేఖను పార్టీలో నుండి బహిష్కరించక ముందే ఆమెనే వెళ్లిపోతే మంచిది. మాలాంటి వాళ్లని అవమానపరుస్తూ మా రక్తం తాగుతామంటే మేము చూస్తూ సహించమని అన్నారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీ అందరం అండగా వున్నామని అన్నారు. నటి సమంత విషయం లో కూడా సురేఖ ఇలాగే మాట్లాడరని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పై ఎవరు విమర్శలు చేసిన చూస్తూ ఊరుకోమని వారు హెచ్చరించారు.ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ రేవంత్ నిర్ణయాలను వ్యతిరేకిస్తే పార్టీలో ఉండే అర్హత లేదని అన్నారు. కొండా సురేఖకు నోటీసులు ఇస్తే తన బిడ్డ వ్యాఖ్యలకు తనకు సంబంధం లేదని చెబుతున్నారని, సంబంధం లేకపోతే ఆ వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. తప్పుడు భాషతో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం మూల్యం చెల్లిస్తున్నారని విమర్శించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కేసీఆర్-కేటీఆర్.. ఓ జగన్.. అంతా ఒక్కటే..?







**హైదరాబాద్, ఆగస్టు 21 పెన్ పవర్:** "హైదరాబాద్ వచ్చామా.. ప్రైవేట్ కార్యక్రమానికి వెళ్లామా.. సైలెంట్‌గా తిరిగెళ్లామా" అనుకుంటే అది అసలైన రాజకీయ నాయకుడే కాదు! వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి భాగ్యనగర పర్యటన సందర్భంగా వెలిసిన ఒకే ఒక్క బ్యానర్ ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాన్ని 'ఫెవికాల్' వేసి మరీ ఊపేస్తోంది. అటు కొడుకు, ఇటు తండ్రి.. మధ్యలో జగన్ బాబు.. బ్యానర్‌లో కేసీఆర్, కేటీఆర్‌లతో కలిసి జగన్ చిరునవ్వులు చిందిస్తుంటే.. "ఇది అభిమానుల అత్యుత్సాహమా? లేక 'మా ఇద్దరి శత్రువు ఒక్కడే' అంటూ ఇచ్చిన హిడెన్ మెసేజ్ ఆ?" అని పొలిటికల్ విశ్లేషకులు బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారు. ఈ బ్యానర్ ద్వారా ఏమైనా కొత్త పొత్తుల గుసగుసలు మొదలయ్యాయా అని చూసేవాళ్లు పెదవి విరుస్తున్నారు.ఒకవైపు రేవంత్–చంద్రబాబు ఫ్రెండ్‌షిప్ ట్రాక్ నడుస్తుంటే కౌంటర్‌గా 'మేమూ తక్కువ కాదండోయ్' అంటూ జగన్–బీఆర్ఎస్ నేతల ఈ ఫొటో ఫ్రేమ్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఇది కేవలం స్వాగత తోరణమా, లేక రాబోయే రోజుల్లో రాజకీయాన్ని మలుపు తిప్పే 'మాస్టర్ ప్లాన్' నా అనేది కాలమే నిర్ణయించాలి కానీ ప్రస్తుతం మాత్రం ఈ బ్యానర్ రాజకీయం రెండు రాష్ట్రాల కార్యకర్తలకు మంచి మసాలా ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందిస్తోంది.హైదరాబాద్‌లో వైసీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. సాధారణంగా ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చే జగన్‌కు స్వాగతం పలుకుతూ భారీ బ్యానర్లు ఏర్పాటు చేయడం పెద్ద విషయం కాకపోవచ్చు. కానీ ఆ బ్యానర్లలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి జగన్ కనిపించడం మాత్రం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల్లో హైదరాబాద్‌లోని రహదారుల వెంట ఏర్పాటు చేస్తున్న బ్యానర్లపై జగన్‌తో పాటు కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు కనిపిస్తున్నాయి. దీంతో ఇది కేవలం అభిమానుల స్వాగత కార్యక్రమమా? లేక తెలంగాణ––ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొనసాగుతున్న ఒక అంతర్గత రాజకీయ అనుసంధానానికి సంకేతమా? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

**బ్యానర్ వెనుక అసలు రాజకీయ కథ ఏమిటి?**

ఒక నాయకుడికి స్వాగతం పలికేందుకు బ్యానర్ ఏర్పాటు చేయడం సహజమే. కానీ ఆ బ్యానర్‌లో మరో రాష్ట్రానికి చెందిన మాజీ ముఖ్యమంత్రి, ఆయన పార్టీకి చెందిన కీలక నేతల ఫొటోలను కలిపి ప్రదర్శించడం మాత్రం ఒక రాజకీయ సందేశాన్ని ఇవ్వగలదు. జగన్––బీఆర్ఎస్ నేతల మధ్య రాజకీయ సాన్నిహిత్యం కొత్త విషయం కాదు. ఏపీ రాజకీయాల్లో వైసీపీ, తెలంగాణలో బీఆర్ఎస్.. రెండు పార్టీల రాజకీయ ప్రయాణాలు వేర్వేరు అయినప్పటికీ, కొన్ని అంశాల్లో ఇరు వర్గాల మధ్య సాన్నిహిత్యంపై చాలాకాలంగా చర్చ జరుగుతోంది. ఇప్పుడు హైదరాబాద్‌లో కనిపిస్తున్న ఈ దృశ్యం ఆ చర్చకు మరోసారి బలం చేకూర్చింది.

**తెలంగాణ రాజకీయాల్లో 'ఆంధ్ర' కోణం**

తెలంగాణ రాజకీయాలను కేవలం తెలంగాణకు సంబంధించిన రాజకీయాలుగానే చూడటం క్రమంగా కష్టమవుతోంది. హైదరాబాద్ రాజకీయాల్లో ఏపీకి చెందిన రాజకీయ పార్టీలకు, నాయకులకు ఉన్న సామాజిక, ఆర్థిక, కుటుంబ సంబంధాల ప్రభావం కూడా కనిపిస్తూనే ఉంటుంది. తెలుగుదేశం పార్టీకి చెందిన వర్గాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రాజకీయంగా దగ్గరగా ఉన్నాయనే చర్చ ఒకవైపు ఉండగా.. వైసీపీ అనుకూల వర్గాలు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్నాయనే అభిప్రాయం మరోవైపు వినిపిస్తోంది. అంటే తెలంగాణ రాజకీయాల్లో కూడా ఏపీ రాజకీయాల ప్రభావం ఒక రకమైన 'పరోక్ష ధ్రువీకరణ'ను సృష్టిస్తోందన్న మాట.

**జగన్‌కు హైదరాబాద్‌లో మద్దతు ఎంత?**

జగన్‌కు హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల నుంచి ఇప్పటి వరకు హైదరాబాద్ ఆయన రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన నగరంగానే ఉంది. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ, ఆ తర్వాత కూడా హైదరాబాద్‌లో జగన్‌కు మద్దతుగా ఉండే వర్గాలు కనిపించాయి. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో జగన్ హైదరాబాద్‌కు రావడం, అదే సమయంలో బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన ఫొటోలతో బ్యానర్లు దర్శనమివ్వడం.. వైసీపీ––బీఆర్ఎస్ మధ్య ఉన్న సంబంధాలపై ఆసక్తిని పెంచుతోంది.

**ఇది పొత్తుకు సంకేతమా?**

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. ఒక బ్యానర్ ఆధారంగా రెండు పార్టీల మధ్య అధికారిక రాజకీయ పొత్తు లేదా భవిష్యత్ కూటమిని నిర్ధారించడం తొందరపాటు అవుతుంది. ప్రస్తుతం కనిపిస్తున్నది ప్రధానంగా రాజకీయ సాన్నిహిత్యానికి సంబంధించిన ఒక దృశ్య సంకేతం మాత్రమే.

అయితే రాజకీయాల్లో సంకేతాలకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యంగా ప్రత్యర్థి పార్టీల మధ్య దూరం పెంచుకునే సమయంలో, ఒకే ఫ్రేమ్‌లో కీలక నేతల ఫొటోలు కనిపించడం కార్యకర్తలకు, అభిమానులకు ఒక సందేశాన్ని పంపుతుంది. అదే ఇప్పుడు ఈ బ్యానర్లపై చర్చకు కారణమవుతోంది.

**రేవంత్ వర్సెస్ కేసీఆర్.. మధ్యలో జగన్?**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ప్రధాన ప్రత్యర్థిగా మారింది. మరోవైపు ఏపీలో వైసీపీ అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో ఉంది. ఈ రెండు పార్టీలకు ప్రస్తుతం ఉమ్మడిగా ఉన్న అంశం.. అధికారంలో లేని పరిస్థితి. అలాంటి సమయంలో రాజకీయంగా ఒకరికి ఒకరు దగ్గరగా కనిపించడం సహజంగానే ఆసక్తిని రేకెత్తిస్తుంది. ముఖ్యంగా రేవంత్‌రెడ్డి––చంద్రబాబు నాయుడు మధ్య రాజకీయ సంబంధాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో జగన్–బీఆర్ఎస్ అనుసంధానం కనిపించడం తెలంగాణ రాజకీయాలకు మరో కోణాన్ని జోడిస్తోంది.

**సోషల్ మీడియా బ్యానర్ నుంచి పొలిటికల్ నేరేటివ్ వరకు..**

వాస్తవానికి ఈ ఘటనకు ఉన్న ప్రాధాన్యం బ్యానర్‌లో కంటే దాని చుట్టూ ఏర్పడుతున్న రాజకీయ నేరేటివ్‌లో ఎక్కువగా ఉంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న దృశ్యాలు ఇప్పటికే 'జగన్–కేసీఆర్–కేటీఆర్' కలయికపై చర్చకు తెరతీశాయి.

రాజకీయాల్లో ఒక ఫొటో వెయ్యి మాటలు మాట్లాడుతుంది. ప్రస్తుతం ఈ బ్యానర్లు కూడా అలాంటి రాజకీయ చిత్రంగానే మారాయి. ఇది అధికారిక పొత్తుకు సంకేతమా, అభిమానుల స్వాగతమా, లేక భవిష్యత్ రాజకీయ సంబంధాలకు చిన్న సూచనా అన్నది మాత్రం రాబోయే రోజుల్లోనే స్పష్టమవుతుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం.. జగన్ హైదరాబాద్ పర్యటన కేవలం ఒక ప్రైవేట్ కార్యక్రమానికి పరిమితమైన అంశంగా కాకుండా, తెలంగాణ రాజకీయాల్లో వైసీపీ––బీఆర్ఎస్ సాన్నిహిత్యంపై మరోసారి చర్చకు కారణమైంది.

# 'రేఖ' దాటిన సురేఖ .. రాజీనామా ? తొలగింపా ?



**హైదరాబాద్, ఆగస్టు 21 పెన్ పవర్:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు వేడెక్కాయి. మొన్నటి దాకా ప్రశాంతంగా సాగుతున్న సర్కారులో మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మిత వ్యాఖ్యలు మంటలు రేపాయి. సీఎం రేవంత్ రెడ్డి మీద, ఆయన సోదరుడి మీద, మంత్రి పొంగులేటి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిల మీద చేసిన వ్యాఖ్యలపై రేవంత్ వర్గం కొండా కుటుంబం మీద ఆగ్రహంగా ఉంది.

సుష్మిత వ్యాఖ్యల మీద జారీచేసిన షోకాజ్ నోటీసుకు సమాధానం ఇచ్చిన కొండా సురేఖ అందులో తన కూతురు చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమని, వాటిని తనకు ఆపాదించడం సరికాదని పేర్కొన్నది. కానీ తన కూతురు చేసిన వ్యాఖ్యల పట్ల కనీసం అభ్యంతరం వ్యక్తం చేయలేదని, అదే సమయంలో కనీసం దురదృష్టకరం అని ఖండించక పోవడం కూడా రేవంత్ వర్గం ఆగ్రహానికి కారణంగా కనిపిస్తుంది.ఈ నేపథ్యంలో శుక్రవారం గాంధీభవన్లో సమావేశం అయిన 18 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కొండా సురేఖ కూతురు వ్యాఖ్యలతో పాటు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మీద, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీద విరుచుకుపడ్డారు. వారిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖ వ్యాఖ్యలు ఎప్పుడూ పార్టీకి నష్టం కలిగిస్తున్నాయని, గతంలో సమంత విషయంలో చేసిన వ్యాఖ్యలు పార్టీకి నష్టం చేశాయని, అసలు కాంగ్రెస్ పార్టీలో సభ్యురాలు కూడా కానీ సుష్మిత పార్టీ ఎమ్మెల్యే గురించి అడ్డగోలుగా మాట్లాడే బజారు కల్చర్ ఏంటని ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రశ్నించారు.పిల్లకాకి కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలు కొండా సురేఖ మాటలు గానే భావిస్తున్నామని మరో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. తమ పార్టీలోనే కొన్ని గుంట నక్కలు కొండా సురేఖ వెనక ఉన్నాయని, ఆమెను పార్టీ నుండి బహిష్కరించకముందే ఆమె వెళ్లిపోతే బాగుంటుందని, కనీసం జిల్లాలో ఒక్క ఎమ్మెల్యేతో అయినా ఆమె కలుపుగోలుగా ఉందా అని ప్రశ్నించారు. అయితే కొండా సురేఖ వ్యాఖ్యల నేపథ్యంలో పెట్టిన సమావేశంలో చిన్నారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలను కూడా బహిష్కరించాలని డిమాండ్ చేయడంతో ఈ వ్యవహారం ఎలాంటి మలుపులు తిరుగుతుందో అన్న ఉత్కంఠ నెలకొన్నది.సాధారణంగా ఒకే కుటుంబంలోని వ్యక్తులు వివిధ రాజకీయా పార్టీలలో కొనసాగడం సాధరణంగా జరుగుతూ ఉంటుంది. ఇతర పార్టీలలో ఉండి విమర్శలు చేయడం సాధారణం. అయితే కొండా సురేఖ, కొండా మురళి దంపతులకు ఉన్నది ఒక్కతే కూతురు. తను భవిష్యత్తులో పరకాల ఎమ్మెల్యే అవుతుందని కొండా సురేఖ భర్త మురళి కొద్ది రోజుల క్రితం ప్రకటించాడు. ఆ తర్వాత పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి పరకాల నుండి మళ్లీ రేవూరి ప్రకాష్ రెడ్డి పోటీ చేస్తాడని ప్రకటించిన నేపథ్యంలోనే కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి.కూతురు వ్యాఖ్యలను కొండా సురేఖ ఎక్కడా ఖండించడం లేదా పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు. అదే సమయంలో సురేఖ భర్త కొండా మురళి ఎక్కడా స్పందించలేదు. అదే సమయంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని సుష్మిత చెప్పడం వివాదాన్ని మరింత ముదిరేలా చేస్తుంది. తన వ్యాఖ్యల మీద స్పందిస్తే రేవంత్ రెడ్డి చిట్టా విప్పుతానని కొండా సుష్మిత ప్రకటించిన విషయం తెలిసిందే.తాజాగా గాంధీభవన్ లో కాంగ్రెస్ ప్రజాప్రతినిదుల మీడియా సమావేశం చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కొండా సుష్మిత ఎలా స్పందిస్తుంది అన్నది ఆసక్తికరంగా మారింది. కొండా సురేఖ విషయంలో అధిష్టానం ఎలా వ్యవహరిస్తుంది ? ఆమెను మంత్రి పదవి నుండి తప్పించాలని రేవంత్ వర్గం డిమాండ్ చేస్తుందా ? లేక సురేఖ స్వయంగా రాజీనామా చేస్తుందా ? బీసీ మహిళ అయిన నేపథ్యంలో చర్యలు లేకుండా మరోసారి పార్టీ అధిష్టానం రాజీ కుదిరిస్తుందా ? అన్నది వేచిచూడాలి.

# ఏపీలోనూ 22 ఏ ప్రకంపనలు

**విజయవాడ, ఆగస్టు 21 పెన్ పవర్:** మాజీ ఐపీఎస్ అధికారి, ఏపీ ఇంటెలిజెన్స్ పూర్వ అధిపతి ఏబీ వెంకటేశ్వరరావు ఇటీవల ఏపీ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల జాబితా పరిరక్షణ ఆందోళనల్లో చురుగ్గా పాల్గొనడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రమైన వేధింపులకు, సస్పెన్షన్‌కు గురై సత్యమేవ జయేతే అంటూ పోరాడిన ఆయన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలోకి చేరకపోవడం, పైగా పాలనా లోపాలపై గళమెత్తడం వెనుక అసలు ప్లాన్ ఏంటనేది ఆసక్తికర చర్చకు దారితీసిందిఏబీ వెంకటేశ్వరరావును టీడీపీ పార్టీలోకి చేర్చుకోనందుకే ఆయన అసంతృప్తితో విమర్శలు చేస్తున్నారు. తాను టీడీపీలో చేరాలని గతంలో అనుకున్నప్పటికీ సరైన స్పందన రాలేదని ఆయనే పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినా ఆయన తీసుకోలేదు. అందుకే ఆ తర్వాత ఆయన మరికొంత మంది ఇతరులతో కలిసి సెంటర్ ఫర్ లిబర్టీ అనే వేదిక ద్వారా 22ఏ నిషేధిత భూముల జాబితా కారణంగా నష్టపోతున్న లక్షలాది మంది ప్రజల హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పోరాడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, రెవెన్యూ అధికారులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ స్థాయి నేతలకు అధికారుల వాస్తవాలు సరిగ్గా చేరవేడం లేదని ఆయన




బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ భూముల సమస్య ప్రజా ఉద్యమంగా మారడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ఆయుధంగా దీనిని మలుచుకున్నారు. రోల్ బ్యాక్ 22ఏ పేరుతో ఉద్యమం చేస్తున్నారు. ఇక సొంత పార్టీ ఏర్పాటు ప్రకటన విషయానికి వస్తే, ఏబీ వెంకటేశ్వరరావు తన వైఖరిని స్పష్టం చేశారు. ఏదో ఒక రాజకీయం వెనుక నడవడం కంటే సమాజంలో మార్పు కోసం, పౌర హక్కుల పరిరక్షణ కోసం తమ భావసారూప్యత కలిగిన వ్యక్తులతో కలిసి కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని ప్రకటించారు. అధికారం పొందేందుకు కాకపోయినా, ఒక బలమైన వాచ్‌డాగ్‌గా, ఒత్తిడి గ్రూప్‌గా పనిచేయడానికే ఈ నూతన వేదిక ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.తెలుగుదేశం పార్టీ ఇలాంటి మాజీ అధికారులను , సానుభూతిపరులను ఎందుకు దూరం చేసుకుంటోందనే ప్రశ్నకు రాజకీయ వ్యూహాలే సమాధానంగా కనిపిస్తున్నాయి. మాజీ అధికారుల స్వేచ్ఛా ప్రకటనలు ప్రభుత్వ నిర్ణయాలకు అవరోధంగా మారడం, లేదా పార్టీకి క్యాడర్ ఆధారిత నాయకత్వమే ప్రాధాన్యత కావడం ఇందుకు కారణం కావచ్చు. అదే సమయంలో, సుదీర్ఘకాలం ఇంటెలిజెన్స్ వైపు పనిచేసిన అనుభవం ఉన్న వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని నియంత్రించే లోపాలను పసిగట్టి వేలెత్తి చూపిస్తుండటంతో కూటమి సర్కారుకూ ఇది ఇబ్బందికరంగా పరిణమించింది. తన చట్టపరమైన పోరాటం ముగిసిన తర్వాత, సమాజంలో ఒక ఇండిపెండెంట్ లీడర్‌గా, ప్రజా సమస్యలపై పోరాడే సివిల్ సొసైటీ వాయిస్‌గా తనను తాను నిలబెట్టుకునేందుకు వేస్తున్న వ్యూహాత్మక అడుగుగా దీనిని చూడొచ్చు.

# పొలిటికల్ ఆడిటింగ్ పూర్తి - విజయసాయిరెడ్డి పార్టీ టార్గెట్ ఇదే !



**నెల్లూరు, ఆగస్టు 21 పెన్ పవర్:** రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్లు ప్రకటించి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి.. ఇప్పుడు అనూహ్యంగా తిరుమల శ్రీవారి సాక్షిగా సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఈ నెలలోనే విజయవాడ వేదికగా పార్టీ పేరు, జెండా, విధివిధానాల రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు.రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్లు ప్రకటించి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి.. ఇప్పుడు అనూహ్యంగా తిరుమల శ్రీవారి సాక్షిగా సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఈ నెలలోనే విజయవాడ వేదికగా పార్టీ పేరు, జెండా, విధివిధానాల రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. అయితే, వైఎస్సార్‌సీపీలో నంబర్ టూగా చక్రం తిప్పి, దేశంలోనే అగ్రశ్రేణి ఆడిటింగ్ మాస్టర్‌గా పేరొందిన విజయసాయిరెడ్డి.. కేవలం ప్రజాసేవ కోసమే కొత్త దుకాణం తెరుస్తున్నారంటే ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. రాజకీయాల్లో సొంత పార్టీ నడపడం అంటే ఆర్థికంగా భారీ వ్యయంతో కూడుకున్న వ్యవహారమని తెలిసినా ఆయన ఈ అడుగు వేస్తున్నారంటే, ఆ పెట్టుబడి వెనుక అంతకుమించిన భారీ ప్రయోజనాలు, సరికొత్త లెక్కలు దాగి ఉన్నాయని స్పష్టమవుతోంది.ఈ సరికొత్త రాజకీయ ప్రయోగం వెనుక ప్రధానంగా వినిపిస్తున్న వాదన వ్యక్తిగత, వ్యాపార రక్షణ కవచం . గత ఐదేళ్ల పాలనలో విశాఖపట్నం భూముల వ్యవహారాలు, దసపల్లా భూ వివాదాలు, లిక్కర్ లావాదేవీలు, అనేక ఆస్తుల క్రయవిక్రయాల్లో ఆయనపై లెక్కలేనన్ని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత ఫైళ్లు తిరగదోడే ప్రమాదం ఉండటం, మరోవైపు సీబీఐ, ఈడీ అక్రమాస్తుల కేసుల విచారణలు కొనసాగుతుండటంతో.. కేవలం సాధారణ పౌరుడిగా ఉంటే చట్టపరమైన ఉచ్చు బిగుస్తుందన్న భయం ఆయనను వెంటాడుతోందన్న ప్రచారం ఉంది. రేపు ఏ విచారణ సంస్థ దర్యాప్తు చేపట్టినా, రాజకీయ కక్షసాధింపు , కొత్త పార్టీ పెట్టినందుకే వేధింపులు అనే ముద్ర వేసి ప్రజాక్షేత్రంలో సానుభూతి పొందడానికి ఒక రాజకీయ పార్టీ హోదాను రక్షణ కవచంగా వాడుకోవాలన్నదే ఆయన మొదటి వ్యూహం కావొచ్చు.మరో బలమైన రాజకీయ కోణం బీజేపీ పెద్దల గేమ్ ప్లాన్ . ఢిల్లీలోని కమలనాథులతో విజయసాయిరెడ్డికి ఉన్న బలమైన సంబంధాలు అందరికీ తెలిసినవే. ఏపీలో కూటమి బలంగా ఉండటంతో నేరుగా బీజేపీలో చేరడానికి సాంకేతిక, రాజకీయ ఇబ్బందులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదా ఒక వర్గం అసంతృప్తి ఓట్లు వైఎస్సార్‌సీపీకి మళ్లీ గంపగుత్తగా పడకుండా నిరోధించేందుకు ఒక ప్రత్యేక టూల్ గా ఈ కొత్త పార్టీని రంగంలోకి దించుతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తటస్థంగా ఉంటూనే, తెరవెనుక ఢిల్లీ పెద్దల ప్రయోజనాలకు అనుగుణంగా పావులు కదిపేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.ఇక మూడో కోణం వైఎస్ జగన్మోహన్ రెడ్డితో మైండ్ గేమ్. వైఎస్సార్‌సీపీలో సజ్జల రామకృష్ణారెడ్డి ప్రాబల్యం పెరిగి తనను పక్కనపెట్టిన నాటి నుంచి రగిలిపోతున్న విజయసాయిరెడ్డి.. తాడేపల్లి ప్యాలెస్‌కు గట్టి చెక్ పెట్టాలని చూస్తున్నారు. వైఎస్ కుటుంబానికి చెందిన నమ్మకస్తుడైన ఆడిటర్‌గా పార్టీలోని ప్రతి నాయకుడి ఆర్థిక మూలాలు, అంతర్గత బలహీనతలు, క్షేత్రస్థాయి నెట్‌వర్క్ ఆయనకు కొట్టినపిండి. కొత్త పార్టీ వేదిక ద్వారా వైఎస్సార్‌సీపీలోని అసంతృప్త నేతలను, ద్వితీయ శ్రేణి కేడర్‌ను తనవైపు తిప్పుకుని జగన్ ఓటు బ్యాంకును చీల్చగలనని బ్లాక్‌మెయిల్ చేసే ఎత్తుగడ కూడా ఇందులో దాగి ఉండవచ్చని పార్టీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.ఒక ప్రాంతీయ పార్టీని స్థాపించి క్షేత్రస్థాయిలో నిలబెట్టడం అనేది సాధారణ వ్యవహారం కాదు. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడానికో లేక బేరసారాల కోసమో పెట్టిన పార్టీలు కాలగర్భంలో కలిసిపోయిన చరిత్ర ఏపీలో ఎన్నో ఉన్నాయి. విజయసాయిరెడ్డి వేస్తున్న ఈ పాచికల వెనుక ఉన్న అసలు లక్ష్యం --- కేసుల నుంచి ఆత్మరక్షణ కోసమా, బీజేపీ రాజకీయ ప్రయోగమా లేక జగన్‌పై ప్రతీకారమా అన్నది ఆయన పార్టీ అధికారిక ప్రకటన చేసి మొదటి అడుగు వేసిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

# ఉనికి' కోసమే జగన్ ఆరాటం !

**విజయవాడ, ఆగస్టు 21 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిలో ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. తాడేపల్లి ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న వరుస నియోజకవర్గాల సమీక్షా సమావేశాల్లో కేడర్‌నుద్దేశించి ఆయన చేస్తున్న ప్రసంగాలు దీనిని స్పష్టం చేస్తున్నాయి. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి పంచాయతీ, వార్డులో తప్పనిసరిగా నామినేషన్లు వేసి తీరాలని ఆయన పార్టీ శ్రేణులను ఆదేశిస్తున్న తీరు.. పార్టీ బలమైన స్థితిలో ఉండి ఇచ్చే పిలుపులా కాకుండా, కనీస రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పడుతున్న తాపత్రయంలా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ ఒత్తిడి వెనుక బలమైన రాజకీయ భయం దాగి ఉంది. ఒకవేళ స్థానిక ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నిలబడకపోతే, క్షేత్రస్థాయిలో కేడర్ పూర్తిగా నిర్లిప్తతలోకి జారిపోయిందన్న స్పష్టమైన సంకేతం ప్రజల్లోకి వెళ్తుంది. అసెంబ్లీలో 11 సీట్లకు పరిమితమైన తర్వాత, పార్టీ ఇంకా సజీవంగానే ఉందని నిరూపించుకోవడానికి చేపట్టే పర్యటనలు, రోడ్‌షోలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలు అన్నీ ఒక్కసారిగా తేలిపోతాయి. ఎన్నికల్లో పోటీ లేకపోవడం వల్ల ప్రత్యర్థి పక్షాలకు ఏకగ్రీవాలు దక్కితే, అది పార్టీ నైతిక స్థైర్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందనే భయంతోనే ఓడిపోయినా పర్వాలేదు.. బరిలో నిలబడండి అనే నినాదాన్ని ఆయన ముందుకు తెస్తున్నారు.అయితే క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల మానసిక స్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఐదేళ్ల అధికార కాలంలో సంక్షేమ పథకాల బటన్ల పంపిణీకి ఇచ్చిన ప్రాధాన్యత పార్టీకి అండగా నిలిచిన ద్వితీయ శ్రేణి నాయకులకు, సాధారణ కార్యకర్తలకు దక్కలేదనే అసంతృప్తి వారిలో బలంగా ఉంది. పాలనా వ్యవహారాల్లో అక్రమాలు, దందాల ఆరోపణలు ఎదుర్కొన్న పెద్దలు ఇప్పుడు సురక్షితంగా ఇళ్లకే పరిమితం కాగా, క్షేత్రస్థాయిలో ప్రత్యర్థుల నుంచి వచ్చే రాజకీయ ఒత్తిళ్లను, కేసులను తామే భరించాల్సి వస్తోందని కేడర్ ఆందోళన చెందుతోంది. గతంలో పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు రాకపోవడం, కొత్తగా సొంత జేబుల నుంచి లక్షలు ఖర్చుపెట్టి పోటీ చేసే ఆర్థిక స్తోమత లేకపోవడం కేడర్‌ను వెనుకడుగు వేసేలా చేస్తోంది.గ్రామస్థాయిలో ప్రత్యర్థులతో ఘర్షణ పడి ఆస్తులు, వ్యాపారాలను నష్టపోవడం కన్నా.. స్థానికంగా సర్దుబాటు రాజకీయాలు చేసుకోవడం లేదా మౌనంగా ఉండటమే మేలనే భావన వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో పెరుగుతోంది. క్షేత్రస్థాయిలో నాయకత్వం నుంచి ఎలాంటి రక్షణ భరోసా లభించనప్పుడు, కేవలం పార్టీ పరువు కాపాడటం కోసం తాము బలిపశువులం కాలేమనే చర్చ గ్రామాల్లో జరుగుతోంది. కార్యకర్తల్లోని ఈ నైరాశ్యాన్ని గుర్తించినందువల్లే జగన్ వారిని ప్రత్యేకంగా పిలిపించి బతిమాలుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అగ్రనాయకత్వం తన ఉనికిని చాటుకోవడానికి చూస్తున్న ఈ ప్రయత్నాలు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా ఉన్నాయి

**ఏకగ్రీవం అనుకోవద్దు..**

స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేలా ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి రంగంలోకి దిగారు. రాష్ట్రంలో అన్ని స్థానాలకు పోటీచేయాలని, ఏ ఒక్క స్థానం ఏకగ్రీవం కాకూడదని ఇప్పటికే నియోజకవర్గ ఇంచార్జులకు ఆదేశాలిచ్చిన జగన్ రెడ్డి తాజాగా రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. కొద్దిరోజుల్లో నిర్వహించే స్థానిక ఎన్నికల్లో విజయం కోసం వెన్నుపోటు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు పోలీసులను ప్రయోగిస్తారని, వారిని ఎదుర్కొని యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారుప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని భావిస్తున్న ఆయన పార్టీ కేడర్ యుద్ధానికి సిద్ధంగా ఉండాలని పిలుపునివ్వడం ద్వారా ఎన్నికల్లో రాజీ లేని పోరాటం చేస్తామని సంకేతాలు పంపుతున్నారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా, ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని, ఈ కారణంగా స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీకి ఓటేస్తారని జగన్ రెడ్డి భావిస్తున్నట్లు చెబుతున్నారు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై జగన్ సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలను సవాలుగా తీసుకోవాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను, ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో గతంలో తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. “పార్టీకి కార్యకర్తలే వెన్నెముక. రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలి. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి” అని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి, యుద్ధప్రాతిపదికన ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన దిశానిర్దేశం చేశారు.ఏడాదిలో పాదయాత్ర రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మరోసారి తన పాదయాత్రపై ప్రకటన చేశారు. ఏడాది తర్వాత తాను పాదయాత్ర చేస్తానని, ఎన్నికల వరకు ప్రజల్లోనే ఉంటానని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత వైసీపీనే అధికారంలోకి వస్తుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉందని, అయితే స్థానిక ఎన్నికల్లో అది కనిపించకుండా ఉండేందుకు పోలీసులను వాడుకుంటారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# అసెంబ్లీ బహిష్కరణ మైలేజ్.. డ్యామేజా...

**విజయవాడ, ఆగస్టు 21 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీసుకున్న తాజా నిర్ణయం మరోసారి చర్చకు దారితీసింది. రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు పార్టీ ఎమ్మెల్యేలు హాజరు కాకూడదని నిర్ణయించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల తర్వాత సభలో తమకు దక్కాల్సిన ప్రతిపక్ష హోదా విషయంలో న్యాయం జరగలేదన్నది వైసీపీ ప్రధాన వాదనగా ఉంది. ఈ అంశాన్నే కేంద్రంగా చేసుకుని అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండాలని పార్టీ నిర్ణయించింది.2024 ఎన్నికల్లో వైసీపీకి 11 అసెంబ్లీ స్థానాలు మాత్రమే దక్కాయి. కూటమి పార్టీలైన తెలుగుదేశం పార్టీ , జనసేన , బీజేపీ కలిసి భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దీంతో శాసనసభలో వైసీపీ సంఖ్యాబలం గణనీయంగా తగ్గిపోయింది. ఎన్నికల ఫలితాల తర్వాత నుంచే ప్రతిపక్ష హోదా అంశం ఆ పార్టీ రాజకీయ చర్చలో కీలకంగా మారింది.వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభలో తమ పార్టీకి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని పలుమార్లు ఆరోపించారు. మరోవైపు ప్రభుత్వం, కూటమి నేతలు మాత్రం ప్రతిపక్ష హోదాకు సంబంధించిన నిబంధనలు, సభలో పార్టీ బలాన్ని ప్రస్తావిస్తూ వైసీపీ వాదనను అంగీకరించడం లేదు. దీంతో రెండు వైపులా రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి.అయితే అసెంబ్లీకి వెళ్లకుండా ఉండటం వల్ల వైసీపీకి రాజకీయంగా ఎంత మేరకు ప్రయోజనం కలుగుతుందన్నది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాసనసభ ఒక ముఖ్యమైన వేదిక. నిరుద్యోగం, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ధరల పెరుగుదల, అభివృద్ధి కార్యక్రమాలు వంటి అంశాలపై అధికార పక్షాన్ని ప్రశ్నించే అవకాశం ప్రతిపక్ష సభ్యులకు ఉంటుంది. అలాంటి అవకాశాన్ని స్వయంగా వదులుకోవడం వల్ల పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.మరోవైపు వైసీపీ తన రాజకీయ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. అసెంబ్లీకి గైర్హాజరైనప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తల ద్వారా ప్రభుత్వ నిర్ణయాలను విమర్శించడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం కొనసాగించవచ్చు. సోషల్ మీడియా, బహిరంగ కార్యక్రమాలు, పార్టీ సమావేశాలను ఇందుకు ఉపయోగించుకునే అవకాశం ఉందిశాసనమండలిలో మాత్రం వైసీపీకి కొంత బలం ఉండటంతో అక్కడి వేదికను ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒకవైపు అసెంబ్లీకి దూరంగా ఉంటూ, మరోవైపు మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయడం అనే ద్వంద్వ వ్యూహం ఆసక్తిని కలిగిస్తోంది.ఇక వరుసగా సభకు గైర్హాజరైతే సభ్యుల హాజరుకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలు కూడా ప్రస్తావనకు వస్తున్నాయి. అయితే గైర్హాజరుపై అనుమతులు, సభా విధానాలు వంటి అంశాలు కూడా ఇందులో కీలకంగా ఉంటాయి. కాబట్టి కేవలం గైర్హాజరు ఆధారంగా సభ్యత్వంపై తక్షణ నిర్ణయం వస్తుందని భావించడం సరికాదు.మొత్తానికి వైసీపీ అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయం ఆ పార్టీ రాజకీయ వ్యూహానికి పరీక్షగా మారింది. ప్రతిపక్ష హోదా అంశాన్ని ప్రజల్లోకి ఎంత బలంగా తీసుకెళ్తుంది, అసెంబ్లీకి దూరంగా ఉండటం వల్ల రాజకీయంగా లాభమా నష్టమా అన్నది కాలమే తేల్చనుంది. ప్రజా సమస్యలపై పోరాటానికి సభా వేదికను ఎంచుకుంటుందా, లేక బయట నుంచే ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తుందా అనేది రాబోయే రోజుల్లో ఆసక్తికరంగా మారనుంది.

**వైసీపీ రికార్డు**

చట్ట సభలే ప్రజాస్వామ్య వేదికలు. అక్కడ అన్ని పక్షాలు కలిసి ప్రజా సమస్యల మీద చర్చిస్తాయి. అలాంటి వేదికలను బహిష్కరించడం అన్నది తొలి తరంలో జరిగేది కాదు, అసలు వాకౌట్లు కూడా అప్పట్లో తక్కువగా ఉండేవి. అయితే రాను రానూ రాజకీయం పెరిగి సభలకే దుమ్మా కొడుతున్నారు. ఇక దేశంలో శాసనసభ మొత్తాన్ని లేదా సమావేశాలను ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీ పూర్తిగా బహిష్కరించడం అనేది ఎక్కడా లేదని అంటున్నారు. అదే సమయంలో ఇది రాష్ట్రాల వారీగా అక్కడి రాజకీయ పరిస్థితులు అధికార ప్రతిపక్షాల మధ్య వివాదాలు లేదా సభలో తమకు సముచిత గౌరవం దక్కలేదనే కారణాలపై ఈ బహిష్కరణలు ఆధారపడి ఉంటాయి. మరో వైపు చూస్తే భారతదేశంలో అసెంబ్లీలను బహిష్కరించే పార్టీలు ఉన్నా పాక్షికంగా పరిమితంగా జరిగిన సందర్భాలు ఉన్నాయని అంటున్నారు. కొన్ని సందర్భాలలో ప్రతిపక్ష పార్టీలు నిరసనగా సభలకు దూరంగా ఉంటూ వచ్చిన నేపథ్యం ఉంది. అయితే ఒక ప్రధాన ప్రతిపక్ష పార్టీ మొత్తం అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటాన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతారాహిత్యంగా అధికార పార్టీలు విమర్శిస్తుంటాయి. సభలో చర్చల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, బహిష్కరణలు సరైనవి కాదని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతుంటారు. ఏపీలో చూస్తే మూడు సందర్భాలలో ముగ్గురు నాయకులు అసెంబ్లీ బహిష్కరణ పిలుపు ఇచ్చారు. వారే ఎన్టీఆర్, జగన్ చంద్రబాబుగా చెప్పాలి మూడున్నర దశాబ్దాల క్రితం చూస్తే ఎన్టీఆర్ 1989లో విపక్షంలో ఉన్నారు. అయితే ఆయన పార్టీకి చెందిన వారు అంతా సభకు హాజరయ్యారు. అప్పట్లో ఉప నాయకులుగా చంద్రబాబు ఇతర నేతలు కలసి టీడీపీని అసెంబ్లీలో నడిపించారు. ఇక జగన్ అయితే 2017లో అసెంబ్లీకి రావడం లేదని ఒక దండం పెట్టి మరీ జనంలోకి పాదయాత్ర కోసం వెళ్ళారు. అయితే జగన్ అప్పటికి మూడేళ్ళ పాటు అసెంబ్లీకి హాజరయ్యేవారు. చంద్రబాబు విషయం తీసుకుంటే ఆయన 2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో సభలో తనకు అవమానం జరిగిందంటూ చంద్రబాబు అసెంబ్లీని బహిష్కరించి మళ్లీ అధికారంలోకి వస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేసి వెలువడిన సందర్భాన్ని రాజకీయ ప్రత్యర్థులు ప్రస్తావిస్తుంటారు ఇక అసెంబ్లీలను బహిష్కరించడం అన్న దానికి బీజం తమిళనాడులో జయలలిత హయాంలో పడింది అని చెప్పాల్సి ఉంటుంది. 1989 మార్చి 25న తమిళనాడు అసెంబ్లీలో జరిగిన ఘోర అవమానం కారణంగా ప్రతిపక్ష నేతగా ఉన్న జయలలిత సభను బహిష్కరించారు. డీఎంకే సభ్యుల దాడిలో అవమానానికి గురైన ఆమెమళ్ళీ ముఖ్యమంత్రిగా అడుగుపెడతాను అని భీష్మ ప్రతిజ్ఞ చేసి సభను వీడారు. ఈ సంఘటన ఆమె రాజకీయ జీవితంలో ఒక కీలక మలుపుగా నిలిచింది. ప్రజల్లో ఆమెకు సానుభూతి పెరిగింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత 1991 ఎన్నికల్లో అఖండ విజయం సాధించి, తాను అనుకున్నట్టుగానే తమిళనాడు తొలి మహిళా పూర్తికాల ముఖ్యమంత్రిగా ఘనంగా అసెంబ్లీలో అడుగుపెట్టారు అయితే వైసీపీ మాత్రం 2024లో కొత్త అసెంబ్లీ ఏర్పాటు అయ్యాక అసెంబ్లీకి వెళ్ళడం మానుకుంది. ఆ పార్టీ తనకు 11 సీట్లు వచ్చినా ప్రధాన ప్రతిపక్ష పాత్ర కోరుతోంది. అయితే రూల్స్ మాత్రం అందుకు ఒప్పుకోవని స్పీకర్ ఆఫీసు చెబుతోంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీకి వైసీపీ దూరంగా ఉంటోంది. ఇప్పటికి 26 నెలలు గడచిపోయినా వైసీపీ అసెంబ్లీ వైపు చూడడం లేదు, దీని మీద ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యంలో అసెంబ్లీని ప్రతిపక్షాలు బహిష్కరించడం సరికాదని అన్నారు. ప్రజా సమస్యలపై సభలోనే తేల్చుకోవాలని ఆయన అన్నారు. వైసీపీ తీరును తప్పుపడుతూ తన రాజకీయ జీవితం మొత్తంలో ఇలాంటివి చూడలేదని అన్నారు. దేశంలో కూడా ఈ రకమైన పరిణామాలు ఎక్కడైనా జరిగాయో లేవో కానీ ఈ విషయంలో వైసీపీది కొత్త రికార్డు అని ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు.

# ప్రకాశంలో ఫ్యాన్ రెక్కలు కకావికలం

**ఒంగోలు, ఆగస్టు 21 పెన్ పవర్:** రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయాయి. 2024 ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 8నియోజకవర్గాల్లో 6 స్థానల్లో టీడీపీ కూటమి విజయం సాధించింది. అప్పటివరకు అధికారంలో వున్న వైసీపీ కేవలం రెండు చోట్ల మాత్రమే అతి కష్టం మీద గెలిచింది. ఒంగోలు పార్లమెంట్ స్థానంలో కూడా టీడీపీ జెండా ఎగరేసింది. ఇది అందరికీ తెలిసిందే. ఈ రెండేళ్ల కాలంలో టీడీపీ బలం ఏమాత్రం తగ్గిన దాఖలాలు లేవు. వైసీపీ పుంజుకున్న ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. ఇంకా చెప్పాలంటే ఘోర ఓటమి నుంచి వైసీపీ ఇంకా కోలుకోలేదు. జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో ఆ పార్టీకి నాయకత్వం లేకుండా పోయిన పరిస్థితి కనిపిస్తుంది. ఒంగోలు పార్లమెంట్ కు కనీసం ఇంచార్జిని కూడా నియమించుకోలేని దీనస్థితిలో కొట్టు మిట్టాడుతోంది. గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నాలుగు రోజులు హడావుడి చేసినప్పటికి ఇప్పుడు ఇటు వైపు తొంగిచూడటం లేదు. ఈసారి ఎన్నికల్లో కొత్తగా అభ్యర్థిని వెదుక్కోవాల్సిన దుస్థితి వుంది. ఇక ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి వెళ్లిపోయాక కార్యకర్తలు ఉక్కపోతతో అల్లాడి పోతున్నారు. చుండూరి రవిబాబు ఇంచార్జిగా పనిచేస్తున్నప్పటికీ పార్టీ శ్రేణులకు నమ్మకం కలిగించలేక పోతున్నాడు. కొండపి నియోజకవర్గంలో మరో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఇష్టం లేని కాపురం చేస్తున్నారు. మాటి మాటికీ పాత ఇంటి వైపు తొంగి చూస్తున్నారు. గిద్దలూరులో కుందూరు నాగార్జున రెడ్డి పరిస్థితి కూడా అంతే. ఆయనకు మార్కాపురం మీదనే మనసుంది.గిద్దలూరులో పోటీ చేస్తే గెలిచే అవకాశం ఉన్నప్పటికీ అన్నా రాంబాబు మార్కాపురం వదిలి పెట్టనని మంకు పట్టు పడుతున్నారు. ఎర్రగొండపాలెంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కు ఆదిమూలపు సురేష్ తలనొప్పిగా తయారయ్యాడు. దర్శిలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివ ప్రసాద్ కు పార్టీలో సమస్య లేదు కానీ టీడీపీ ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మి నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. కనిగిరిలో దద్దాల నారాయణను బలవంతంగా కొనసాగిస్తున్నారని పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నారు. ఇకపోతే అద్దంకి నియోజకవర్గం వైసీపీకీ మింగుడు పడటం లేదు. 2019లో కూడా అక్కడ గొట్టిపాటి రవికుమార్ టీడీపీ జెండా ఎగరేశారు. ఇప్పుడు మంత్రిగా మరింత పట్టు సాధించారు. ఇక్కడ వైసీపీకి సీజన్ కు ఒకరు చొప్పున ఇంచార్జిలు మారుతున్నారు. ప్రస్తుతం అశోక్ కుమార్ ఇంచార్జిగా వున్నారు. ఈయన కొనసాగుతారో, కొత్త ఇంచార్జి వస్తాడో కేడర్ కు తెలియదు. కొండపిలో కూడా వైసీపీకి ఒక ఇంచార్జి లేదు. పార్ట్ టైమ్ లీడర్ గా సురేష్ వ్యవహరిస్తున్నట్లు కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. ఒంగోలు ఎంపీ సీటు ఖాళీగా వుంది. ఇలాంటి పరిస్థితిలో పార్టీ ఎప్పటికి కోలుకుంటుందో ఏమో అని వైసీపీ శ్రేణులు గొనుక్కుంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## కాంగ్రెస్ జెండా కప్పుకొని.. జాతీయ జెండా అంటున్నారు: జంపింగులపై తీర్పు రిజర్వ్




తెలంగాణ రాజకీయాల్లో గత రెండు సంవత్సరాలుగా చర్చనీయాంశంగా మారిన జంపింగ్ ఎమ్మెల్యేల వ్యవహారంపై హైకోర్టు విచారణను ముగించింది. ఈ కేసుకు సంబంధించిన తీర్పును సెప్టెంబరు 19న వెలువరించనున్నట్టు తెలిపింది. అయితే.. విచారణ సందర్భంగా బీఆర్ ఎస్ తరఫు న్యాయవాది చేసిన వ్యాఖ్యలను కోర్టు సీరియస్‌గా తీసుకుంది. తమ పార్టీ తరఫున గెలిచి.. కాంగ్రెస్‌లో చేరిన వారు.. వితండ వాదం చేస్తున్నారని ఆయన కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు.దీంతో సదరు వాదనను, దీనికి సంబంధించి మీడియాలో వచ్చిన వార్తలను కూడా పరిశీలిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. 2023 ఎన్నికల్లో బీఆర్ ఎస్ తరఫున విజయం దక్కించుకున్న వారిలో 10 మంది ఎమ్మెల్యేలు.. తర్వాత కాలంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు పలికారు. దీనిపై బీఆర్ఎస్ అప్పటి నుంచి న్యాయ పోరాటంతో పాటు అసెంబ్లీలోనూ నిలదీస్తోంది. సుప్రీంకోర్టు గడప కూడా తొక్కిన ఈ కేసులో స్పీకర్ సదరు ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చారు. సుదీర్ఘకాలం పాటు సాగిన ఈ విచారణ అనేక మలుపులు తిరిగింది. -అభివృద్ధి- కోసమే తాము కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నామని.. బీఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని.. ఈ ఎమ్మెల్యేలు అనేక సందర్భాల్లో చెప్పారు. తాజాగా కోర్టుకు కూడా ఇదే విన్నవించారు. అయితే.. వీరు కాంగ్రెస్ జెండా కప్పుకోవడం, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. ఏకంగా పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయడం వంటివి వారిని ఇరికించేశాయి.ఈ విషయాలనే బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టులో వివరించారు. "కాంగ్రెస్ పార్టీ జెండా కప్పుకొని.. ఆ పార్టీలో చేరారు. అదేమని అడిగితే దానిని జాతీయ జెండాగా చెబుతున్నారు. కానీ, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుంది. కాంగ్రెస్ జెండాలో అది ఉండదు. ఇక, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం.. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై పోటీ చేశారు. పార్టీ సభ్యత్వం లేకుండా ఎంపీటికెట్ ఇచ్చే పరిస్థితి లేదు. కాబట్టి.. ఈ పరిణామాలను పరిగణనలోకి తీసుకోవాలి" అని కోర్టును అభ్యర్థించారు. కాగా.. దీనిపై తీర్పును సెప్టెంబరు 19కి వాయిదా వేసింది.

## మోడీ జెన్ జీ జపం పీక్స్ లోనే !



ప్రధాని నరేంద్ర మోడీ ప్రస్తుతం మౌనంగా కనిపిస్తున్నారు. ఆయన ప్రకటనలు ప్రసంగాలు పర్యటనలు గడచిన కొద్ది రోజులుగా ఎక్కడా కనిపించడం లేదు. ఆయన సైలెంట్ వెనక వ్యూహాత్మకమైన ప్రణాళిక ఉందని అంటున్నారు. ఇదిలా ఉంటే మోడీ అపర చాణక్యుడు అని చెబుతారు. ఆయన రాజకీయ జీవితంలో ఓటమి లేదు. ఏదైనా చిన్న కుదుపు ఎక్కడైనా సంభవిస్తే మళ్ళీ సర్దుకుని జెట్ స్పీడ్ తో ముందుకు సాగిపోయే నైపుణ్యం నైజం మోడీ సొంతం. అందుకే ఇపుడు మోడీ ఆ దిశగానే ఆలోచనలు చేస్తున్నారు అని అంటున్నారు. జంతర్ మంతర్ వద్ద జెన్ జీ తరం అంతా నిరసనలు చేపట్టి కేంద్ర మంత్రి చేత ఓవర్ నైట్ రాజీనామా చేయించడం అన్నది అంత ఈజీగా మరచిపోయేది కాదు, పైగా దేశంలో ఇపుడు జెన్ జీ తరం అసహనం సణుగుడు గొణుగుడు బీజేపీ పెద్దలు పెద్ద చెవులు పెట్టుకుని రిక్కించి మరీ వింటున్నారు అని అంటున్నారు.

**కేబినెట్ కార్యదర్శులకు కూడా :**

ఇదిలా ఉంటే ప్రధాని నరేంద్ర మోడీ తాజాగా తన కేబినెట్ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశం జెన్ జీ గురించి ప్రస్తావించారని అంటున్నారు. యువతను ఆకట్టుకోవాలని వారితో మమేకం కావాలని మోడీ వారికి దిశా నిర్దేశం చేశారు అని అంటున్నారు. పాలనా విధానాలలో కొత్త ఆలోచనలను తెచ్చేందుకు యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారని తెలుస్తోంది. ప్రభుత్వ శాఖలు విశ్వవిద్యాలయాలు యువత మధ్య సత్సంబంధాలు పెరగాలని మోదీ కోరడం విశేషం. యువతతో విస్తృత చర్చల ద్వారా వినూత్నమైన ఆలోచనలు పుట్టుకొస్తాయని నరేంద్ర మోడీ అభిప్రాయపడుతున్నారు. అంతే కాకుండా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు డిజిటల్ కంటెంట్ ద్వారా ఈనాటి యువత ఆలోచనలను అర్థం చేసుకొని వారితో కనెక్ట్ కావాలని కూడా మోడీ అత్యున్నత అధికారులకు సూచించారు.

**మంత్రులకూ ఇదే మాట :**

అంతకు ముందు మోడీ మంత్రి వర్గ సమావేశం నిర్వహించిన సందర్భంలో మంత్రులకు కూడా ఇవే విషయం మీద హిత బోధ చేశారు. కేంద్ర మంత్రులతో నిర్వహించిన సమావేశాల్లో జెన్ జీ యువతతో మమేకం కావాలని విశ్వవిద్యాలయాలతో సంబంధాలను పెంచుకోవాలని దిశానిర్దేశం చేశారు. అంతే కాదు సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగించాలని ఇన్స్టా గ్రాం లో కూడా కనిపించాలని రీల్స్ వీడియో బైట్స్ వంటివి పోస్టులు చేయాలని కోరారు. ఒక విధంగా మోడీ తాజా పరిణామాల నుంచి ఎంతో నేర్చుకోవాలని ఆశిస్తున్నారు. తాను కూడా యువతతో నేరుగా కనెక్ట్ కావాలని అనుకుంటున్నారు. విశ్వ విద్యాలయాలతో అనుసంధానం అయినపుడు కొత్త తరం యువత మనో భావాలు ఏమిటి అన్నవి కచ్చితంగా తెలుస్తాయని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు.

**మౌనం వెనక వ్యూహం :**

మోడీ ఇటీవల మౌనంగా ఉంటున్నారు. ఎక్కువగా మాట్లాడడం లేదు అంటే ఆ మౌనం వెనక వ్యూహాలు ఉన్నాయనే అంటున్నారు. పూర్తిగా యువతరంతో బీజేపీ జాతీయ కార్యవర్గాన్ని నింపిన మోడీ మంత్రి వర్గంలోనూ కొత్త ముఖాలకు చాన్స్ ఇస్తారని అంటున్నారు. అలాగే యువతకు ప్రాధాన్యత దక్కుతుందని కూడా అంటున్నారు. రానున్న కాలంలో బీజేపీ యువ సమ్మేళనాలూ విశ్వ విద్యాలయాల సందర్శనలు యూత్ తో చిట్ చాట్ బాతాఖానీ వంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందని అంటున్నారు. మొత్తం మీద జెన్ జీ పోరాటలు నిరసనలు ట్రెడిషనల్ పార్టీలలో మౌలికమైన మార్పులకు కారణం అవుతున్నాయి. మరి రానున్న కాలంలో రాజకీయాల్లో యువత పాత్ర వారి గొంతుక పెద్దదిగా కనిపిస్తుందా వినిపిస్తుందా అంటే వేచి చూడాల్సిందే మరి.

# సోషల్ మీడియానే సాయం చేయాలి.. సాదిక్ ఖాన్ కోసం పోలీసుల వినూత్న ప్రచారం

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పిఠాపురం పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు సంబంధించి ప్రధాన నిందితుడు సాదిక్ ఖాన్ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే విషయం తెలుసుకుని పరారైన నిందితుడు తన ఆచూకీ చిక్కకుండా తిరుగుతున్నాడని పోలీసులు చెబుతున్నారు. ఈ నెల 16న ఏఈ కుటుంబం ఆత్మహత్య చేసుకోగా, నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. చివరకు నిందితుడి ఆచూకీ తెలిస్తే చెప్పాలంటూ సోషల్ మీడియాలో పోస్టర్లు విడుదల చేశారు. నిందితుడి ఫొటోలను షేర్ చేసిన పోలీసులు, నిందితుడి ఆచూకీ తెలుసుకునేలా విస్తృతంగా షేర్ చేయాలని కొంతమంది ఇన్ఫ్లుయెన్సర్లకు బాధ్యతలు అప్పగించారని చెబుతున్నారు.

**రాష్ట్రం విడిచి పారిపోయాడా?**

ఘటన జరిగి ఐదు రోజులు కావస్తున్నా, నిందితుడు సాదిక్ ఖాన్ ఆచూకీ తెలియడం లేదు. ఆగస్టు 16వ తేదీ రాత్రి నూకరాజు కుటుంబంతో సహా గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. అయితే గోదావరిలో దూకేముందు వారు తమ సూసైడ్ నోటును కొందరు సన్నిహితులకు వాట్సాప్ ద్వారా పంపారని చెబుతున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే నిందితుడు సాదిక్ ఖాన్ ఫోన్ వదిలేసి పరారైనట్లు చెబుతున్నారు. చివరగా ఆయన కర్ణాటకలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందగా, అక్కడి నుంచి తప్పించుకున్నాడని అంటున్నారు. దీంతో సాదిక్ ఖాన్ ఏమయ్యాడు? అతడికి ఎవరెవరు సహకరిస్తున్నారు? డబ్బు కోసం అతడు ఎవరిని సంప్రదిస్తున్నాడనే అంశాలపై నిఘా పెట్టినట్లు చెబుతున్నారు.



**పాస్ పోర్టు స్వాధీనం**

నిందితుడు సాదిక్ ఖాన్ దేశం విడిచి పారిపోకుండా పోలీసులు ముందుజాగ్రత్తలు తీసుకున్నారని చెబుతున్నారు. అతడి ఇంట్లో సోదాలు నిర్వహించి పాస్ పోర్టు స్వాధీనం చేసుకున్నామని ప్రకటించారు. మరోవైపు సాదిక్ ఖాన్ దేశం విడిచి పారిపోకుండా లుక్ అవుట్ సర్కులర్ జారీ చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు అష్టదిగ్బంధనం విధించినట్లు చెబుతున్నారు. ఇంటి నుంచి పారిపోయిన సమయంలో సాదిక్ ఖాన్ వద్ద రూ.15 వేలు మాత్రమే ఉన్నాయని, అవి ఖర్చయిన తర్వాత బయటకు రావడం ఖాయమని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు సాదిక్ ఖాన్ అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకి వస్తున్నాయని స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

**మత చాందసవాసమేనా? ఇంకేమైనా?**

నిందితుడు సాదిక్ ఖాన్ మత చాందసవాదంతో ఏఈ నూకరాజు కుమార్తెను ఇస్లాం ఆచరించాల్సిందిగా ఒత్తిడి చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూకరాజు వియ్యంకుడు భాస్కరరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతోపాటు కాకినాడలోని మృతురాలు సౌజన్య ఇంట్లో లభ్యమైన లేఖల్లోనూ ఈ అంశం ఉందని అంటున్నారు. దీంతో సాదిక్ ఖాన్ ప్రవర్తనపై స్థానికంగా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతడి ప్రవర్తనను తట్టుకోలేక నూకరాజు కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకున్నాడంటే సాదిక్ ఖాన్ ఎంత పైశాచికత్వంతో ప్రవర్తించాడో అర్థమవుతోందని పోలీసులు వ్యాఖ్యానిస్తున్నారు. మత చాందసవాదంతోపాటు మరేదైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కొణతాల సైలెంట్... వైసీపీ వైలెంట్.. !



ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి రాజకీయాలు సైలెంట్ అయ్యాయి. రాజకీయాలంటే ప్రత్యర్థులపై విమర్శలు చేసుకోవడం.. ఎప్పుడూ హాట్ టాపిక్‌గా వ్యవహరించడం కాకపోయినా.. కనీసం నియోజక వర్గంలో దూకుడు అయినా కనిపించాలి. అయితే.. అనకాపల్లిలో ఈ తరహా పరిస్థితి కనిపించడం లేదన్నది వాస్తవం. ఆది నుంచి సౌమ్యుడిగా పేరున్న కొణతాల రామకృష్ణ గత ఎన్నికల్లో జనసేన తరఫున విజయం సాధించారు. ఇప్పుడు కూడా ఆయన సైలెంట్‌గానే ఉంటున్నారు.అయితే.. రాజకీయ విమర్శలు లేకపోయినా.. ప్రత్యర్థులపై విరుచుకుపడకపోయినా.. నియోజకవర్గంపై పట్టు సాధించడంలో కొణతాలకు తిరుగులేదు. గతంలో ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం రామకృష్ణకు కలిసి వస్తోంది. దీంతో అభివృద్ధి విషయంలో కొంత మేరకు ముందుకు సాగుతున్నారు. దీంతో వైసీపీకి పరోక్షంగానే ఆయన చెక్ పెడుతున్నారు. పైకి ఎలాంటి అరుపులు, కేకలు, హెచ్చరికలు ఉండవు. కానీ.. క్షేత్రస్థాయిలో ప్రచారం మాత్రం భిన్నంగా ఉంటోంది.వైసీపీకి అవకాశం ఇవ్వని రీతిలో కొణతాల వ్యవహరిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండడంలోనూ ఆయన భిన్నమైన వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. నేరుగా తానే ఎక్కడ సమస్య ఉంటే అక్కడకు వెల్తున్నారు. సుదీర్ఘకాలంగా ఇక్కడి బెల్లం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించారు. మద్దతు ధరలు వచ్చేలా చూస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్‌ను విస్తరించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదేసమయంంలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారిని ఎంపిక చేశారు.

సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇస్తే చాలు.. వీరికి పింఛన్లు మంజూరు కానున్నాయి. ఇక, పార్టీ పరంగా కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు. వారి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు.

ముఖ్యంగా స్థానిక ఎన్నికల్లో పట్టుకోసం ప్రయత్నం చేస్తున్న కొణతాల తన వర్గాన్ని ఎప్పటికప్పుడు కాపాడుకుంటున్నారు. ఈ పరిణామాలు.. వైసీపీని డిఫెన్స్‌లో పడేశాయి. ఇక, ఇక్కడ వైసీపీలో టికెట్ పోరు కూడా ఎక్కువగానే ఉంది. వచ్చే ఎన్నికల్లో తానే పోటీ చేస్తానని మాజీ మంత్రి అమర్నాథ్ ప్రకటించుకున్నారు. దీనిని సొంత పార్టీ నాయకులు విభేదిస్తున్నారు. సో.. మొత్తంగా కొణతాల సైలెంట్ పాలిటిక్స్ వైసీపీలో పెరుగుతున్న విభేదాలు.. వంటివి అనకాపల్లిలో ఆసక్తిగా మారాయి.

# రేవంత్ అమెరికా పర్యటన ఎందుకు ఆగిపోయింది? కేంద్రం చెప్పిన కారణమేంటి?

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన విదేశీ పర్యటనలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రానికి భారీగా విదేశీ పెట్టుబడులు తీసుకురావడం.. అంతర్జాతీయ సంస్థలు, విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాలు పెంచుకోవడమే లక్ష్యంగా లండన్, అమెరికా పర్యటనలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అయితే లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్ర విదేశాంగ శాఖ.. అమెరికా పర్యటనకు మాత్రం పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వలేదు. దీంతో అమెరికా షెడ్యూల్‌ను రేవంత్ రెడ్డి రద్దు చేసుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కావాల్సి వచ్చింది.

ఈ వ్యవహారంపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రులే కాకుండా ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలను కూడా విదేశాంగ శాఖ సమీక్షిస్తుందని తెలిపారు. ప్రతిపాదిత పర్యటన కార్యక్రమాలు సదరు వ్యక్తి పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాల్సి ఉంటుందని.. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణాలకు అనుగుణంగా షెడ్యూల్ లేదని చెప్పారు. అందుకే అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వలేదని.. అయితే బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇచ్చామని స్పష్టం చేశారు.

**అమెరికా షెడ్యూల్‌లో రాజకీయ కార్యక్రమం**

రేవంత్ రెడ్డి అమెరికాలో హార్వర్డ్, ఎంఐటీ, వర్జీనియా టెక్ వంటి ప్రముఖ విద్యా సంస్థలను సందర్శించాల్సి ఉంది. పెట్టుబడులు, విద్యా రంగంలో భాగస్వామ్యాలు, తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చలు జరపాలని ప్రభుత్వం భావించింది. అయితే న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించనున్న మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం కూడా ఆయన షెడ్యూల్‌లో ఉంది.ఇదే అంశం రాజకీయంగా కీలకంగా మారినట్లు చర్చ జరుగుతోంది. అధికారిక పెట్టుబడుల పర్యటనతో పాటు రాజకీయ స్వభావం ఉన్న కార్యక్రమం ఉండటంపై కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసినట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి. అయితే కేంద్రం మాత్రం రేవంత్ పర్యటనను రాజకీయ కారణాలతో అడ్డుకున్నామని స్పష్టంగా చెప్పలేదు. ప్రతిపాదిత కార్యక్రమం ఆయన పదవికి, పర్యటన ఉద్దేశానికి తగినట్లుగా లేదన్నదే విదేశాంగ శాఖ అధికారిక వివరణ ఇచ్చింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ప్రతినిధి రణదీర్ జైస్వాల్ ప్రకటన చేశారు..

**సీఎంల విదేశీ పర్యటనలకు కేంద్ర అనుమతి ఎందుకు?**

భారత రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ ప్రకారం విదేశీ వ్యవహారాలు కేంద్ర జాబితాలో ఉన్నాయి. విదేశీ ప్రభుత్వాలతో సంబంధాలు, దౌత్య వ్యవహారాలు, అంతర్జాతీయ ఒప్పందాలు వంటి అంశాలు కేంద్ర పరిధిలో ఉంటాయి. అందువల్ల



ముఖ్యమంత్రులు, మంత్రులు అధికారిక హోదాలో విదేశాలకు వెళ్లేటప్పుడు కేంద్ర ప్రభుత్వ నిర్దేశించిన విధానాల ప్రకారం ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.

ముఖ్యంగా విదేశాంగ శాఖ నుంచి పొలిటికల్ క్లియరెన్స్ కీలకం. పర్యటనలో పాల్గొనే సంస్థలు, సమావేశాలు, ఆహ్వానించిన వ్యక్తులు, కార్యక్రమాల స్వభావం తదితర అంశాలను కేంద్రం పరిశీలిస్తుంది. అవసరాన్ని బట్టి ఇతర కేంద్ర శాఖల నుంచి కూడా అనుమతులు, సమాచారం లేదా క్లియరెన్స్ అవసరం కావచ్చు.

**కేంద్రం ఎప్పుడు అనుమతి నిరాకరిస్తుంది?**

విదేశీ పర్యటన వల్ల దేశ విదేశాంగ విధానానికి విరుద్ధమైన పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని కేంద్రం భావించినప్పుడు అనుమతి నిరాకరించవచ్చు. విదేశీ సంస్థల నేపథ్యం, కార్యక్రమాల స్వభావం, భద్రతాపరమైన అంశాలు, అంతర్జాతీయ పరిస్థితులు, పర్యటన ఉద్దేశం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.అదేవిధంగా అధికారిక పర్యటన పేరుతో విదేశాల్లో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడం లేదా కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానానికి భిన్నమైన సందేశం వెళ్లే అవకాశం ఉందని భావించినా అభ్యంతరం వ్యక్తం చేయవచ్చు.రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విషయంలోనూ న్యూయార్క్‌లోని రాజకీయ కార్యక్రమం కారణంగానే కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసి ఉండొచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై కేంద్రం నుంచి ఇప్పటివరకు స్పష్టమైన రాజకీయ కారణం వెల్లడికాలేదు.

**గతంలోనూ ఇలాంటి ఘటనలు**

విదేశీ పర్యటనలకు కేంద్రం అనుమతి నిరాకరించిన ఘటనలు గతంలోనూ ఉన్నాయి. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు కొన్ని అంతర్జాతీయ సదస్సులకు వెళ్లేందుకు అనుమతి విషయంలో వివాదాలు తలెత్తాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విదేశీ పర్యటనలకు సంబంధించిన కొన్ని సందర్భాల్లోనూ కేంద్రం నుంచి క్లియరెన్స్ లభించలేదు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల పర్యటనల విషయంలోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి.

అందువల్ల రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణ పూర్తిగా కొత్త పరిణామం కాదు. అయితే ఒకవైపు బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. మరోవైపు అమెరికా పర్యటనను తిరస్కరించడం మాత్రం ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీసింది.

**కేంద్ర అనుమతి లేకుండా వెళ్తే?**

కేంద్రం నుంచి అధికారిక క్లియరెన్స్ లేని పర్యటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారిక ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరించడం, విదేశీ ప్రభుత్వాలతో అధికారిక చర్చలు జరపడం వంటి అంశాలు సమస్యాత్మకంగా మారవచ్చు. విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు సాధారణంగా అధికారిక పర్యటనలకు అవసరమైన ప్రోటోకాల్, సమన్వయం, భద్రతా ఏర్పాట్లను కేంద్ర అనుమతుల ఆధారంగానే నిర్వహిస్తాయి. అందుకే అధికారిక పర్యటనకు కేంద్ర అనుమతి లేకపోతే షెడ్యూల్‌ను రద్దు చేయడం లేదా మార్చుకోవడం సాధారణంగా జరుగుతుంది. వ్యక్తిగత హోదాలో విదేశాలకు వెళ్లడం వేరు.. ముఖ్యమంత్రిగా అధికారిక పర్యటన చేయడం వేరు.మొత్తానికి రేవంత్ రెడ్డి అమెరికా టూర్ రద్దు వెనుక అసలు కారణం ఏమిటన్నదానిపై రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రాజకీయ కక్షతోనే కేంద్రం అనుమతి నిరాకరించిందని ఆరోపిస్తుండగా.. కేంద్ర విదేశాంగ శాఖ మాత్రం పర్యటన షెడ్యూల్, దాని ఉద్దేశం, కార్యక్రమాల స్వభావం తమ ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతోనే క్లియరెన్స్ ఇవ్వలేదని చెబుతోంది. దీంతో రేవంత్ అమెరికా పర్యటన రద్దు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరో వివాదానికి కేంద్రబిందువుగా మారింది.

## బలప్రయోగానికి హద్దులు!


న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ పరీక్ష రద్దు కోరుతూ నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని పరిశీలించేందుకు, న్యాయనిపుణులు, మాజీ పోలీసు అధిపతులతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలన్న సుప్రీంకోర్టు నిర్ణయం, చట్టబద్ధ పాలన ఆధిక్యతను నొక్కిచెప్పే శక్తివంతమైన సందేశాన్ని పంపుతున్నదే. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డి సారథి. పంజాబ్-హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రవిశంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి, మాజీ డీజీపీ, మాజీ సీబీఐ డైరెక్టర్ వంటివారు ఇందులో సభ్యులుగా ఉంటారు. జూలై 20న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యత దీనిదే) బాధ్యుడైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో పార్లమెంటు వైపు కదిలిన వందలాది టీనేజ్ విద్యార్థులు కర్కశమైన పోలీసు అణచివేతను ఎదుర్కొన్నారన్నది ప్రపంచం కళ్లప్పగించి చూసిన కఠోర నిజం. యూనిఫాంలో ఉన్నవారు, లేనివారు కూడా, రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కుపై నమ్మకం ఉంచిన అమాయక యువతపై విరుచుకుపడ్డారు. లాఠీలు, బాష్పవాయువు గోళాలను విచక్షణారహితంగా ప్రయోగించినట్టు నివేదికలు, ఫొటోలు స్పష్టం చేస్తున్నాయి. పెల్లెట్ గన్‌లు, ఎలక్ట్రిక్ బాటన్‌లను కూడా ఉపయోగించారన్న ఆరోపణలు ఉండనే ఉన్నాయి. మహిళా నిరసనకారులపై లైంగిక వేధింపుల ఆరోపణలూ వెలుగులోకి వచ్చాయి. ఢిల్లీ పోలీసుల ఈ వ్యవహారం, ముఖ్యంగా అసమ్మతి తెలిపే హక్కుకు సంబంధించి రాజ్యాంగం ఇచ్చిన హామీలను ఉల్లంఘించేదిగా నిలిచింది. దేశ భవిష్యత్తుగా జాతీయ నాయకులే అభివర్ణించే ఈ యువతపై ఇలాంటి బలప్రయోగం జరగడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం!

కమిటీ పరిధి చాలా విస్తృతంగా ఉండటం విశేషం. పెల్లెట్ గన్‌లు, ఎలక్ట్రిక్ బాటన్‌లు, లాఠీచార్జి, బాష్పవాయువు అధిక వినియోగంతోపాటు, మహిళా నిరసనకారులపై హింస, వేధింపులు, పోలీసు నిఘా ఆరోపణలను కూడా ఇది పరిశీలిస్తుంది. గుంపు నియంత్రణ చర్యల 'ప్రొపోర్షనాలిటీ'ని (దామాషా ప్రకారం సముచితత్వాన్ని) అంచనా వేయడంతోపాటు, క్షతగాత్రులకు అందించిన వైద్య సహాయం, పరిహారాన్ని కూడా పరిశీలించనుంది. అదే సమయంలో, పోలీసు సిబ్బందిపై హింస, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసంపై అధికారుల వాదనలను కూడా కమిటీ వింటుంది. ఇది కేవలం ఏకపక్ష విచారణ కాదని, రెండువైపుల వాదనలనూ సమతూకంతో పరిశీలిస్తుందని స్పష్టం చేస్తుంది. సీసీటీవీ, డ్రోన్ ఫుటేజీ, బాడీ-వార్న్ కెమెరా రికార్డింగులు, కమ్యూనికేషన్ లాగ్‌లతో సహా అన్ని సంబంధిత ఆధారాలను భద్రపరచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ విచారణ, సర్వీసు నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై పరిపాలనాపరమైన, క్రమశిక్షణా చర్యలను నిరోధించదని కూడా న్యాయస్థానం స్పష్టం చేయడం గమనార్హం. అంటే, కమిటీ నివేదిక కోసం ఎదురుచూడకుండానే, స్పష్టమైన ఆధారాలున్న కేసుల్లో తక్షణ చర్యలు తీసుకునే వెసులుబాటు ప్రభుత్వానికి ఉంటుంది. "ఎవరు బాధ్యులైనా, దానికి ఎలాంటి సాకూ, సమర్థనా ఉండదు. దీన్ని తీవ్రంగా పరిగణించి, తార్కిక ముగింపుకు తీసుకెళ్లాల్సిందే" అని ప్రధాన న్యాయమూర్తి కోర్టులో వ్యాఖ్యానించడం, గాయపడిన ఎన్నో హృదయాలకు కొండంత ఓదార్పునిచ్చే అంశమే.

జూన్ 20న జంతర్‌మంతర్ వద్ద మొదలై పలు నగరాలకు విస్తరించిన ఈ విద్యార్థి ఉద్యమం, జులై 25న ప్రధాన్ రాజీనామాతో, సీజేపీ మిగతా డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించడంతో ముగిసింది. అయితే, ఉద్యమం ముగిసినా, జులై 20 నాటి పోలీసు దురాగతాల ప్రభావం మాత్రం ఇంకా మిగిలే ఉంది. ఇక్కడ సుప్రీంకోర్టు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జంతర్ మంతర్‌లోకి చొరబడిన 'నేరపూరిత శక్తులు' ఉన్నాయన్న ఢిల్లీ పోలీసుల సాకుతో, నిరసనకారులను వేధించడానికి ప్రభుత్వం న్యాయ ప్రక్రియను ఒక సాధనంగా వాడుకోకుండా చూడటం అత్యంత కీలకం. "పణంగా ఉన్నది విద్యార్థుల జీవితం. దీన్ని మనం పరిగణనలోకి తీసుకోవాలి. వారికి ముందు భవిష్యత్తు ఉంది. ఆర్టికల్ 19 కింద నిరసన తెలిపే హక్కు వారికి ఉంది" అని ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు భరోసానిచ్చేవే. న్యాయస్థానం తన బలమైన వైఖరిని కొనసాగిస్తూ, ఆర్టికల్ 142 కింద తనకున్న అసాధారణ అధికారాలను వినియోగించి, విద్యార్థి నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలి. దీనికి కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే సీజేపీ ప్రతినిధులతో జరిపిన చర్చల్లో, విద్యార్థులను ఏ న్యాయపరమైన చిక్కులనుంచైనా విముక్తి చేసేందుకు ప్రభుత్వం ముందుకు వస్తానని ఇప్పటికే అంగీకరించింది. అదే సమయంలో, అసలైన నేరపూరిత శక్తులను ప్రాసిక్యూట్ చేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉంది. జంతర్‌మంతర్ వద్ద మాత్రమేకాక, మరెక్కడైనా ఇలాంటి అవాంఛనీయ శక్తులు చొరబడి, నేరాలకు పాల్పడి తప్పించుకోకుండా చూడటం ముఖ్యం. అయితే, పోలీసు యూనిఫాంలో ఉన్నవారేకాక, పౌర దుస్తుల్లో లాఠీలు ప్రయోగించినవారి ఉనికిని కూడా ఉన్నతస్థాయి కమిటీ గుర్తించి, వారిని ఎవరు పంపారో నిగ్గుతేల్చాలి. ప్రజాస్వామ్యానికి, అసమ్మతికి ప్రతీకగా జంతర్‌మంతర్‌ను గుర్తుంచుకోవాలంటే, సర్వోన్నత న్యాయస్థానం జోక్యం అందుకు దోహదపడాల్సిందే. బలప్రయోగానికి హద్దులేమిటో నిర్వచించే ఈ విచారణ, భవిష్యత్తులో శాంతియుత నిరసనలను ఎదుర్కొనే పోలీసు వ్యవస్థకు స్పష్టమైన మార్గదర్శకంగా నిలవాలి.

ఈ విచారణ కేవలం జూలై 20 ఘటనకే పరిమితం కారాదు. భవిష్యత్తులో శాంతియుత నిరసనలను ఎదుర్కొనే పోలీసు వ్యవస్థకు ఇది శాశ్వత మార్గదర్శకంగా నిలవాలి. బలప్రయోగానికి, రాజ్యాధికార దుర్వినియోగానికి మధ్య ఉన్న గీతను స్పష్టంగా నిర్వచించడం ద్వారానే, పౌరుల నిరసన హక్కుకు నిజమైన రక్షణ లభిస్తుంది. యువత న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని కోల్పోకుండా చూసుకోవడం, ప్రజాస్వామ్య మనుగడకు అత్యవసరం. సుప్రీంకోర్టు ఈ బాధ్యతను సమర్థంగా నెరవేర్చాలని ఆశిద్దాం. బలప్రయోగానికి, రాజ్యాధికార దుర్వినియోగానికి మధ్య గీత గీయడమే -ఈ విచారణ ప్రజాస్వామ్యానికి ఇచ్చే నిజమైన కానుక!

### పనికొచ్చే పలుకు



## కల మీది.. సంకల్పమూ మీదే!

జీవితంలో -సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంటున్నపుడు చుట్టూవున్నవారే తప్పకుండా అనుమానాలు వ్యక్తం చేస్తారు. "ఇది సాధ్యమేనా?", "నువ్వు విఫలమైతే ఏం చేస్తావు?", "సురక్షితమైన మార్గంలోనే వెళ్లు" -ఇలాంటి మాటలు సహజం. ఈ అనుమానాలతో మీ ఆత్మవిశ్వాసాన్ని చంపేయొద్దు. మీ ఆలోచనలు, నిర్ణయాలు ఇతరుల అభిప్రాయాలకు లొంగకూడదు. వారెన్ని అనవసరపు ఆందోళనలు వ్యక్తపరిచినా, మీరు మాత్రం ధైర్యంగా దృష్టిని గమ్యంపైనే ఉంచాలి.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం అర్థం చేసుకోవాలి. విమర్శించేవారికి, అనుమానాలు వ్యక్తం చేసేవారికి సాధారణంగా మీరు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి, లక్ష్యం వెనుక ఉన్న లోతైన పరిస్థితి గురించి పూర్తి అవగాహన ఉండదు. వారు బయటినుంచి చూస్తూ తీర్పులిస్తారు, కానీ మీరు ఆ మార్గంలో ఎదుర్కొనే సవాళ్లను, తీసుకునే నిర్ణయాలను, పడే శ్రమను వారు అనుభవించరు. అమెరికా మాజీ అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ తన ప్రసిద్ధ ప్రసంగంలో ఈ భావననే అద్భుతంగా వ్యక్తం చేశారు. నిజమైన గుర్తింపు లభించేది తప్పులెంచేవారికి కాదు, ధైర్యంగా బరిలో దిగి ప్రయత్నించేవారికేనని ఆయన స్పష్టం చేశారు. అంటే, పక్కన నిలబడి విమర్శించడం సులభమే. కానీ వాస్తవంగా రంగంలోకిదిగి, రిస్క్ తీసుకుని, విజయమైనా అపజయమైనా ఎదుర్కొనేవారికే నిజమైన గౌరవం దక్కుతుంది. ఈ సూత్రాన్ని నిత్యజీవితానికి ఎలా అన్వయించాలంటే -ముందు అనుమానాలను, విమర్శలను రెండు కోణాల్లో వేరుచేసి చూడటం నేర్చుకోండి. కొన్ని నిర్మాణాత్మక సలహాలు, మరికొన్ని కేవలం భయంనుంచి పుట్టిన ఆందోళనలు. మీ దగ్గరివారు మిమ్మల్ని ప్రేమతో హెచ్చరిస్తున్నా, వారి భయం మీ కలను నిర్వచించనివ్వకండి. తరువాత.. మీ నిర్ణయానికి కారణాలను స్పష్టంగా మీకు మీరే వివరించుకోండి. మీరు ఎందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నారో మీకు స్పష్టత ఉంటే, ఇతరుల సందేహాలు మిమ్మల్ని కదిలించలేవు. మూడోది, మీలాంటి లక్ష్యాలున్న వ్యక్తుల సాంగత్యాన్ని పెంచుకోండి. నిరుత్సాహపరిచేవారి మధ్య ఎక్కువసేపు గడిపితే, మీ ఆత్మవిశ్వాసం క్రమంగా క్షీణిస్తుంది. నాలుగోది, చిన్న చిన్న విజయాలను జరుపుకోండి. ప్రతి అడుగు మీ సామర్థ్యంపై మీకు మరింత నమ్మకాన్నిస్తుంది.

తెలుగు నానుడుల్లోనూ ఈ భావననే ప్రతిబింబించే మాటలు ఉన్నాయి. "నిందించేవారు నిందిస్తారు, నడిచేవారు నడుస్తారు" అని పెద్దలు చెబుతుంటారు. అంటే, ఎవరైనా ఏమనుకున్నా, తమ మార్గంలో స్థిరంగా ముందుకు సాగేవారే చివరికి గమ్యం చేరుకుంటారని అర్థం. చరిత్రలో గొప్ప విజయాలు సాధించిన ప్రతి వ్యక్తీ -వ్యాపారవేత్తలు, శాస్త్రవేత్తలు, కళాకారులు -తమ ప్రయాణంలో ఎన్నో సందేహాలు, విమర్శలు ఎదుర్కొన్నవారే. వారిలో ప్రత్యేకత ఏమిటంటే.. ఆ అనుమానాల మధ్య కూడా తమ దృష్టిని కోల్పోకుండా ముందుకు సాగడమే.

గుర్తుంచుకోండి -మీ జీవితంలో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలంటే, బాహ్య అభిప్రాయాలకు కాకుండా, మీ అంతర్గత దృఢ నిశ్చయానికి ప్రాధాన్యమివ్వాలి. అందరూ మిమ్మల్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం లేదు. అందరూ మీ కలను నమ్మాల్సిన అవసరం అంతకన్నా లేదు. మీరు మీ మార్గంపై నమ్మకంతో ముందుకు సాగినప్పుడు, ఫలితాలే మీ తరఫున మాట్లాడతాయి.

# కజిరంగను ఊపిరి పీల్చనివ్వండి!




కజిరంగ చుట్టూ పర్యావరణ సున్నిత మండలిని 10 కిలోమీటర్ల నుంచి కిలోమీటరుకు కుదించాలన్న అస్సాం ప్రభుత్వ యోచన తీవ్ర వివాదాస్పదమవుతోంది. బొకాఖాట్‌లో ఆధునిక స్టేడియం నిర్మాణంతోసహా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నదే సీఎం హిమంత బిశ్వ శర్మ వాదన. అయితే, వరదల సమయంలో ఖడ్గమృగాలు, ఏనుగులు ఎత్తైన ప్రాంతాలకు తరలిపోయే వన్యప్రాణి కారిడార్లు ఈ చిన్న మండలికి మించి విస్తరించి ఉన్నాయని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. దశాబ్దకాలంలోనే సందర్శకుల సంఖ్య 200 శాతం పెరిగిన నేపథ్యంలో, మరింత మౌలిక నిర్మాణాలు వన్యప్రాణి కదలికలకు ముప్పు తెచ్చే ప్రమాదముంది. శతాబ్దానికిపైగా శ్రమించి నిర్మించుకున్న ప్రపంచ వారసత్వ సంపదను కాపాడుకోవడమే అత్యంత ప్రాధాన్యత కావాలి.

ఒకప్పుడు మన ఉపఖండం ఉత్తర ప్రాంతమంతటా స్వేచ్ఛగా సంచరించిన భారత ఏకశృంగ ఖడ్గమృగం, 20వ శతాబ్దం ప్రారంభం నాటికి వేటకు బలై అంతరించిపోయే స్థాయికి చేరింది. 1908లో కజిరంగను రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించడంతో దీని పరిరక్షణ ప్రస్థానం మొదలైంది. 1950లో వన్యప్రాణి సంరక్షణ కేంద్రంగా, 1974లో జాతీయ పార్కుగా, 2007లో పులుల సంరక్షణ కేంద్రంగా క్రమంగా అభివృద్ధి చెందింది. శతాబ్దానికిపైగా సాగిన ఈ అంకితభావం, నిబద్ధత ఫలితంగానే నేడు కజిరంగ ప్రపంచంలోనే అత్యుత్తమ వన్యప్రాణి ఆవాసాల్లో ఒకటైంది. ప్రస్తుతం ఇక్కడినుంచి నేపాల్‌లోని తరాయి గడ్డి భూముల వరకూ దాదాపు 4,000 ఖడ్గమృగాలు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. వీటితోపాటు పులులు, ఏనుగులు, హూలాక్ గిబ్బన్లు, స్లాత్ బేర్లు, గంగా నదీ డాల్ఫిన్లు, వేలాది పక్షి జాతులకు.. ఇది ఆవాసమైంది. అయితే, ఇంతటి అద్భుతమైన పరిరక్షణ విజయానికి నోటిఫై చేయని పర్యావరణ సున్నిత మండలి (ఈఎస్‌జడ్) ఒక పెద్ద బలహీనతగా మిగిలిపోయింది. కజిరంగ జాతీయ పార్కు, పులుల సంరక్షణ కేంద్రం చుట్టూ కేవలం కిలోమీటరు ఈఎస్‌జడ్‌ను నోటిఫై చేయాలన్న అస్సాం ప్రభుత్వ యోచన ఎందుకు తీవ్ర ఆందోళన కలిగిస్తుందో అర్థం చేసుకోవాలంటే, ముందుగా ఈఎస్‌జడ్ ప్రాముఖ్యతను, జాతీయ వన్యప్రాణి కార్యాచరణ ప్రణాళిక (2002-2016) దీన్ని డిఫాల్ట్‌గా 10 కిలోమీటర్ల పరిధిగా ఎందుకు నిర్దేశించిందో అర్థం చేసుకోవాలి. వన్యప్రాణులను రక్షించడం, మానవ-జంతు సంఘర్షణలను నివారించడమే దీని ముఖ్య ఉద్దేశం. కాలుష్య పరిశ్రమలవంటి కొన్ని ఆర్థిక కార్యకలాపాలను ఈఎస్‌జడ్‌లో పూర్తిగా నిషేధిస్తారు. హోటళ్లు, రిసార్టులవంటి వాటిని మాత్రం 'నియంత్రిత' పద్ధతిలో అనుమతిస్తారు. ఇది పూర్తిగా హేతుబద్ధమైన విధానం. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ నిర్మించాలనుకుంటున్న ఆధునిక స్టేడియం మాత్రం ఏమాత్రం సహేతుకం కాదు. కజిరంగ నీటి పరీవాహక ప్రాంతాల్లో మైనింగ్‌ను నిషేధిస్తూ 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ప్రభుత్వం గుర్తించడంలో విఫలమైంది.

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మాత్రం, ఈ 10 కిలోమీటర్ల పరిమితి కేవలం ఒక 'డిఫాల్ట్' ఏర్పాటు మాత్రమేనని, కజిరంగకు తుది సైట్-స్పెసిఫిక్ ఈఎస్‌జడ్ నోటిఫికేషన్ లేకపోవడంవల్లే ఇది వర్తిస్తోందని వాదిస్తున్నారు. సుప్రీంకోర్టే కనీస కిలోమీటర్ ఈఎస్‌జడ్‌ను నిర్దేశించిందని, రాష్ట్రం అధికారికంగా నోటిఫై చేసేవరకూ మాత్రమే 10 కిలోమీటర్ల పరిమితి వర్తిస్తుందని ఆయన స్పష్టం చేస్తున్నారు. శాశ్వతంగా 10 కిలోమీటర్ల బఫర్‌ను కొనసాగిస్తే, కలియాబర్, దొబోకా, ఝుఖలాబంధ, బొకాఖాట్‌వంటి పట్టణాలే మనుగడలో ఉండవని, ఈ శివారు పట్టణాల్లో నివసించే వేలాదిమంది తీవ్రంగా ప్రభావితమవుతారన్నది హిమంత వాదన. బొకాఖాట్‌లో నిర్మించాలనుకుంటున్న ఆధునిక స్టేడియంతోసహా పలు పౌర ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలు ప్రస్తుత పరిమితివల్ల ఆలస్యమవుతున్నాయన్నది మరో మాట. అయితే, ఈ వాదనలో ఎంత పసవున్నా.. పర్యావరణవేత్తలు, వన్యప్రాణి నిపుణుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. వరదల సమయంలో ఖడ్గమృగాలు, ఏనుగులు, జింకలు ఎత్తైన ప్రాంతాలకు తరలిపోయేందుకు ఉపయోగించే వన్యప్రాణి కారిడార్లు, ప్రతిపాదిత కిలోమీటర్ మండలికి మించి, కర్బీ ఆంగ్‌లాంగ్ కొండల వరకూ విస్తరించి ఉన్నాయన్నది వారి హెచ్చరిక. చిన్న బఫర్ మండలి మానవ-వన్యప్రాణి సంఘర్షణలను మరింత పెంచే ప్రమాదముందని కూడా వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా ఈ వివాదంపై స్పందిస్తూ, "ప్రతి రుతుపవన కాలంలో వరదలు ఏనుగులను, ఖడ్గమృగాలను ఇదే కారిడార్ల గుండా ఎత్తైన ప్రాంతాలకు నెట్టేస్తాయి. స్టేడియంలను వేరే చోట నిర్మించుకోవచ్చు, కానీ మరో కజిరంగను నిర్మించలేం" అని వ్యాఖ్యానించడం గమనార్హం.

కజిరంగ ప్రత్యేక పర్యావరణ వ్యవస్థ విభిన్న సూక్ష్మ ఆవాసాలను సృష్టిస్తూ, ఇక్కడి వన్యప్రాణి వైవిధ్యానికి తోడ్పడుతున్నా, దీనికి ప్రత్యేకమైన ప్రమాదాలు కూడా ఉన్నాయి. వార్షిక వరదలు జంతువులను ఎత్తైన ప్రాంతాలకు నెట్టేసినప్పుడు, వాహనాలతో జంతువుల ఢీకొనడం, మరణాలు కూడా పెరుగుతాయి. ఇప్పుడు వన్యప్రాణులు తప్పనిసరిగా కదలాల్సిన ఈ మార్గాలచుట్టూ రోడ్లు, భవనాలు, లైట్లు, శబ్దం, జనసందోహం మరింత దగ్గరగా బిగుసుకుపోతే ఏమవుతుందో ఊహించండి. దశాబ్ద కాలంలోనే సందర్శకుల సంఖ్య 1.3 లక్షలనుంచి 4.1 లక్షలకు పెరిగింది. ఇది 200 శాతం వృద్ధి. మన సంరక్షిత ప్రాంతాలు ఎన్నడూ పర్యాటకం కోసం ఉద్దేశించినవి కావని నిపుణురాలు మీనా వెంకటరామన్ వాదించారు. బహుశా మనం ఆ ఆదర్శానికి కట్టుబడి ఉండలేకపోవచ్చు. కానీ కనీసం స్పాలు, స్విమ్మింగ్ పూల్స్, నాలుగు లేన్ల రోడ్లు, భారీ జనసమూహాల చొరబాటు, పారిశ్రామిక గోలారావాన్ని అయినా ఈ అటవీ ఆవాసాలకు దూరంగా ఉంచాలి. అయితే, ఈ చర్చ కేవలం 10 నుంచి 1 కిలోమీటరుకు తగ్గించడం గురించి మాత్రమే కాదు-అస్సాంలోని అత్యంత విలువైన సహజ సంపదల్లో ఒకటైన కజిరంగ చుట్టూ అభివృద్ధికి, వన్యప్రాణి పరిరక్షణకు మధ్య సరిహద్దు ఎక్కడ ఉండాలన్నదే అసలైన ప్రశ్న. రూ.6,950 కోట్లతో నిర్మిస్తున్న కజిరంగ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు, 35 కిలోమీటర్ల ఎలివేటెడ్ వన్యప్రాణి కారిడార్‌తో జంతువుల రాకపోకలను సులభతరం చేస్తూ, మానవ-వన్యప్రాణి సంఘర్షణను తగ్గించే దిశగా రూపొందించడం ఒక సానుకూల సంకేతమే. అయితే, అభివృద్ధి, పరిరక్షణ పరస్పర విరుద్ధ లక్ష్యాలు కానవసరం లేకపోయినా, ఈఎస్‌జడ్ 'అసలైన స్ఫూర్తి' సరిగ్గా అమలవుతోందా? అన్నదే అసలు ప్రశ్నని వన్యప్రాణి నిపుణుడు బిభబ్ తాలుక్దార్ నొక్కిచెప్పారు. బఫర్ మండలిని కిలోమీటరుకు కుదించడం సాంకేతికంగా సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఉన్నా, శతాబ్దానికిపైగా శ్రమించి నిర్మించుకున్న ఈ అపురూప పర్యావరణ వ్యవస్థ భద్రతను ఫణంగా పెట్టే ఏ నిర్ణయమైనా అత్యంత జాగ్రత్తగా, శాస్త్రీయ ఆధారాలతో మాత్రమే తీసుకోవాలి. అభివృద్ధి అవసరమే, కానీ దానికి ప్రత్యామ్నాయ స్థలాలు వెతుక్కోవచ్చు. కానీ కజిరంగలాంటి ప్రపంచ వారసత్వ సంపదను మాత్రం మళ్లీ సృష్టించలేం. అపురూపమైన కజిరంగను ఊపిరి పీల్చుకోనివ్వడం ఇప్పుడు దేశం బాధ్యత! ▪




జీవితాన్ని రీస్టార్ట్ చేయడం ఫెయిల్యూర్ కాదు బ్రో. అది -గ్రోత్ జర్నీలో న్యూ లెవెల్! 30, 40, 50 - ఏజ్ ఏదైనా, కొత్త స్కిల్ నేర్చుకోవడం, కెరీర్ స్విచ్ చేయడం, టాక్సిక్ ఎన్విరాన్మెంట్ నుంచి బయటపడటం, ఫైనాన్షియల్‌గా అప్‌గ్రేడ్ అవ్వడం -ఇవన్నీ ఎప్పుడైనా పాసిబులే. కొత్తగా స్టార్ట్ చేయడం కొంచెం స్కేరీగా అనిపించొచ్చు, కానీ కంఫర్ట్ జోన్‌లో స్టక్ అయిపోవడం వల్ల జరిగే నష్టమే నిజంగా పెద్దది. "ఏజ్ ఈజ్ జస్ట్ ఎ నంబర్" అని ఊరికే అనరు -ఇది రియల్‌గా మీ మైండ్‌సెట్‌కు సంబంధించినది. లేటైనా ఫర్వాలేదు, కానీ డ్రీమ్స్‌ను చేజేతులారా వదిలేయకండి. బెటర్ లైఫ్ కోసం ఏజ్‌ను ఎక్స్‌క్యూజ్‌గా వాడుకోకండి, ఇప్పుడే స్టార్ట్ చేయండి!

-మహాదేవ

### వింతల్లో వింతలు

## మ్యూయింగ్‌తో మ్యాజిక్ మార్పు?





వియత్నాంలోని హనోయ్‌కు చెందిన గుయెన్ వియత్ ఆన్హ్ అనే 26 ఏళ్ల కుర్రాడి రూపాంతరం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. చిన్నప్పటి నుంచి ఊబకాయం కారణంగా ఎగతాళికి గురైన అతను, 2021 చివర్లో కరోనా లాక్‌డౌన్ సమయంలో తన రూపాన్ని పూర్తిగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇంట్లోనే వ్యాయామాలు, ఆహార నియంత్రణ పాటించి కేవలం ఆరు నెలల్లో ఏకంగా 38 కిలోల బరువు తగ్గినట్టు చెబుతున్నాడు. అంతేకాదు, నాలుక సరైన స్థానంలో ఉంచితే.. ముఖాకృతి మెరుగవుతుందని చెప్పే వైరల్ టెక్నిక్ 'మ్యూయింగ్' కూడా తన కోణాకార ముఖాకృతికి కారణమని అంటున్నాడు. చతురస్రాకార ముఖంనుంచి పదునైన గడ్డం, స్పష్టమైన కోణాలున్న ముఖంగా మారిన అతని ఫొటోలు చూసి, ఇది కేవలం ప్లాస్టిక్ సర్జరీ ఫలితమేనని చాలామంది అనుమానిస్తున్నారు. అయితే వియత్ ఆన్హ్ దీన్ని గట్టిగా ఖండిస్తున్నాడు. 1.82 మీటర్ల ఎత్తు, తన కొత్తరూపంతో ఇప్పుడు మోడలింగ్ కెరీర్‌లో రాణిస్తున్న అతను, మిస్టర్ టూరిజం వియత్నాం 2026 పోటీలో టాప్ 25లో నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

# ఈ కాలుష్యం చాలా డేంజర్.. సంతాన లోపం, కిడ్నీ సమస్యలు.. ప్రమాదాలెన్నో

కాలుష్యం.. ప్రపంచమంతటినీ వణికిస్తున్న భూతమిది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ కాలుష్యం పెరిగిపోతూనే ఉంది. మానవ మనుగడపై ప్రభావం చూపుతూనే ఉంది. గుండె సంబంధిత జబ్బులతో సంభవిస్తున్న మరణాల్లో 75 శాతం, ఊపిరితిత్తుల వ్యాధులతో జరుగుతున్న మరణాల్లో 25 శాతం కేవలం గాలి కాలుష్యం కారణంగానేనని ఇప్పటికే పరిశోధకులు నిర్ధారించారు. ముఖ్యంగా భారత్, చైనా దేశాలతో కూడిన ఆసియా ఖండం ప్రాంతంలో కాలుష్యం కారణంగా మరణాలు మరింత ఎక్కువని గుర్తించారు. అంతేకాదు కాలుష్యం కారణంగా వంధ్యత్వం, ఎముకలు గుల్లబారిపోవడం వంటి శారీరక సమస్యలతోపాటు మానసిక సమస్యలూ తలెత్తుతాయని తాజాగా పలు పరిశోధనల్లో తేల్చారు. మరి ఈ ప్రమాదాలు, వాటిని నివారించే మార్గాలు తెలుసుకుందాం..





### వంటగది నుంచి వాహనాల పొగ దాకా..

వాయు కాలుష్యం నేడు ప్రపంచాన్ని వణికిస్తున్న అతి పెద్ద సమస్య. మనకుకనిపించే కాలుష్యం పొగ గొట్టాల నుంచి, శిలాజ ఇంధనాల దహనం నుంచి, వాహనాలు తదితర వాటి నుంచి ఎక్కువగా వెలువడుతోంది. వీటి వల్ల అతి ప్రమాదకరమైన గోధుమ రంగు పొగ మంచు (బ్రౌన్ హెజ్) వాతావరణంలో ఏర్పడుతోంది. ఇది మనిషిఆరోగ్యానికి చాలా ప్రమాదకరమైనదని అమెరికన్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
శిలాజ ఇంధనాలు అంటే పెట్రోల్, డీజిల్, కిరోసిన్ వంటి వాటిని మండించినప్పుడు అతి సూక్ష్మమైన కణాలు (అల్ట్రా ఫైన్ పార్టికల్స్) వెలువడుతాయి.
వీటి నుంచే కాకుండా గ్యాస్ ఆధారిత వాహనాల నుంచి వచ్చే పొగ, గడ్డిని కోసే యంత్రాలు (లాన్ మూవర్స్), కట్టెలను కాల్చడం, ఎండిపోయిన ఆకులను కాల్చలడం, స్మోకింగ్ ద్వారా కూడా అల్ట్రాఫైన్ పార్టికల్స్ గాలిలో కలుస్తున్నాయి.
ఇవి ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమైనవి.
అంతేకాకుండా వంట గదిలో చికెన్, మటన్ వంటకాలు చేసేటప్పుడు కూడా ఈ కణాలు వెలువడుతున్నాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు.
ఇవి వేగంగా గాలిలో కలిసిపోతాయని, తర్వాత ఒకదానికొకటి కలిసి పెద్ద కణాలుగా మార్పు చెందుతాయని గుర్తించారు. ఈ అల్ట్రాఫైన్ పార్టికల్స్ రహదారుల పక్కన ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు.



### సంతాన సామర్థ్యం తగ్గిపోవడం

గాలిలో అత్యధిక కాలుష్యం కారణంగా పురుషుల్లో వంధ్యత్య సమస్య తలెత్తుతోందని తైవాన్ కు చెందిన పరిశోధకులు తేల్చారు. కాలుష్యం వల్ల పురుషుల్లో వీర్య కణాల నాణ్యత తగ్గిపోతోందని గుర్తించారు. 15 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్న దాదాపు 6,500 మంది పురుషుల్లో వీర్య కణాల ఉత్పత్తి, వాటి పరిస్థితి, క్రియాశీలత తదితర అంశాలపై మూడు నెలల పాటు అధ్యయనం చేశారు. ఈ ఫలితాలను రెండేళ్ల సమయానికి అన్వయించి.. అంచనాలను రూపొందించారు.
గాలిలో చేరే పర్టిక్యులేట్ మేటర్ (%పీఎం%) అత్యధిక స్థాయిల్లో పీల్చడం వల్ల వీర్య కణాల ఆకారం, పరిమాణం అసాధారణంగా మారిపోయినట్లు పరిశోధకులు గుర్తించారు. (పర్టిక్యులేట్ మేటర్ అంటే గాలిలో చేరే అతి సూక్ష్మ రసాయన కణాలు, దుమ్ము, ధూళి కణాలు).
అయితే వారిలో వీర్య కణాల సంఖ్య మాత్రం తగిన సంఖ్యలోనే ఉన్నట్లు నిర్ధారించారు. కానీ వాటి సామర్థ్యం లోపించడం కారణంగా.. ఈ వీర్య కణాలు గర్భధారణ కోసం పనికిరానివిగా మారిపోతున్నాయని తేల్చారు.

### ఎముకలు గుల్లబారి విరిగిపోవడం

ఆస్టియో పోరోసిస్.. అంటే ఎముకల కణాల్లో సాంద్రత తగ్గి గుల్లబారిపోయే సమస్య. దీనివల్ల ఎముకల్లో పటుత్వం తగ్గిపోయి చిన్న దెబ్బ తగిలినా విరుగుతాయి. సాధారణంగా వయసు మీద పడిన కొద్దీ ఎముకల్లో పటుత్వం తగ్గుతూ ఆస్టియో పోరోసిస్ సమస్య తలెత్తుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా ఆస్టియో పోరోసిస్ కారణంగా సుమారు 89 లక్షల మంది ఎముకలు విరిగే సమస్య (కాళ్లు, చేతులు, ఇతర భాగాల్లో ఎముకలు విరగడం) బారిన పడుతున్నట్లు ప్రపంచ ఆస్టియోపోరోసిస్ ఫౌండేషన్ లెక్కతేల్చింది. అయితే గాలి కాలుష్యం ఈ ఆస్టియోపోరోసిస్ సమస్య మరింతగా పెరగడానికి కారణమవుతోందని అమెరికన్ శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గాలి కాలుష్యానికి గురైనప్పుడు శరీరంలో పారా థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతోందని, ఇది ఆస్టియో పోరోసిస్ కు దారి తీస్తోందని గుర్తించారు. ది లాన్సెట్: ప్లానెటరీ హెల్త్ జర్నల్ లో వారి అధ్యయన నివేదిక ప్రచురితమైంది.

### అమెరికన్ శాస్త్రవేత్తలు రెండు దశల్లో ఈ అధ్యయనం చేశారు.

తొలి దశలో కాలుష్యం ఎక్కువగా ఉండే ఒక ప్రాంతాన్ని, కాలుష్యం అతి తక్కువగా ఉండే మరో ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ఈ ప్రాంతాల్లో 65 ఏళ్లు పైబడిన 92 లక్షల మందికి సంబంధించిన వైద్య రికార్డులను పరిశీలించారు. 2003 నుంచి 2010 వరకు ఏడేళ్లకు సంబంధించిన డేటాను సేకరించి విశ్లేషించారు. ఏయే ప్రాంతంలో ఏ సమయంలో ఎంత మంది ఎముకలు విరిగిన సమస్యతో బాధపడింది లెక్కించారు. ఆయా సమయాల్లో ఏ ప్రాంతంలో ఎంత గాలి కాలుష్యం నమోదైంది పోల్చి చూశారు. మొత్తంగా కాలుష్యం స్థాయి అధికంగా నమోదైన ప్రాంతాలకు చెందినవారిలో ఆస్టియోపోరోసిస్ సమస్య ఎక్కువగా ఉందని, ఎముకలు విరిగే సమస్య కూడా ఎక్కువగా ఉందని గుర్తించారు.
ఇక శాస్త్రవేత్తలు రెండో దశలో వాహనాల కాలుష్యం అత్యధికంగా ఉండే ఓ పట్టణ ప్రాంతాన్ని ఎంచుకుని పరిశోధన చేశారు. 35 ఏళ్ల నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న 692 మంది పురుషులకు సంబంధించి.. కొన్నేళ్ల వైద్య రికార్డులను పరిశీలించారు. కాలుష్యం తక్కువగా ఉండే ప్రాంతాల వారితో పోల్చితే.. కాలుష్యం అధికంగా ఉన్న ఈ పట్టణ ప్రాంతాల వారిలో పారా థైరాయిడ్ హార్మోన్ స్థాయి తక్కువగా ఉందని, ఆస్టియో పోరోసిస్ సమస్య అధికంగా ఉందని గుర్తించారు. శరీరంలో ఎముకల నిర్మాణం, ఎముకలు పటిష్టంగా ఉండడం కోసం పారాథైరాయిడ్ హార్మోన్ కీలకంగా పనిచేస్తుంది. ఇది తక్కువగా ఉండడం కారణంగా ఎముకలు గుల్లబారుతాయి.

### పక్షవాతం ముప్పు కూడా..

గాలి కాలుష్యం కారణంగా పక్షవాతం వచ్చే ముప్పు కూడా పెరుగుతోందని అమెరికన్ శాస్త్రవేత్తలు ఇటీవలి ఓ అధ్యయనంలో తేల్చారు. పక్షవాతం, దాని సంబంధిత సమస్యల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 50 లక్షల మంది మరణిస్తున్నట్లు అంచనా. దీని బారినపడి ఎంతో మంది శారీరక వైకల్యం పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు పక్షవాతానికి, కాలుష్యానికి మధ్య సంబంధంపై పరిశోధన చేశారు. ప్రపంచవ్యాప్తంగా 28 దేశాలకు చెందిన 62 లక్షల మంది పక్షవాతం బాధితులపై జరిగిన 94 అధ్యయనాలను ఒక చోట క్రోడీకరించి పరిశీలించారు. 1948 నుంచి 2014 మధ్య సుదీర్ఘంగా జరిగిన ఆ అధ్యయనాల ఆధారంగా.. పక్షవాతం సమస్యలకు, గాలిలో హానికర రసాయనాలు, పర్టిక్యులేట్ మేటర్ స్థాయిలకు మధ్య సంబంధమున్నట్లు గుర్తించారు.
విపరీతంగా గాలి కాలుష్యం ఉన్న ప్రాంతాల్లో చిన్న వయసులోనే పక్షవాతం బారిన పడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనంలో నిర్ధారించారు.
ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని.. ఇతర సమస్యలతో పాటు గాలి కాలుష్యం కూడా తోడై బ్రెయిన్ స్ట్రోక్ వంటివాటికి కారణమవుతోందని వారు చెబుతున్నారు.

### కిడ్నీల పనితీరుకు దెబ్బ

విపరీతంగా గాలి కాలుష్యానికి లోనవుతున్న వారిలో మూత్రపిండ (కిడ్నీ) సంబంధిత సమస్యలు ఎక్కువగా వస్తున్నట్లు అమెరికన్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ శాస్త్రవేత్తలు గుర్తించారు. గాలిలోని కలుషితాలు ఊపిరితిత్తుల ద్వారా రక్తంలోకి చేరుతున్నాయని, ఆ కలుషితాలను తొలగించే క్రమంలో కిడ్నీలు దెబ్బతింటున్నాయని తేల్చారు. వారు ఈ అంశంపై చాలా పెద్ద పరిశోధనే చేశారు. అమెరికా అంతరిక్ష సంస్థ నాసాకు చెందిన శాటిలైట్ల ద్వారా పలు ప్రాంతాల్లో గాలి కాలుష్యం స్థాయిలను లెక్కించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో నివసించే సుమారు 20 లక్షల మందికి సంబంధించిన వైద్య రికార్డులను విశ్లేషించారు.
గాలి కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిడ్నీ సంబంధిత సమస్యలు ఏటేటా బాగా పెరిగిపోతున్నట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు.
అత్యధిక కాలుష్యం స్థాయిలే కాదు.. కొంచెం కాలుష్యంతోనూ కిడ్నీల పనితీరుపై ప్రభావం పడుతుందని.. కాలుష్యం స్థాయిని బట్టి సమస్యల తీవ్రత ఉంటుందని అమెరికాకు చెందిన సెయింట్ లూయిస్ హెల్త్ కేర్ సిస్టమ్ డైరెక్టర్ జియాద్ అల్లీ పేర్కొన్నారు.

### కాలుష్యంతో అధిక రక్తపోటు ముప్పు...

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కమ్ముకుంటున్న సమస్యల్లో అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఒకటి. కాలుష్యం కారణంగా కూడా ఈ సమస్య మరింతగా ఉధృతమవుతున్నట్లు యురోపియన్ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇందుకోసం స్పెయిన్, జర్మనీ, డెన్మార్క్, స్వీడన్, నార్వే తదితర దేశాలకు చెందిన 41 వేల మందిపై 2008 నుంచి 2015 వరకు పరిశోధన చేశారు. సర్వే కోసం ఎంచుకున్న సమయంలో వారెవరికీ కూడా అధిక రక్తపోటు సమస్య లేదు. అనంతరకాలంలో 15 శాతం మందికి ఈ సమస్య తలెత్తింది. అధ్యయనం చేసిన వారిలో అధిక రక్తపోటు సమస్య తలెత్తిన వారి వివరాలను పరిశీలించగా.. వారంతా గాలి కాలుష్యం అధికంగా ఉండే ప్రాంతాల్లోనే నివసిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.
గాలిలో రసాయన కలుషితాలు, పర్టిక్యులేట్ మేటర్ ఊపిరితిత్తుల ద్వారా శరీరంలో చేరి ఆరోగ్య సమస్యలను తలెత్తుతున్నాయని, అధిక రక్తపోటు సమస్యకు దారి తీస్తోందని పరిశోధనకు నేతృత్వం వహించిన జర్మనీ హెన్రిచ్ హేయిన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బార్బరా హాఫ్ మన్ వెల్లడించారు.

### గర్భస్త శిశువుల ఎదుగుదలపై ప్రభావం

గాలిలో ఉండే హానికరమైన, విషపూరిత రసాయనాలు గర్భస్థ శిశువుల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయని అమెరికన్ పరిశోధకులు చెబుతున్నారు. ముఖ్యంగా గర్భం తొలి దశలో అంటే ఒకటో నెల నుంచి మూడో నెల వరకు ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. న్యూయార్క్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ప్రొఫెసర్ జేసన్ బ్లమ్ నేతృత్వంలోని బృందం దీనిపై పరిశోధన చేసింది. అమెరికాలోని పలు ప్రాంతాల్లో చిన్నారులకు జన్మనిచ్చిన మహిళల వైద్య రికార్డులను, ఆయా ప్రాంతాల్లో కాలుష్యం స్థాయిలను వారు విశ్లేషించారు. దీంతోపాటు ప్రయోగశాలలోనూ గర్భస్థ ఎలుకలపై పరిశోధన చేశారు.
కాలుష్యం కారణంగా గర్భంలో పిండం ఎదుగుదల దెబ్బతింటుందని, నెలలు నిండకముందే కాన్పు జరుగుతుందని పరిశోధనలో తేలినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
ముఖ్యంగా గర్భం తొలిదశలో అంటే తొలి మూడు నాలుగు నెలల పాటు తీవ్ర స్థాయిలో కాలుష్యానికి గురైతే.. బిడ్డ చాలా తక్కువ బరువుతో జన్మిస్తున్నట్లుగా వెల్లడైంది.

### కలుషితాలతో మానసిక సమస్యలు


కలుషితమైన గాలి కారణంగా శారీరక సమస్యలే కాదు.. మానసిక సమస్యలూ తలెత్తుతున్నట్లు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ పరిశోధకులు తేల్చారు. దీనిపై అమెరికాలోని పలు ప్రాంతాల్లో గాలి కాలుష్యం డేటాను సేకరించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్యం రికార్డులతో సరిపోల్చి విశ్లేషించారు. కాలుష్యం తక్కువగా ఉన్న ప్రాంతాలతో పోలిస్తే.. ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని వారు 17 శాతం ఎక్కువగా మానసిక సమస్యలు, ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు.
ఇక పురుషులతో పోలిస్తే.. మహిళలపై గాలి కాలుష్యం ఎక్కువ ప్రభావం చూపుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. వీరు ఏకంగా 39 శాతం మంది మానసిక ఒత్తిళ్లతో బాధపడుతున్నట్లు తేల్చారు.
గాలిలోని కలుషితాలు.. మనలో ఒత్తిడిని పెంచే హార్మోన్లు ఎక్కువగా విడుదలవడానికి కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికితోడు కలుషితమైన గాలి కారణంగా వచ్చే శ్వాస సమస్యలు, చర్మ సమస్యలు వంటివి కూడా ఒత్తిడిని పెంచుతున్నాయని పేర్కొంటున్నారు.

### అన్నీ కలసి గుండె జబ్బులు

గాలిలో కలుస్తున్న వాహనాల పొగ, ఫ్యాక్టరీలు, ఇతర కలుషితాల కారణంగా గుండె పోటు, కవాటాలు, రక్తనాళాలు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నట్లు అమెరికన్ హార్ట్ అసోసియేషన్ హెచ్చరిస్తోంది. ఆల్కాహాల్, కాఫీ వంటి వాటి అతి వినియోగం కారణంగా గుండె పోటు వచ్చే ప్రమాదం ఎంతగా ఉందో.. గాలి కాలుష్యం కారణంగా అంతే ప్రమాదం ఉందని స్పష్టం చేస్తోంది. ఇందుకోసం అమెరికన్ హార్ట్ అసోసియేషన్ శాస్త్రవేత్తలు 1960 నుంచి 2010 మధ్య జరిగిన 36 అధ్యయనాల ఫలితాలను క్రోడీకరించి పరిశీలించారు.
మొత్తంగా సంభవిస్తున్న గుండెపోటు ఘటనల్లో 5 నుంచి 7 శాతం వరకు గాలి కాలుష్యమే కారణమని వెల్లడైందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
ముఖ్యంగా ఇతర జబ్బులతో బాధపడుతున్నవారు గాలి కాలుష్యానికి లోనైతే గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

# మగవారి లోపాలూ..

సంతానం కలగకపోవటం అనగానే ముందుగా మహిళలనే తప్పుబడుతుంటారు. నిజానికి మగవారూ తక్కువేమీ కాదు. సంతానలేమి సమస్యలో దాదాపు సగం కేసులకు పురుషులే కారణం! శుక్రకణాలు తగినంత ఉత్పత్తి కాకపోయినా, వీటి ఆకారం దెబ్బతిన్నా, వేగంగా ఈదకపోతున్నా గర్భధారణ అవకాశాలు గణనీయంగా పడిపోతాయి. కాబట్టి సంతానలేమికి దారితీస్తున్న 'మగ' అంశాలపై అవగాహన కలిగుండటం అవసరం.



ఆడవారితో పోలిస్తే మగవారు ఎక్కువ కాలం సంతానాన్ని కనే సామర్థ్యం కలిగుండటం నిజమే అయినా వయసు మీద పడుతున్నకొద్దీ శుక్రకణాల నాణ్యత తగ్గుతూ వస్తుంది. ఆడవారి అండం, మగవారి శుక్రకణాల కలయికతో గర్భధారణ ప్రక్రియ మొదలవుతుంది. సాధారణంగా మగవారిలో 10-12 ఏళ్ల వయసులో శుక్రకణాల ఉత్పత్తి మొదలై, జీవితాంతమూ కొనసాగుతూ వస్తుంటుంది. వృషణాల్లోని సూక్ష్మ గొట్టాల్లో ఉత్పత్తయ్యే ఇవి స్ఖలన సమయంలో వెలువడి.. చుట్టచుట్టుకొని ఉండే గొట్టం, ప్రోస్టేట్ గ్రంథి ద్వారా వీర్యద్రవంతో పాటు బయటకు వస్తాయి. వీటి పని కేవలం అండాన్ని ఫలదీకరణ చెందించటమే. సంభోగం అనంతరం శుక్రకణాలు జననాంగ మార్గం, గర్భాశయ ముఖద్వారం, గర్భాశయం ద్వారా ఫలోపియన్ గొట్టంలోకి చేరుకుంటాయి. చిత్రమేంటంటే- రోగనిరోధక వ్యవస్థ శుక్రకణాలను చొరబాటుదారులుగా భావించి, చంపటానికి ప్రయత్నించటం. దీని బారి నుంచి బయటపడి ఫలోపియన్ గొట్టంలోకి చేరుకున్న శుక్రకణం, అండంలోకి చొచ్చుకెళ్లి ఫలదీకరణ జరుగుతుంది. ఈ క్రమంలో ఎక్కడ సమస్య తలెత్తినా గర్భధారణకు అడ్డంకిగా పరిణమిస్తుంది.

### ఇవీ కారణాలు

గర్భధారణ కోసం ప్రయత్నిస్తూ, ఏడాది దాటినా ఫలితం కనిపించకపోతే సంతానలేమిగా భావిస్తారు. మహిళా భాగస్వామి వయసు 35 ఏళ్ల కన్నా మించినట్టయితే, ఆరు నెలలు ప్రయత్నించినా గర్భం ధరించకపోతే సమస్యగా పరిగణించాల్సిందే. మగవారి విషయంలో సంతాన సామర్థ్యం తగ్గటానికి జీవనశైలి, జబ్బులు, లోపాల వంటి రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయి. అయితే కొందరిలో ఎలాంటి కారణమూ ఉండకపోవచ్చు.

**1. శుక్రకణ సమస్యలు**

అతి ప్రధానమైనవి ఇవే. అన్నింటికన్నా ముఖ్యమైంది శుక్రకణాలు తగ్గటం (ఒలిగోస్పెర్మియా). ఒక మిల్లీలీటరు వీర్యంలో 1.5 కోట్ల కన్నా తక్కువ కణాలుంటే గర్భధారణ కష్టమవుతుంది. వీటి కదలికలు తగ్గినా (ఆస్థెనోస్పెర్మియా) సమస్యే. దీంతో అండాన్ని చేరుకొని, ఫలదీకరణ చెందే అవకాశాలు పడిపోతాయి. శుక్రకణాల ఆకారం దెబ్బ తినటమూ (టెరటోస్పెర్మియా) ఇబ్బంది కలిగిస్తుంది. అవి అండంలోకి చొచ్చుకెళ్లటం, ఫలదీకరణ చెందే సామర్థ్యం తగ్గుతాయి. కొందరికి శుక్రకణాలు అసలే ఉండకపోవచ్చు (అజూస్పెర్మియా).

**2. హార్మోన్ సమస్యలు**

శుక్రకణాల ఉత్పత్తిలో హార్మోన్లు కీలక పాత్ర పోషిస్తాయి. మెదడులోని హైపోథలమస్ నుంచి విడుదలయ్యే గొనడోట్రోఫిన్ రిలీజింగ్ హార్మోన్ పీయూష గ్రంథిని ప్రేరేపిస్తుంది. అప్పుడు దీన్నుంచి ల్యూటినైజింగ్ హార్మోన్ (ఎల్‌హెచ్), ఫాలికల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ (ఎఫ్ఎస్‌హెచ్) పుట్టుకొస్తాయి. ఇవి వృషణాల్లో టెస్టోస్టిరాన్, వీర్యం ఉత్పత్తయ్యేలా చేస్తాయి. టెస్టోస్టిరాన్ తగ్గి, ఎఫ్ఎస్‌హెచ్ ఎక్కువైతే శుక్రకణాల ఉత్పత్తి పడిపోతుంది. పిట్యుటరీ గ్రంథి నుంచి ప్రొలాక్టిన్ హార్మోన్ మరీ ఎక్కువగా విడుదలైతే ఈ మొత్తం ప్రక్రియా నెమ్మదిస్తుంది. శృంగార వాంఛ తగ్గొచ్చు. థైరాయిడ్ గ్రంథి సమస్యలూ సంతాన సామర్థ్యాన్ని దెబ్బతీయొచ్చు.

**3. జబ్బులు, మందులు**

శారీరక సమస్యలు.. ముఖ్యంగా మధుమేహం పెద్ద చిక్కే తెచ్చిపెడుతుంది. రక్తంలో గ్లూకోజు నియంత్రణలో లేనివారిలో శుక్రకణాల కదలికలు తగ్గటం, వీటి డీఎన్ఏ చీలిపోవటం వంటివి తలెత్తుతాయి. వీర్యద్రవంతో శుక్రకణాలు కలవటానికి తోడ్పడే నాళాల్లో అడ్డంకులూ గర్భధారణను దెబ్బతీయొచ్చు. బాల్యంలో గవద బిళ్లలు, సుఖవ్యాధులకు చికిత్స తీసుకోకపోవటం, దీర్ఘకాల ప్రోస్టేట్ వాపు వంటివి అడ్డంకులకు కారణమవుతుంటాయి. ఇన్‌ఫెక్షన్లు నేరుగా శుక్రకణాలు తయారయ్యే భాగాన్నీ దెబ్బతీయొచ్చు.
అరుదుగా క్రోమోజోమ్ లోపాలు, జన్యు సమస్యలతోనూ శుక్రకణాల ఉత్పత్తి తగ్గొచ్చు.
కొన్నిరకాల కుంగుబాటు మందులు.. రక్తపోటు, ప్రోస్టేట్ సమస్యలు తగ్గటానికి వాడే అల్ఫాబ్లాకర్లు, కొన్ని యాంటీబయాటిక్ మందులూ శుక్రకణాల ఉత్పత్తి, స్ఖలనం మీద ప్రభావం చూపొచ్చు.

**4. వృషణాల సమస్యలు**

వీటిల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది వృషణాల్లో సిర వ్యాకోచించటం వల్ల తలెత్తే వరిబీజం (వెరికోసీల్) గురించే. దీని బారినపడ్డ చాలామందిలో శుక్రకణాల సంఖ్య తగ్గుతుంది. వీటి ఆకారమూ అస్తవ్యస్తం కావచ్చు. శుక్రకణాలను వృషణాల నుంచి మూత్రమార్గంలోకి చేరవేసే నాళంలో పుట్టుకతోనే అడ్డంకులు.. గతంలో హెర్నియా, వృషణాల శస్త్రచికిత్సల మూలంగా అడ్డంకులు ఏర్పడటమూ సమస్యగా పరిణమిస్తాయి.
స్ఖలన సమయంలో వీర్యం వెనక్కి మళ్లి, మూత్రాశయంలోకి వెళ్లటం (రెట్రోగ్రేడ్ ఎజాక్యులేషన్) మరో ఇబ్బంది. ఇది తరచూ మధుమేహం, గత శస్త్రచికిత్సలతో ముడిపడి ఉంటుంది.
బాల్యంలో వృషణాలు కింది సంచీలోకి దిగకుండా పైనే ఉండటమూ కొన్నిసార్లు సంతాన సామర్థ్యానికి అడ్డుపడొచ్చు.

**5. జీవనశైలి, పర్యావరణ అంశాలు**

మార్చుకోవటానికి వీలైన కారణాల్లో ప్రధానమైనవి ఇవే. సిగరెట్లు మితిమీరి కాల్చితే శుక్రకణాల సంఖ్య, నాణ్యత తగ్గుతుంది. వీటి డీఎన్ఏ సైతం చీలిపోవచ్చు. మద్యం మోతాదు మించినా టెస్టోస్టిరాన్ ఉత్పత్తి పడిపోతుంది. శుక్రకణాలు అంతగా పరిపక్వం కావు. ఊబకాయం.. ముఖ్యంగా బొజ్జ మూలంగా కొవ్వు కణజాలంలో టెస్టోస్టిరాన్ చివరికి ఈస్ట్రోజన్‌గా మారుతుంది. దీంతో ఈస్ట్రోజన్ మోతాదులు పెరిగి ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్ సంకేత వ్యవస్థ మందగిస్తుంది.

### వీర్య పరీక్ష ప్రధానం

మగవారిలో సంతానలేమి సమస్యను నిర్ధారించటంలో అతి ముఖ్యమైంది వీర్య పరీక్ష. ఇందులో శుక్రకణాల సంఖ్య, వాటి చురుకుదనం, ఆకారం, తీరుతెన్నుల వంటివన్నీ బయటపడతాయి. దీన్ని చేయించుకోవటానికి ముందు 2-5 రోజులు సంభోగానికి దూరంగా ఉండటం మంచిది. అవసరమైతే రక్తంలో ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, టెస్టోస్టిరాన్, ప్రొలాక్టిన్, టీఎస్‌హెచ్ వంటి హార్మోన్ల పరీక్షలు చేయాల్సి ఉంటుంది. వృషణాల అల్ట్రాసౌండ్ పరీక్షతో వరిబీజం, నాళాల్లో అడ్డంకుల వంటివి గుర్తించొచ్చు.

### మందులు-శస్త్రచికిత్సలు

హైపోథలమస్, పిట్యుటరీ గ్రంథి సమస్యలు గలవారికి ఎల్‌హెచ్ మాదిరిగా పనిచేసే హ్యూమన్ కోరియోనిక్ గొనడోట్రోపిన్ (హెచ్‌సీజీ) ఇంజెక్షన్లు అవసరమవుతాయి. వారానికి మూడు చొప్పున కనీసం ఆరు నెలలు తీసుకోవాలి. కొందరికి ఏడాది, రెండేళ్లూ ఇవ్వాల్సి రావచ్చు. ఆరు నెలలు దాటినా శుక్రకణాలు పెరగకపోతే రీకాంబినేంట్ హ్యూమన్ ఫాలికల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ (ఆర్‌హెచ్ఎఫ్ఎస్‌హెచ్) జత చేస్తారు. దీంతో మంచి ఫలితం కనిపించటం నిజమే అయినా సంతాన సామర్థ్యం పూర్తిగా ఇనుమడించటానికి ఏడాది, రెండేళ్లు పట్టొచ్చు. కొన్నిసార్లు ఇంకా ఎక్కువే పట్టొచ్చు. కొందరికి విటమిన్లు, ఖనిజాల మాత్రలు ఉపయోగపడొచ్చు. వీటిల్లోని యాంటీఆక్సిడెంట్ గుణాలు వీర్యం తయారీ ప్రక్రియ దెబ్బ తినటాన్ని నివారిస్తాయి. అయితే కచ్చితంగా పనిచేస్తాయని చెప్పలేం. పైగా ఖరీదూ ఎక్కువే. అందువల్ల ఆరోగ్యకరమైన ఆహారం తినటం ద్వారా విటమిన్లు, ఖనిజాలు లభించేలా చూసుకోవటమే మంచిది. వరిబీజం గలవారికి శస్త్రచికిత్స ఉపయోగపడుతుంది. వరిబీజానికి అనుసంధాన మైన సిరను కత్తిరించి, సరిచేయొచ్చు. అయితే చేతికి తగిలేంత పెద్దగా ఉంటే తప్ప చాలామందికి శస్త్రచికిత్స అవసరముండదు.

### సహాయ పద్ధతులు

సంతానలేమి సమస్య గల మగవారిలో చాలామందికి సహాయ పద్ధతులు (ఏఆర్‌టీ) ఉపయోగపడతాయి. శుక్రకణాలు అతి తక్కువగా ఉన్నా, మొత్తానికే లేకపోయినా ఇవి పనిచేస్తాయి. అంగం స్తంభించనివారికి, ఎక్కువసేపు స్తంభించనివారికి, సరిగా స్ఖలనం కానివారికి మేలు చేస్తాయి. కాకపోతే ఇవి ఖరీదైనవి. ఎక్కువ సమయమూ పడుతుంది. ఓపిక అవసరం. ఏఆర్‌టీ ఎక్కువసార్లు ప్రయత్నిస్తున్నకొద్దీ సంతానం కలిగే అవకాశాలూ తగ్గుతుండొచ్చు. కాబట్టి వీటిని ఎంచుకునే ముందు భాగస్వామితో మనసు విప్పి మాట్లాడుకోవటం మంచిది. ఇంట్రాయుటెరిన్ ఇన్‌సెమినేషన్ (ఐయూఐ): శుక్రకణాల సంఖ్య తక్కువగా ఉన్నవారికిది మేలు. శుక్రకణాలను వేరు చేసి, పెద్దమొత్తంలో నేరుగా మహిళ గర్భాశయంలో ప్రవేశపెట్టటం దీనిలోని కీలకాంశం. ఆడవారిలో అండం విడుదలయ్యే సమయంలో దీన్ని చేస్తారు. అయితే ఆడవారిలో ఫలోపియన్ గొట్టాల వంటివి మామూలుగా ఉండటం ముఖ్యం. ఇంట్రాసైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్ (ఇక్సీ): ఇది మగవారి నుంచి ఒక్క శుక్రకణాన్ని తీసుకొని, ప్రయోగశాలలో నేరుగా అండంలోకి జొప్పించే ప్రక్రియ. ఇదీ ఒకరకంగా కృత్రిమ గర్భధారణ (ఐవీఎఫ్) వంటిదే. శుక్రకణాలు తక్కువగా గలవారిలో చాలామందికి ఉపయోగపడుతుంది. ఆడవారి సంతాన సామర్థ్యం, శుక్రకణం నాణ్యత వంటి వాటిపై ఫలితం ఆధారపడి ఉంటుంది.
సర్జరీతో సేకరణ: వీర్యంలో శుక్రకణాలు చాలా తక్కువగా ఉన్నా, అసలే లేకపోయినా కొన్నిసార్లు వీటిని నేరుగా వృషణాల నుంచి సేకరించే అవకాశమూ ఉంది. ఇందులో వృషణాలకు చిన్న కోత పెట్టి లేదా సూది ద్వారా శుక్రకణాలను సంగ్రహిస్తారు. ఒక్క కణం లభించినా ఇక్సీ పద్ధతిలో గర్భధారణకు ప్రయత్నించొచ్చు. కృత్రిమ గర్భధారణ (ఐవీఎఫ్): ఇది చివరి అవకాశం. ఆడవారి నుంచి సంగ్రహించిన అండాలను ప్రయోగశాలలో శుక్రకణాలతో ఫలదీకరణ చెందించి పిండాన్ని వృద్ధి చేసి.. మహిళల గర్భసంచిలో ప్రవేశ పెట్టటం దీని ప్రత్యేకత. మగవారి విషయంలో ఇక్సీ సాయంతో కృత్రిమ గర్భధారణకు ప్రయత్నిస్తారు. మహిళల వయసు, ఆరోగ్యం.. అలాగే అండం, శుక్రకణాలు ఎంత బాగా ఉన్నాయనే దానిపై ఫలితం ఉంటుంది.
దాత సాయం: శుక్రకణాలు అసలే ఉత్పత్తి కానప్పుడు దాత నుంచి వీర్యాన్ని సేకరించి, గర్భాశయ ముఖద్వారం లేదా గర్భాశయంలో ప్రవేశపెట్టే పద్ధతిని ఎంచుకోవచ్చు.
జీవనశైలి మార్పులు ముఖ్యం
సంతానలేమితో ఇబ్బంది పడేవారు జీవనశైలి పరంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం ముఖ్యం.

### పొగ తాగటం మానెయ్యాలి.

మద్యం అలవాటుంటే పరిమితం చేసుకోవాలి.
గంజాయి వంటి మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు.
పండ్లు, కూరగాయలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారం తినాలి.
బరువు అదుపులో ఉంచుకోవాలి.
క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
ఇవి సంతానం కలిగే అవకాశాన్ని పెంచటమే కాకుండా మొత్తంగా ఆరోగ్యం మెరుగుపడటానికి తోడ్పడతాయి.

### సౌనాతో భద్రం

వృషణాలు శరీరానికి వెలుపల ఉంటాయి. అక్కడ శరీర మూల ఉష్ణోగ్రత కన్నా 2-3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఇది శుక్రకణాలు ఉత్పత్తి కావటానికి, వాటి నాణ్యతకు అనువైన వాతావరణం కల్పిస్తుంది. వృషణాల్లో ఉష్ణోగ్రత పెరిగితే ఇవీ దెబ్బతింటాయి. అందుకే వృషణాలు చల్లగా ఉండేలా చూసుకోవటం, వదులైన లోదుస్తులు ధరించటం ద్వారా సంతాన సామర్థ్యాన్ని పెంచు కోవచ్చని భావిస్తుంటారు. కానీ ఇందులో నిజం లేదు. కాకపోతే చాలా వేడితో కూడిన సౌనా స్నానం చేయటం.. వేడి నీటి తొట్టిలో 20 నిమిషాలు, అంతకన్నా ఎక్కువసేపు ఉండటం వల్ల తాత్కాలికంగా వీర్యం ఉత్పత్తి పడిపోవచ్చు. కాబట్టి వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

# భారత్‌తో రెండో టెస్టుకు శ్రీలంక జట్టులో భారీ మార్పులు.. ఐదుగురిపై వేటు!

- గాయం కారణంగా చండిమాల్ దూరం.. మరో నలుగురు ఆటగాళ్లపై వేటు
- ఆల్ రౌండర్ సహన్ అరాచ్చిగే, బ్యాటర్ కమిల్ మిషారాలకు జట్టులో చోటు
- భారత్-ఏ, లంక ప్రీమియర్ లీగ్‌లో రాణించడంతో యువ ఆటగాళ్లకు అవకాశం



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌తో జరిగిన తొలి టెస్టులో ఘోర పరాజయం చవిచూసిన శ్రీలంక, రెండో టెస్టు కోసం తమ జట్టులో భారీ మార్పులు చేసింది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టుతో ఆదివారం కొలంబోలో ప్రారంభంకానున్న చివరి టెస్టు కోసం 14 మంది సభ్యులతో కూడిన జట్టును శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) ప్రకటించింది. ఈ జట్టు నుంచి ఐదుగురు ఆటగాళ్లను తప్పించి, దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్న ఇద్దరు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. ఆల్ రౌండర్ సహన్ అరాచ్చిగే, బ్యాటర్ కమిల్ మిషారాలు తొలిసారిగా టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నారు.

గాలేలో జరిగిన తొలి టెస్టులో గాయపడిన సీనియర్ ఆటగాడు దినేశ్ చండిమాల్ రెండో టెస్టుకు దూరమయ్యాడు. అతని స్థానంలో కాంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా అరంగేట్రం చేసిన పసిందు సూరియబండార, తాను ఆడిన ఏకైక ఇన్నింగ్స్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరగడంతో అతనిపైనా సెలక్టర్లు వేటు వేశారు. వీరితో పాటు ఓపెనర్ నిషాన్ మదుష్క, బౌలింగ్ ఆల్ రౌండర్ రమేశ్ మెండిస్, ఫాస్ట్ బౌలర్ దిల్షాన్ మదుష్కలను కూడా జట్టు నుంచి తప్పించారు. ఇటీవల భారత్-ఏ జట్టుతో జరిగిన అనధికారిక టెస్టు సిరీస్‌లో శ్రీలంక-ఏ జట్టుకు నాయకత్వం వహించి అద్భుత ప్రదర్శన చేసిన సహన్ అరాచ్చిగేకు సెలక్టర్ల నుంచి పిలుపు అందింది. ఆ సిరీస్‌లో అతను రెండో మ్యాచ్‌లో 127 పరుగులు, తొలి మ్యాచ్‌లో 72 పరుగులు సాధించాడు. మొత్తం రెండు మ్యాచ్‌లలో 209 పరుగులతో తన జట్టు తరపున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఝుమరోవైపు, బ్యాటర్ కమిల్ మిషారా కూడా అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల ముగిసిన లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్) 2026 సీజన్‌లో 9 ఇన్నింగ్స్‌లలో 411 పరుగులు చేసి సత్తా చాటాడు. ఇందులో గాలే గ్యాలంట్స్‌పై సాధించిన సెంచరీ కూడా ఉంది. అంతేగాక మేజర్ క్లబ్స్ టీ20 టోర్నీలో గురువారం కేవలం 72 బంతుల్లో 145 పరుగులు బాది తన విధ్వంసకర ఫామ్‌ను చాటుకున్నాడు.

**భారత్, శ్రీలంక మధ్య జరిగిన తొలి టెస్టులో టీమిండియా**

165 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో భారత బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (167) సెంచరీతో కదం తొక్కగా, ఎడమచేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 10 వికెట్లు పడగొట్టి లంక పతనాన్ని శాసించాడు. ఈ నేపథ్యంలో సిరీస్‌ను సమం చేయాలనే లక్ష్యంతో శ్రీలంక పటిష్ఠమైన జట్టుతో బరిలోకి దిగుతోంది. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు ఆగస్టు 23న ప్రారంభం కానుంది.

**రెండో టెస్టుకు 14 మంది సభ్యులతో శ్రీలంక జట్టు ఇదే..**

లహిరు ఉదార, కమిల్ మిషారా, పసిందు సూరియబండార, కమిందు మెండిస్ (వైస్ కెప్టెన్), ధనంజయ డి సిల్వా (కెప్టెన్), సహన్ అరాచ్చిగే, సోనాల్ దినుష, నిరోషన్ డిక్వెల్లా, కేశార నువంత, ప్రభాత్ జయసూర్య, మిలన్ రత్నాయకే, లహిరు కుమార, అశిత ఫెర్నాండో, విశ్వ ఫెర్నాండో.

# భారత మాజీ క్రికెటర్ జాకబ్ మార్టిన్‌కు భారీ ఊరట.. 22 ఏళ్ల తర్వాత క్లీన్ చిట్

- 22 ఏళ్ల నాటి క్రిమినల్ కేసులో మాజీ క్రికెటర్ జాకబ్ మార్టిన్‌కు విముక్తి
- ఢిల్లీ పాటియాలా హౌస్ కోర్టు నిర్దోషిగా ప్రకటిస్తూ కీలక తీర్పు
- కేసు కారణంగా రైల్వే ఉద్యోగం కోల్పోయి తీవ్ర ఒత్తిడికి గురయ్యానన్న మార్టిన్
- అంతర్జాతీయ క్రికెటర్ కావడం వల్లే తనను ఇరికించారని ఆరోపణ
- ఈ తీర్పు తన జీవితంలో ఒక పెద్ద మలుపు అని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మాజీ క్రికెటర్, వడోదర నివాసి జాకబ్ మార్టిన్‌కు 22 ఏళ్ల సుదీర్ఘ న్యాయపోరాటంలో భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేస్తూ ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఆధారాలు లేకపోవడంతో మార్టిన్‌ను అన్ని ఆరోపణల నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు న్యాయస్థానం స్పష్టం చేసింది. 2004లో యూకే పర్యటనకు వెళ్లిన ఒక క్రికెట్ జట్టు సభ్యుడు వీసా గడువు ముగిసినా అక్కడే ఉండిపోయి, నకిలీ ఇమ్మిగ్రేషన్ స్టాంప్‌తో భారత్‌కు తిరిగి వచ్చాడు. ఈ ఘటనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లో చీటింగ్ (సెక్షన్ 420), ఫోర్జరీ (468), నకిలీ పత్రాలను ఉపయోగించడం (471), నేరపూరిత కుట్ర (120బీ) వంటి అభియోగాలతో పాటు పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 12 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో జాకబ్ మార్టిన్ పేరును చేర్చారు. అయితే, విచారణలో మార్టిన్‌కు వ్యతిరేకంగా ఎలాంటి విశ్వసనీయమైన సాక్ష్యాధారాలను ప్రాసిక్యూషన్ సమర్పించలేకపోయింది. నకిలీ యూకే స్టాంప్, ప్రయాణ ఏర్పాట్లు, ఆర్థిక లావాదేవీలలో మార్టిన్ పాత్ర ఉందని నిరూపించడంలో విఫలమైంది. అజ్వా స్పోర్ట్స్ క్లబ్‌పై ఆయనకు నియంత్రణ ఉందని చెప్పడానికి కూడా ఆధారాలు లేవని కోర్టు అభిప్రాయపడింది. సాక్షులు కూడా ఆరోపణలను ధ్రువీకరించకపోవడంతో మార్టిన్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పు అనంతరం జాకబ్ మార్టిన్ మీడియాతో మాట్లాడుతూ తన ఆవేదనను పంచుకున్నాడు. "2004లో నా జట్టు యూకే పర్యటనకు వెళ్లింది. ఒక ఆటగాడు తప్ప అందరూ తిరిగి వచ్చారు. అతను వీసా గడువు దాటి అక్కడే ఉండిపోయి, నకిలీ స్టాంపింగ్‌తో తిరిగి వస్తుండగా ఢిల్లీ విమానాశ్రయంలో పట్టుబడ్డాడు. అసలు ఎఫ్ఐఆర్‌లో నా పేరు లేదు. నేను అంతర్జాతీయ క్రికెటర్‌ను కావడం, నా పేరు పెద్దది కావడంతో విచారణ సమయంలో నన్ను ఈ కేసులో ఇరికించారు" అని మార్టిన్ తెలిపాడు. "ఈ 22 ఏళ్లలో నేను తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొన్నాను. నా రైల్వే ఉద్యోగాన్ని కోల్పోయాను. బీసీసీఐ నుంచి కూడా ఎలాంటి స్పందన లేదు. ఇప్పుడు వచ్చిన ఈ క్లీన్ చిట్ నా జీవితానికి ఎంతో ఊరటనిచ్చింది. ఇది నా జీవితంలో ఒక పెద్ద మలుపు" అని అన్నాడు. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన జాకబ్ మార్టిన్, భారత్ తరఫున 10 వన్డే మ్యాచ్‌లు ఆడి 158 పరుగులు చేశాడు.

# WTC ఫైనల్ రేసులో బిగ్ ట్విస్ట్ : 4 జట్లు ఔట్, డేంజర్‌లో మరో 3 టీమ్స్.. భారత్ సంగతేంటి?




**హైదరాబాద్ పెన్ పవర్:** లండన్ ది ఓవల్ మైదానంలో జూన్ 9వ తేదీ నుంచి జరిగే డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ పోరుకు కౌంట్‌డౌన్ స్టార్ట్ అయింది. ఈసారి ఫైనల్ చేరాలంటే 65 శాతం పాయింట్లు సాధించడం తప్పనిసరి కావడంతో ఈ పోరు పీక్స్‌కి చేరింది. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, న్యూజిలాండ్ టాప్--3లో పటిష్టంగా ఉంటే.. టీమిండియా ఐదో స్థానంలో కొనసాగుతుంది. మరోవైపు ఇంగ్లాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్ ఆశలు గాల్లో కలవగా.. బంగ్లాదేశ్ ఊహించని విధంగా రేసులోకి దూసుకొచ్చింది. ఇండియా వరుసగా మరోసారి ఫైనల్ చేరాలంటే మిగిలిన 8 టెస్టులు అత్యంత కీలకంగా మారాయి. మరి టాప్--2లో నిలిచి ఆ ట్రోఫీని ముద్దాడే ఆ రెండు జట్లు ఏవో చూడాల్సిందే.

**వెస్టిండీస్ అవుట్.. పాకిస్తాన్, ఇంగ్లాండ్‌లకు డోర్లు క్లోజ్!**

ఈ సైకిల్‌లో వెస్టిండీస్ కథ ముగిసింది. 12 మ్యాచ్‌ల్లో రెండే గెలిచి విండీస్ 9వ స్థానానికి పడిపోయింది. ఇటు పాకిస్తాన్, ఇంగ్లాండ్ పరిస్థితి కూడా అంతే.. పాక్ ఫైనల్ రేసులో నిలవాలంటే మిగిలిన 7 టెస్టులు వరుసగా గెలవాల్సిందే. 13 మ్యాచ్‌లాడిన ఇంగ్లీష్ టీమ్ మిగిలిన ఎనిమిదింటిలో 8 నెగ్గినా అగ్రస్థానాలకు రావడం దాదాపు ఇంపాజిబుల్.. ఇక శ్రీలంక కూడా మిగిలిన 7 టెస్టులు తప్పక గెలవాల్సిన పరిస్థితి నెలకొంది.

**డార్విన్ టెస్టులో మాస్ కంబ్యాక్.. రేసులోకి బంగ్లాదేశ్:**

ఎవరూ ఊహించని రీతిలో బంగ్లాదేశ్ జట్టు పాయింట్ల పట్టికను షేక్ చేసేసింది. డార్విన్ టెస్టులో ఆస్ట్రేలియాను చిత్తు చేసి చారిత్రక విజయం సాధించడంతో 66.67 శాతం పాయింట్లతో నాలుగో స్థానానికి దూసుకెళ్లింది. చేతిలో ఇంకా ఏడు టెస్టులు ఉండటం వాళ్లకు ప్లస్ పాయింట్. దీంతో ఆసీస్, సఫారీలతో పాటు బంగ్లా కూడా ఫైనల్ బెర్త్ కోసం గట్టిగా పోటీ పడుతుంది.

**భారత్ WTC ఫైనల్ చేరే లెక్కలు ఇవే:**

ప్రస్తుతం భారత జట్టు 10 మ్యాచ్‌ల్లో 5 విజయాలతో 53.33 శాతం‌ఌజుతో ఐదో పొజిషన్లో కొనసాగుతుంది. మొత్తం 18 మ్యాచ్‌ల షెడ్యూల్‌లో భారత్ ముందు ఇంకా 8 టెస్టు మ్యాచులున్నాయి. ఈ మ్యాచ్‌ల్లో అత్యంత నిలకడగా రాణిస్తేనే టీమిండియాకు ఓవల్ లో జరిగే ఫైనల్ బెర్త్ దక్కుతుంది. మరి ఈ ఐదు జట్ల మధ్య జరగబోయే యుద్ధంలో ఏ టీమ్ ని విజయం వరిస్తుందో చూడాల్సిందే.

# ఆంధ్ర కింగ్ తాలూకా అమ్మాయికి పెద్ద ఛాన్స్..!

మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ భాగ్యశ్రీ బోర్సే. ఈ అమ్మడు మొదటి సినిమాతోనే దారుణమైన డిజాస్టర్‌ను చవిచూసినప్పటికీ తన అందంతో టాలీవుడ్‌లో ఆఫర్లు దక్కించుకుంది. రవితేజ మిస్టర్ బచ్చన్ ఫలితంతో సంబంధం లేకుండా ఈ అమ్మడు విజయ్ దేవరకొండ మూవీ 'కింగ్డమ్' లో నటించే అవకాశం దక్కించుకుంది. విజయ్ దేవరకొండ కి మంచి జోడీ అనిపించుకుంది. ఆ సినిమా సైతం డిజాస్టర్‌గా నిలిచింది. కింగ్డమ్ తర్వాత భాగ్యశ్రీ మళ్లీ తెలుగులో కనిపించే అవకాశం ఉందా అని చాలా మంది అనుమానం వ్యక్తం చేశారు. కానీ భాగ్యశ్రీ అందం ముందు ఆ ఫ్లాప్స్ నిలువలేక పోయాయి. రామ్ కి జోడీగా ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమాలోనూ అందంతో ఆకట్టుకుంది. అయితే సినిమా ఫలితం విషయంలోనూ భాగ్యశ్రీ కి కాస్త ఉపశమనం లభించినట్లు అయింది.

**రామ్ ఆంధ్ర కింగ్ తాలూకా మూవీ హీరోయిన్...**

ఆంధ్ర కింగ్ తాలూకా తర్వాత అఖిల్‌తో వచ్చిన 'లెనిన్' సినిమాతో భాగ్యశ్రీ మొదటి కమర్షియల్ హిట్‌ను దక్కించుకుంది. రెండు మూడు ఏళ్లుగా హిట్ కోసం ఎదురు చూస్తున్న ఈ అమ్మడికి లక్కీగా 2026లో ఆ హిట్ లభించింది. దాంతో వెంటనే టాలీవుడ్‌లో ఇబ్బడి ముబ్బడిగా సినిమా ఆఫర్లు వస్తాయని అంతా భావించారు. కానీ ఈ అమ్మడు టాలీవుడ్‌లో కంటే ముందు బాలీవుడ్‌లో సినిమా ఆఫర్‌ను దక్కించుకుంది. ప్రముఖ బాలీవుడ్ మీడియా సంస్థ ఈ విషయాన్ని తన కథనంలో పేర్కొనడం జరిగింది. భూషన్ కుమార్ నిర్మిస్తున్న భారీ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా ఎంపిక అయిందని, ఆ సినిమాలో ఆదిత్య రాయ్ కపూర్ హీరోగా కనిపించబోతున్నట్లుగానూ ఆ కథనంలో పేర్కొన్నారు. ఆషికి 2, మలంగ్, లూడో చిత్రాల తర్వాత నిర్మాత భూషన్ కుమార్, ఆధిత్య రాయ్ కపూర్ జత కట్టడం ఇది ఐదో సారి. ఈ హిట్ కాంబోలో రాబోతున్న సినిమా కోసం భాగ్యశ్రీ ని హీరోయిన్‌గా ఎంపిక చేయడం విశేషం.



**ఆదిత్యరాయ్ కపూర్‌కి జోడీగా భాగ్య శ్రీ బోర్సే...**

ఈ సినిమాకు బాలీవుడ్ దర్శకుడు మిలాప్ మిలన్ జవేరి దర్శకత్వం వహించబోతున్నాడు. గత ఏడాది ఏక్ దీవానే కి దీవానియత్, మస్తీ 4, ఈ ఏడాది తేరా యార్ హూన్ మై సినిమాతో ప్రేక్షకులను అలరించిన దర్శకుడు మిలాప్ జవేరి దర్శకత్వంలో రూపొందబోతున్న మ్యూజికల్ అండ్ ఇంటెన్స్ వయెలెంట్ లవ్ స్టోరీ మూవీలో ఆదిత్యరాయ్ కపూర్, భాగ్యశ్రీ బోర్సే జంటగా కనిపించబోతున్నారు. ఈ మధ్య కాలంలో బాలీవుడ్‌లో మళ్లీ లవ్ స్టోరీలకు మంచి ఆధరణ లభిస్తోంది. మంచి కంటెంట్‌తో తీస్తే తప్పకుండా ఆధరిస్తారు అనే అభిప్రాయం ఉంది. అందుకే స్టార్ ప్రొడ్యూసర్స్ సైతం లవ్ స్టోరీల వెనుక పడుతున్నారు. అందులో భాగంగానే ఆదిత్యరాయ్ కపూర్, భాగ్యశ్రీ బోర్సేలతో నిర్మాత భూషన్ కుమార్ ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా ప్లాన్ చేశాడు అంటూ బాలీవుడ్ వర్గాల వారు, మీడియా సర్కిల్స్ వారు మాట్లాడుకుంటున్నారు.

**రవితేజ మూవీ మిస్టర్ బచ్చన్‌తో ఎంట్రీ...**

మహారాష్ట్రాలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో జన్మించిన భాగ్యశ్రీ బోర్సే నైజీరియాలోని లాగోస్‌లో ఏడు ఏళ్లు విద్యను అభ్యసించింది. ఆ తర్వాత మోడలింగ్ పై ఆసక్తితో ముంబైలోని ఒక బిజినెస్ మేనేజ్‌మెంట్ స్కూల్‌లో జాయిన్ అయ్యి మోడలింగ్ పై శ్రద్ధ పెట్టింది. 2023లోనే యారియాన్ సినిమాతో భాగ్యశ్రీ ఇండస్ట్రీకి పరిచయం అయింది. కానీ ఆ సినిమా పెద్దగా భాగ్యశ్రీ కి గుర్తింపు తెచ్చి పెట్టలేదు. ఆ తర్వాత మరో హిందీ సినిమా అయిన చందు ఛాంపియన్‌లోనూ నటించింది. అయితే ఆ సినిమా సైతం భాగ్యశ్రీని హిందీలో హీరోయిన్‌గా నిలబెట్టడంలో సఫలం కాలేదు. బాలీవుడ్‌లో ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తూ, మోడలింగ్ చేస్తున్న సమయంలో భాగ్యశ్రీకి లక్కీగా రవితేజకు జోడీగా మిస్టర్ బచ్చన్ సినిమాలో నటించే అవకాశం దక్కింది. టాలీవుడ్‌లో 2024లో అడుగు పెట్టిన భాగ్యశ్రీ ఈ ఏడాది హిట్ కొట్టింది. టాలీవుడ్‌లో బిజీ అవుతుందని భావిస్తున్న సమయంలో హిందీలో ఆదిత్య రాయ్ కపూర్‌కి జోడీగా నటించే అవకాశం దక్కించుకుంది. ఈ బాలీవుడ్ మూవీతో హిట్ కొడితే భాగ్యశ్రీ తిరిగి టాలీవుడ్‌లో సినిమాలు చేస్తుందా లేదా అనే అనుమానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి.





Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965